

'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 222

గురువారం 3-11-2022



బంగ్లాదేశ్ భయపెట్టినా..


ఉత్కంఠ పోరులో గట్టెక్కిన భారత్.. 5 పరుగుల తేడాతో విజయం - 12లో



ఆర్థిక పతనాన్ని అడ్డుకున్నాం

రేట్లను ముందే కట్టడి చేస్తే మరోలా ఉండేది ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'వెరీ పూర్' గాలి..!

ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమైంది. వాయు నాణ్యత సూచిక 354గా నమోదైంది. ఇది 'వెరీ పూర్' విభాగంలోకి వస్తుంది.

వివరాలు 6లో



ప్రపంచం ఆశలన్నీ భారత్‌పైనే

భారత్ మాత్రమే అన్ని రంగాల్లోనూ దూసుకుపోతూ ప్రపంచానికి అతి పెద్ద ఆశాకిరణంగా కనిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో



అమ్మకానికి ట్విట్టర్ 'బ్లూ టిక్'

ట్విట్టర్‌లో యూజర్ నేమ్ వెరిఫికేషన్ బ్లూ టిక్ కోసం ఇక నెలకు 8 డాలర్లు చెల్లించాల్సిందేనని ఎలాన్ మస్క్ ప్రకటించారు.

వివరాలు 6లో



ఇథనాల్ ధర పెంపు..

ఇథనాల్ ధరల్ని కేంద్రం పెంచింది. వచ్చే ఏడాది నుంచి పెట్రోల్‌లో 12% ఇథనాల్ కలిపేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.

వివరాలు 6లో

ఏది నిజం?

పిల్లల్ని చదువుకోనివ్వండి రామోజీ!

- ఇంకెన్నాళ్లు కార్పొరేట్ స్కూళ్లకు కొమ్ము కాసే ఈ రాతలు?
- ఇంగ్లిష్ మీడియం వద్దంటూ ఉద్యమాలు నడిపి దెబ్బతిన్నారు
- ఇప్పుడేమో ఇంగ్లిష్ రాక పిల్లలు వెళ్లిపోతున్నారంటూ విషప్రచారం
- పేద పిల్లలు ఇంగ్లిష్ చదువులు చదివితే మీకెందుకంత మంట?
- బాబు ఐదేళ్ల పాలనలో కార్పొరేట్ స్కూళ్లలో పెరిగిన విద్యార్థులు 5 లక్షలు.. అదే సమయంలో ప్రభుత్వ స్కూళ్లలో 5 లక్షలు తగ్గిన విద్యార్థులు
- బాబు హయాంతో పోలిస్తే 4 లక్షలు పెరిగిన ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు
- 98% విద్యార్థులు ఎంచుకోవటంతో ఇంగ్లిష్ మీడియం అమలు
- దానికోసం తెలుగు–ఇంగ్లిష్ భాషల్లో పాఠ్య పుస్తకాల ముద్రణ
- దేశవ్యాప్తంగా పోటీపడేందుకు సీబీఎస్ఈ విధానం అమలు
- దీనికోసం ఉపాధ్యాయులకు సైతం తగిన శిక్షణ

4లో

పరిశ్రమల సైరన్

ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో కొత్త పరిశ్రమల గెట్.. సెట్.. గో

తాజాగా 25 భారీ యూనిట్లు ఉత్పత్తికి సిద్ధం

- వాస్తవ రూపం దాల్చనున్న రూ.16,148 కోట్ల పెట్టుబడులు
- ఈ యూనిట్ల ద్వారా 19,475 మందికి ఉపాధి
- బ్లూస్టార్, అన్‌రాక్ అల్యూమినియం, సెయింట్ గోబిన్, జయరాత్ ఇస్పాత్ స్టీల్ యూనిట్ల నిర్మాణ పనులు పూర్తి
- రూ.64,555 కోట్ల విలువైన మరో 20 యూనిట్లు శంకుస్థాపనకు సన్నద్ధం
- జాబితాలో అదానీ డేటా సెంటర్, జిందాల్ స్టీల్, ఇండోసోలార్ లాంటి భారీ ప్రాజెక్టులు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో మరో 25 భారీ యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. గత మూడేళ్లలో 107 భారీ యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించగా వచ్చే మూడు నెలల్లో మరో 25 యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం కింద ఏర్పాటైన బ్లూస్టార్, యాంబర్ ఎంటర్‌ప్రైజెస్‌లకు చెందిన ఎయిర్ కండీషనర్స్, దేశంలోనే తొలి లిథియం బ్యాటరీ తయారీ యూనిట్ వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించనున్నాయి. రూ.6,700 కోట్లతో అనకాపల్లి జిల్లాలో ఏర్పాటైన అన్‌రాక్ అల్యూమినియం, కర్నూలు జిల్లాలో రూ.2,938 కోట్లతో ఏర్పాటైన స్టీల్ పరిశ్రమ, అనకాపల్లి జిల్లాలోని రూ.2,000 కోట్లతో స్థాపించిన సెయింట్ గోబిన్, రూ.1,500 కోట్లతో నెలకొల్పిన శారద మెటల్స్ ఫెర్రో అల్లాయిస్ నిర్మాణ పనులు పూర్తి చేసుకొని ఉత్పత్తి ప్రారంభించనున్నాయి. మొత్తం 25 యూనిట్ల ద్వారా రూ.16,148 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవరూపంలోకి రానున్నాయని, వీటి ద్వారా 19,475 మందికి ప్రత్యక్షంగా

మిగతా 2వ పేజీలో ▶

పెట్టుబడుల ప్రవాహం

గత మూడేళ్లలో 107 పెద్ద యూనిట్లు ప్రారంభం కావడం ద్వారా రూ.46,002 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి. ఇదే సమయంలో 1,06,249 ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు కావడం ద్వారా 7,22,092 మందికి ఉపాధి లభించింది. ఇవి కాకుండా మరో రూ.91,243.13 కోట్ల విలువైన 57 ప్రాజెక్టుల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవీ పూర్తయితే 1,09,307 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

చిట్‌ఫండ్ అక్రమాలు బట్టబయలు

పలు కంపెనీల్లో ఇటీవల విస్తృతంగా తనిఖీలు

- చాలా కంపెనీల్లో మోసాలు జరిగినట్లు గుర్తింపు
- చర్యలకు సన్నద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: చిట్‌ఫండ్ కంపెనీల ముసుగులో జరుగుతున్న అక్రమాలు, మోసాలు బట్టబయలయ్యాయి. రాష్ట్రంలోని అనేక కంపెనీలు చిట్‌ల పేరుతో సామాన్యులు చెమటోడ్చి సంపాదించుకున్న సొమ్మును దుర్వినియోగం చేస్తున్నట్లు స్పష్టమైంది. చిట్‌ఫండ్ కంపెనీలపై జిల్లాల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తుండడంతో ఇటీవల రిజిస్ట్రేషన్ల శాఖ రాష్ట్రవ్యాప్తంగా పలు కంపెనీల్లో తనిఖీలు చేసింది. జీఎస్టీ, పోలీసు అధికారులను కూడా తనిఖీ బృందాల్లో ఉంచి ఆ కంపెనీల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ తనిఖీల్లో పలు కంపెనీల్లో అక్రమాలు, మోసాలు జరిగినట్లు గుర్తించారు. చాలా కంపెనీలు చిట్స్ ద్వారా వసూలు చేసిన డబ్బును ఇతర కార్యకలాపాలకు మళ్లిస్తున్నట్లు గుర్తించారు. పలు కంపెనీలు చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఆ డబ్బును వడ్డీలకు తిప్పుతున్నట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసినట్లు స్పష్టమైంది. కొన్ని కంపెనీలు వసూలు చేసిన చిట్స్ డబ్బును తమ అనుబంధ కంపెనీలకు మళ్లించి వ్యాపారం చేసుకుంటున్నట్లు తేలింది. చిట్‌ల రికార్డులు, ఖాతాలు కూడా సరిగ్గా నిర్వహించడం లేదని వెల్లడైంది. చిట్స్ పాడుకున్నవారికి వాటి కాలం తీరిన తర్వాత కూడా చెల్లించని ఘటనలు లెక్కలేనన్ని ఉన్నట్లు తెలిసింది. అనుమతులు లేకుండా చట్టాన్ని ఉల్లంఘిస్తూ కొన్ని కంపెనీలు ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నట్టు తేలింది. చిట్‌లు పాడిన తర్వాత, గ్యారెంటీల ప్రక్రియ ముగిసేలోపు ఆ డబ్బును ప్రత్యేక బ్యాంకు ఖాతాలకు కాకుండా వేరేరకంగా వినియోగించుకున్నట్లు వెల్లడైంది. కొన్నిచోట్ల ప్రత్యేక ఖాతాల్లో ఉంచిన డబ్బును అదేరోజు వెనక్కి తీసుకున్న సందర్భాలు వెలుగులోకి వచ్చాయి. అలాగే తాము నిర్వహిస్తున్న చిట్‌లపై ప్రభుత్వానికి తప్పుడు ఓచర్లు సమర్పిస్తున్నట్టు తేలింది. నగదు నిర్వహణలో తీవ్ర ఉల్లంఘనలు జరిగాయి. చిట్‌ల డబ్బును బ్యాంకుల్లో డిపాజిట్ చేయకపోవడం, ఆ డబ్బుకు సంబంధించి నగదు రశీదులు..

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ చల్లా భగీరథ్‌రెడ్డి కన్నుమూత



నంద్యాల జిల్లా అవుకుకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి(46)కన్నుమూశారు. న్యుమోనియాతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల గవర్నర్, సీఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వివరాలు 2లో ▸

గ్రూప్-1 దరఖాస్తు గడువు 5 వరకు పొడిగింపు

రాష్ట్రంలోని గ్రూప్-1 కేడర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు గడువును నవంబర్ 5వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది.

APPSC

వివరాలు 14లో ▸

మృత్యుపాశం

కూలీల ట్రాక్టర్‌పై తెగిపడ్డ 11 కేవీ విద్యుత్ తీగ

- నలుగురు మహిళా కూలీల దుర్మరణం
- ఐదుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న మరో ఆరుగురు
- అనంతపురం జిల్లా దర్గా హొన్నూరు వద్ద ఘటన
- ప్రమాదంపై సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున తక్షణ సాయం



ఘటనాస్థలం వద్ద మృతదేహాలు

రాయదుర్గం/ బొమ్మనహాళ్/ సాక్షి, అమరావతి: కాసేపట్లో ఇంటికి చేరాల్సిన వ్యవసాయ కూలీలను కరెంటు తీగ కాటేసింది. ట్రాక్టర్‌లో ఇళ్లకు తిరుగు పయనమవుతున్న సమయంలో వారి బతుకులు బుగ్గిపాలయ్యాయి. అప్పటి వరకు మేఘావృతమై కనిపించిన ఆకాశం.. పనులు పూర్తయ్యే సరికి చిరుజల్లులు కురిపించింది. ఈ కారణంగా 11 కేవీ విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్‌కు గురయ్యాయి. ఓ తీగ తెగి కూలీలు వెళ్తున్న ట్రాక్టర్‌పై పడింది. అక్కడికక్కడే నలుగురు మహిళా కూలీలు మృత్యువాత పడ్డారు. మరో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం దర్గా హొన్నూరు వద్ద

మిగతా 10వ పేజీలో ▶



'అమూల్' రైతులకు అదనపు లాభం

పాల సేకరణ ధరలు మరోసారి పెంపు

లీటర్‌కు పెరిగిన ధరలు ఇలా..

గేదె పాలు	ఆవు పాలు
రూ. 3.30	రూ. 1.58

- లీటర్ గేదె పాలు రూ.82.50, ఆవుపాలు రూ.39.48
- కిలో వెన్నపై రూ.30, ఘన పదార్థాలపై రూ.11 పెంపు
- పది జిల్లాల పరిధిలో పెంపు వర్తింపు.. 16 జిల్లాల్లో 2.86 కోట్ల లీటర్ల పాల సేకరణ
- పాడి రైతులకు రూ.208.23 కోట్ల చెల్లింపులు.. డిసెంబర్‌లోగా మిగిలిన జిల్లాలకు విస్తరణ

3లో

ప్రజల దీవెనలు మన వైపే

వికేంద్రీకరణ ద్వారా సుపరిపాలన అందిస్తున్నాం: సీఎం



- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు పంపిణీ చేస్తున్నాం
- అందుకే ప్రజలు మనల్ని ఆశీర్వదిస్తున్నారు
- ఇలాంటప్పుడు మీరూ, నేను కలిసికట్టుగా పనిచేస్తే 2024 ఎన్నికల్లో క్లీన్ స్వీప్ సాధ్యమే
- మండపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం
- ప్రతి కార్యకర్తతో విడివిడిగా మాట్లాడి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి
- ఇప్పటి వరకు మండపేట నియోజకవర్గ ప్రజలకు డీబీటీ కింద రూ.946 కోట్ల లబ్ధి
- ప్రతి గ్రామంలో 92% ఇళ్లకు సంక్షేమ పథకాలు
- వచ్చే ఎన్నికల్లో తోట త్రిమూర్తులును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

2లో

రెండు రోజులు వర్షాలు

- కోస్తా, తమిళనాడు, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరోవైపు ఉపరితల ద్రోణి కూడా కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు ఉత్తర కోస్తాలో కొన్నిచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.



5లో

ఇదండీ సంగతి



పార్టీ యాక్టివ్‌గా లేకపోయేసరికి వేరే యాక్టివిటీస్‌లో ఇన్‌వాల్వ్ అవుతున్నార్సార్!!

ప్రాసెసింగ్ చార్జీలొద్దు

రుణాలపై అన్ని బ్యాంకులకు ఆదేశాలివ్వాలంటూ ఆర్బీఐకి లేఖ

పొదుపు సంఘాలకు మరింత బాసటగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం

- సీఎం ఆదేశాల మేరకు ఆర్బీఐ సీజీఎంకు లేఖ రాసిన సెర్ప్ సీఈవో
- ప్రస్తుతం రూ.20 లక్షల రుణంపై రూ.20 వేల దాకా ప్రాసెసింగ్ ఫీజు
- ఇది పేద మహిళలకు భారంగా మారకూడదని స్పందించిన సర్కారు
- బ్యాంకర్ల సమితి సమావేశంలో ఇటీవల ప్రస్తావించిన ప్రభుత్వం
- ప్రభుత్వ చర్యలతో కొన్ని బ్యాంకుల్లో ఇప్పటికే కొంత మేర మినహాయింపు
- యూనియన్ బ్యాంకు, పీఎన్‌బీలో రూ.10 లక్షలు.. ఆప్కాబ్‌లో రూ.20 లక్షల దాకా..



సాక్షి, అమరావతి : పొదుపు సంఘాల పేరిట మహిళలు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలపై బ్యాంకులు ఎలాంటి ప్రాసెసింగ్ చార్జీలు వసూలు చేయకుండా ఆదేశాలివ్వాలని ప్రభుత్వం బుధవారం రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ను కోరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇందుకు సంబంధించి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో మహ్మద్ ఇంతియాజ్ బుధవారం ముంబయిలోని

మిగతా 2వ పేజీలో ▶

అది రాజకీయ యాత్రే

రైతులను ముందుంచి ఇతరులు యాత్రను నడిపిస్తున్నారు

- సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా యాత్ర ఎందుకు చేస్తున్నారు?
- యాత్రల ద్వారా కోర్టులపై ఒత్తిడి తెస్తున్నారా?
- మా తీర్పును ప్రభుత్వం అమలు చేయకపోతే ధిక్కార పిటిషన్ వేసుకోండి
- అంతే తప్ప యాత్ర చేయడం ఏమిటి?
- ఇలాంటి చర్యలను ఎంతమాత్రం అభినందించబోం.. అమరావతి రైతుల పిటిషన్లతో హైకోర్టు నిండిపోయింది
- హైకోర్టు ధర్మాసనం తీవ్ర ఆక్షేపణ
- అప్పీళ్లపై అభ్యంతరం తెలుపుతూ కౌంటర్ దాఖలు చేసిన ప్రభుత్వం
- తదుపరి విచారణ ఈ నెల 7కి వాయిదా



సాక్షి, అమరావతి: అమరావతే రాజధానిగా ఉండాలంటూ చేస్తున్న మహాపాదయాత్రపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ పాదయాత్రను రాజకీయ యాత్రగా హైకోర్టు తేల్చింది. రైతులను ముందుంచి ఇతరులు ఈ యాత్రను నడిపిస్తున్నారని స్పష్టం చేసింది. అమరావతికి అనుకూలంగా తాము తీర్పు ఇచ్చినప్పటికీ రైతులు పాదయాత్ర చేస్తుండటాన్ని ఆక్షేపించింది. రైతులు

మిగతా 14వ పేజీలో ▶

అప్పీళ్లకు విచారణార్హతే లేదు..

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. రాజధాని రైతుపరిరక్షణ సమితి, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య దాఖలు చేసిన ఈ అప్పీళ్లకు విచారణార్హతే లేదన్నారు. హైకోర్టు విధించిన షరతులను రైతులు ఉల్లంఘించారని, మరోసారి వాటిని ఉల్లంఘిస్తే అనుమతి రద్దుకోసం కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛను హైకోర్టు పోలీసులకు ఇచ్చిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రైతుల ఉల్లంఘనలకు పూర్తి ఆధారాలున్నాయన్నారు. అప్పీళ్ల విచారణార్హతపై అభ్యంతరం తెలుపుతూ కౌంటర్ దాఖలు చేశామని తెలిపారు. ఆ కౌంటర్‌ను తమ ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించిన ధర్మాసనం విచారణను ఈ నెల 7కి వాయిదా వేసింది.

క్లుప్తంగా

కాటన్ బ్యారేజీకి అంతర్జాతీయ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న సతీష్‌కుమార్

ఏలూరు(మెట్రో): ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియా హెరిటేజ్ అవార్డు తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి దక్కింది. బుధవారం నోయిడాలో 7వ ఇండియా వాటర్ వీక్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఈ అవార్డును డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీర్ రేవు సతీష్ కుమార్ సీడబ్ల్యూసీ మెంబర్ వారా చేతులమీదుగా అందుకున్నారు. ప్రతిష్టాత్మకమైన అవార్డు గోదావరిపై కట్టిన ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజినీరింగ్ చీఫ్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలంలో 213 టీఎంసీల నీటి నిల్వలు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో బుధవారం సాయంత్రానికి 202.9673 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పాదన కొనసాగుతోంది. ఎగువ ప్రాజెక్టులైన జూరాల, సుంకేసుల నుంచి 29,792 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. మంగళవారం నుంచి బుధవారం వరకు కుడి గట్టు కేంద్రంలో 14.619 మిలియన్ యూనిట్లు, ఎడమ గట్టు కేంద్రంలో 12.143 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 55,647 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 5,792 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,081 క్యూసెక్కుల నీటిని వదిలారు. డ్యామ్ నీటిమట్టం 882.70 అడుగులకు చేరుకుంది.

నేడు జలసంఘం బృందం పోలవరం పర్యటన

పోలవరం రూరల్: కేంద్ర జలసంఘం నిపుణుల బృందం సభ్యులు గురువారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించనున్నారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతి, డిజైన్లు తదితర అంశాలపై చర్చించనున్నట్లు ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. కేంద్ర జల సంఘంలోని డిజైన్‌ల విభాగానికి చెందిన చీఫ్ ఇంజనీర్ అనిల్‌జైన్, ఎంబాక్‌మెంట్ విభాగానికి చెందిన డైరెక్టర్ ఖయ్యూం మహ్మద్, దీపక్ సి.భట్, ఏకే వర్మ, సీఎస్ఎంఆర్ఎస్ బృందం సభ్యులు, వ్యాప్‌కోస్ ప్రతినిధులు ఏఎన్ ప్రసాద్, ఎం.రఘురామ్, రాజేష్‌కుమార్, దేవేంద్రరావు ఉదయం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుని పనులను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

మాదాసి కురువకు మండల స్థాయిలోనే ధ్రువపత్రాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మాదాసి కురువ (మెదరి కురువ) కులానికి మండల స్థాయిలోనే ధ్రువపత్రాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. షెడ్యూల్డ్ కులం (ఎస్సీ)కి చెందిన వీరికి రెవెన్యూ డివిజన్‌లోని ఆర్డీవో స్థాయి అధికారులు ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారు. ధ్రువపత్రాల కోసం మాదాసి కురువకు చెందిన వారు పడుతోన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధ్రువపత్రాల జారీలో నిబంధన (రూల్)ను ప్రభుత్వం సవరించింది. మాదాసి కురువ (మెదరి కురువ) కులానికి చెందిన వారికి ఇకపై మండల స్థాయిలోనే ధ్రువపత్రాలు ఇవ్వాలని, కుల, ఆదాయ, నివాస, పుట్టిన తేదీ ధ్రువపత్రాలు ఆయా మండల తహశీల్దార్, డిప్యూటీ తహసిల్దార్ హోదాలోని అధికారులు జారీ చేయాలని ప్రభుత్వ ముఖ్య ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి బుధవారం ఉత్తర్వులిచ్చారు.

సీఆర్‌డీఏ చట్టసవరణపై విచారణ 9కి వాయిదా



సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికి కూడా ఇళ్లస్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం సీఆర్‌డీఏ చట్టాన్ని సవరించడంపై రాజధాని రైతుపరిరక్షణ సమితి దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది. ఇదే అంశంపై దాఖలైన మరో వ్యాజ్యాన్ని ప్రస్తుత వ్యాజ్యానికి జతచేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉపమాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. తాజా సవరణ చట్టం ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉందన్నారు. అందువల్ల మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని, వీలైనంత త్వరగా ఈ వ్యాజ్యంపై విచారణ జరపాలని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. ఇదే అంశంపై మరో వ్యాజ్యం దాఖలైందని తెలిపారు. దాన్ని కూడా ప్రస్తుత వ్యాజ్యంతో జతచేయాలని అభ్యర్థించారు. ఇందుకు ధర్మాసనం అంగీకరిస్తూ విచారణను వాయిదా వేసింది.



నెల్లూరులో చికిత్స పొందుతున్న గొల్ల కందుకూరుకు చెందిన పోలయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ యామాలమ్మ



శ్రీకాకుళం జిల్లా బొరిగిపేటకి చెందిన డయాలసిస్ రోగి సత్యంకు పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ సుశీల



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురంలో వృద్ధుడు నారాయణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కె.హెప్సిబా



చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో కట్టకిందపల్లికి చెందిన పెంచలయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సుధాకర్



ఏలూరు ద్వారకానగర్‌లో తలారి జార్జికి వృద్ధాప్య పింఛన్ అందచేస్తున్న వలంటీర్ ఖమురున్నీసా

59.74 లక్షల మందికి పంపిణీ పూర్తి

రెండు రోజుల్లో 95.84 శాతం మందికి అందిన పింఛన్ నగదు

నవంబర్ 1, 2 తేదీల్లో వలంటీర్లు 59.74 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ నెలకుగాను రాష్ట్ర వ్యాప్తంగా 62,33,382 మంది లబ్ధిదారులకు రూ.1,585.60 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం వరకు 59,74,105 మంది లబ్ధిదారులకు రూ.1,519.25 కోట్లు అందించారు. ఇప్పటివరకు 95.84 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని సెర్ప్ అధికారులు తెలిపారు. మరో మూడు రోజుల పాటు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందన్నారు.

- సాక్షి, అమరావతి



గుంటూరుకి చెందిన దివ్యాంగులు అక్క, తమ్ముడు హేమలత, దుర్గ సాయికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పద్మ

చిట్‌ఫండ్ అక్రమాలు బట్టబయలు



▶ మొదటి పేజీ తరువాయి

వోచర్లు ఇవ్వకపోవడాన్ని తనిఖీ అధికారులు గుర్తించారు. కొన్ని లావాదేవీలపై నేరుగా ఆదాయపన్ను శాఖ పెనాల్టీ పడే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. జీఎస్టీ చట్టాన్ని కూడా చిట్‌ఫండ్ కంపెనీలు ఉల్లంఘిస్తున్నట్టు తేలింది. తనిఖీల్లో గుర్తించిన అంశాలతో స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అక్రమాలు జరిగిన కంపెనీలు, వాటి వివరాలను అందులో పొందుపరిచారు. వాటి ఆధారంగా అక్రమాలు జరిగిన కంపెనీలపై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది.

ప్రజల దీవెనలు మన వైపే

మండపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం





మండపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'వికేంద్రీకరణతో సుపరిపాలన.. లంచాలకు తావు లేకుండా, వివక్ష చూపించకుండా, అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తుండటం వల్ల రాష్ట్ర ప్రజల దీవెనలు మన వైపు కనిపిస్తున్నాయి. ఇలాంటి అనుకూల పరిస్థితులు ఉన్నప్పుడు మీరూ, నేనూ కలిసికట్టుగా పనిచేస్తే 175 శాసనసభ స్థానాల్లో విజయం సాధించడం సుసాధ్యమే' అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్బోధించారు. 'డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) కింద సంక్షేమ పథకాల ద్వారా బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేయడం నా బాధ్యత. అది నేను నిర్వర్తిస్తా. మీరంతా కలిసి ప్రతి గ్రామంలో మనం చేస్తున్న మంచిని ప్రతి ఇంటికి తీసుకుపోవడమే కాకుండా.. వారికి అర్థమయ్యేలా వివరించి చెప్పాలి. వాళ్ల చల్లని ఆశీస్సులు తీసుకోవాలి. ఆ ఆశీస్సులను మనకు అనుకూలంగా మార్చుకోవాలి. ఇలా మీరూ, నేనూ కలిసికట్టుగా పనిచేస్తే 2024 ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయగలుగుతాం' అని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన వారితో సమావేశమయ్యారు. ప్రతి కార్యకర్తతో విడివిడిగా మాట్లాడి.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండపేట నియోజకవర్గానికి చేసిన మంచిని, అభివృద్ధిని గణాంకాలతో వివరించారు. వచ్చే ఎన్నికల్లో మండపేట నియోజకవర్గం నుంచి తోట త్రిమూర్తులును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని రావాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సీఎం వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

అన్ని విధాలా సన్నద్ధం కావాలి

- మిమ్మల్ని కలవడానికి, ఇక్కడికి రమ్మని చెప్పడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి. ఒకటి మిమ్మల్ని కలిసి చాలా రోజులైంది. కలిసినట్టు ఉంటుందన్నది ప్రధాన కారణమైతే.. రెండోది మరో 18 నెలల్లో రానున్న ఎన్నికలకు సన్నద్ధం కావాల్సి ఉంది. ఇంత త్వరగా ఎందుకని అనుకోవచ్చు. ఎన్నికలప్పుడు ప్రజల దగ్గరికి వెళ్లడం, ప్రజలను ఆశీర్వదించమని కోరడం సహజం. కానీ.. మొట్టమొదటి సారిగా గత ప్రభుత్వాలలో ఎప్పుడూ, ఎక్కడా చూడనట్టుగా ఈ రోజు రాష్ట్రంలో మార్పులు జరుగుతున్నాయి. వాటన్నింటినీ ప్రజలకు చెప్పాలి.
- రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి 2 వేల జనాభాకు 12 మంది ఉద్యోగులను అక్కడే కూర్చుని పనిచేసేట్టుగా ఏర్పాటు చేశాం. ప్రతి 50 ఇళ్లను ఒక వలంటీర్‌తో అనుసంధానం చేసి.. అర్హత ఉన్న ప్రతి గడప, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల కింద మంచి చేయాలని తాపత్రయపడుతున్నాం. పారదర్శకతతో అందరికీ అన్ని పథకాలు రావాలని శాచ్యురేషన్ (సంతృప్త) విధానంలో అడుగులు వేశాం.
- మూడేళ్ల నాలుగు నెలల్లోనే ఒక్క మండపేట నియోజకవర్గంలోనే రూ.946 కోట్లను డీబీటీ ద్వారా బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల చేతుల్లో పెట్టాం. వైఎస్సార్ పెన్షన్ కానుక, రైతు భరోసా, అమ్మఒడి, ఆసరా మొదలుకుని క్రాప్ ఇన్సూరెన్స్, చేయూత, విద్యాదీవెన వరకు రకరకాల పథకాల ద్వారా మేలు చేశాం. ఎవరికి ఎంతిచ్చామో, ఎవరికి ఏ రకంగా మేలు జరిగిందన్నది ఆధారాలతో సహా పారదర్శకంగా చెబుతున్నాం. ఎక్కడా లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హుడైన ఏ ఒక్కరూ మిస్ కాకుండా దేవుడి దయతో అడుగులు వేయగలిగాం. ఇటువంటి మార్పు గతంలో ఎప్పుడూ జరగలేదు. అలాంటి మార్పు ఈ రోజు రాష్ట్రంలో కనిపిస్తోంది.

175కు 175 ఎందుకు గెలవం?

- మండపేట నియోజకవర్గంలో 96,469 ఇళ్లు ఉన్నాయి. ఇందులో మన పథకాలు చేరిన ఇళ్లు 91.96 శాతం. అంటే సుమారు 92 శాతం ఇళ్లలో ఆ అక్కచెల్లెమ్మల పేర్లతో ఎన్ని పథకాలు అందాయి అని.. ఆధార్ కార్డు డీటైల్స్‌తో సహా చెప్పగలిగే పరిస్థితుల్లో సహాయం చేయగలిగాం.
- గ్రామమే ఒక యూనిట్‌గా తీసుకుంటే ఆ గ్రామంలో 92% ఇళ్లకు.. ప్రతి ఇంట్లో మనం మంచి చేశామని సగర్వంగా తలెత్తుకుని చెప్పుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆ జరిగిన మంచిని వివరిస్తూ మనం గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమం చేస్తున్నప్పుడు అవునన్నా.. పథకాలు అందాయని అక్కచెల్లెమ్మలు చల్లని ఆశీస్సులు మనమీద చూపించినప్పుడు ఆ గ్రామంలో మనం తప్పకుండా గెలుస్తాం.
- గ్రామంలో గెల్చినప్పుడు నియోజకవర్గంలో గెలుస్తాం. గ్రామం, నియోజకవర్గంలో గెల్చినప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 175కు 175 ఎందుకు రావు?
- మండపేట మున్సిపాలిటీతో సహా జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచుల లెక్క తీసుకుంటే.. మున్సిపాలిటీలో 30 వార్డుల్లో 23, జెడ్పీటీసీలు మూడింటికి మూడు, ఎంపీపీలు మూడింటికి మూడు వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. ఏ లెక్కలు తీసుకున్నా గతంలో రానివి ఇప్పుడు వచ్చాయి. కుప్పం నియోజకవర్గంలో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపాల్టీ అన్నీ క్లీన్ స్వీప్ చేశాం.

కళ్లెదుటే కన్పిస్తున్న మార్పు

- ప్రతి గ్రామంలో కళ్లెదుటే కొట్టొచ్చినట్టు మార్పు కన్పించేలా అభివృద్ధి పనులు చేశాం. గ్రామంలోకి అడుగుపెడుతూనే సచివాలయం కనిపిస్తుంది. వలంటీర్ వ్యవస్థ కనిపిస్తుంది. ఆర్బీకేల ద్వారా రైతన్నను చేయి పట్టుకుని నడిపించే కార్యక్రమం జరుగుతోంది. ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, విలేజ్ క్లినిక్‌లు కనిపిస్తాయి. శరవేగంగా డిజిటల్ లైబ్రరీలు కట్టే కార్యక్రమం కూడా మొదలు పెడుతున్నాం. ఇవన్నీ గతంలో లేనివి. ఇవన్నీ గ్రామాల రూపురేఖలు మారుస్తున్నాయి.
- గతంలో పిల్లలు చదువుకునే వయసుకు వచ్చేసరికి తల్లిదండ్రులు పిల్లల చదువుల కోసం గ్రామాలు వదిలిపెట్టే పరిస్థితి. ఆ పరిస్థితి పోయి ఇంగ్లిష్ మీడియం బడులు మన గ్రామాల్లో వస్తున్నాయి. విలేజ్ క్లినిక్‌ల ద్వారా మన గ్రామంలోనే ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంతా ఒకేచోట ఉంటూ.. 24 గంటలు అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తారు.
- 67 రకాల మందులు, 14 రకాల పరీక్షలు చేసేట్టుగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్రియేట్ చేసి ఊర్లోనే వైద్యం అందిస్తున్న పరిస్థితి. ఇంత మార్పు గతంలో జరగలేదు. వికేంద్రీకరణ (డీసెంట్రలైజేషన్) ఈ స్థాయిలోకి వెళ్లి మంచి చేయాలన్న ఆరాటం గతంలో లేదు. ఇవన్నీ ఇప్పుడు జరుగుతున్న నేపథ్యంలో కచ్చితంగా ఈ నియోజకవర్గంలో కూడా మార్పు రావాలి. వై నాట్ 175? కచ్చితంగా జరుగుతుంది.
- ఈ సమావేశానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ హాజరయ్యారు.

మరింత మంచి చేయడానికే..

- రాష్ట్రంలో ఇంత మార్పు జరుగుతున్నప్పుడు దాన్ని మనం ప్రజలదగ్గరకు తీసుకుని వెళ్లి, వారికి ఇవన్నీ గుర్తు చేసి.. ప్రజల ఆశీస్సులు మనం తీసుకుని మరింత సమర్థంగా అడుగులు వేసేందుకు మిమ్మల్ని భాగస్వాములను చేస్తున్నాం. ఈ క్రమంలోనే మొట్టమొదటిసారిగా గడప గడపకూ మన ప్రభుత్వం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ కార్యక్రమం చేపట్టి దాదాపు నాలుగు నెలలు కావస్తోంది.
- మన ఎమ్మెల్యేగానీ మన ఎమ్మెల్యే అభ్యర్థిగానీ గ్రామానికి వెళ్లినప్పుడు ఆ గ్రామంలో సచివాలయ వ్యవస్థ, మండల స్థాయి అధికారులు, గ్రామంలో సర్పంచులు, ఎంపీటీసీలు అందరూ మమేకమై ప్రతి గడపనూ తట్టి, ప్రతి గడపలోనూ జరిగిన మంచిని వివరిస్తూ వాళ్ల ఆశీర్వాదాలు తీసుకుంటూ.. మరోవైపు పొరపాటున ఎవరైనా ఎక్కడైనా మిగిలిపోయి ఉంటే, అటువంటి వారికి మేలు చేస్తూ ఈ కార్యక్రమం చేస్తున్నాం.
- ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు డబ్బులు కూడా కేటాయించాం. ఈ నిధులతో ఆ సచివాలయానికి వెళ్లినప్పుడు ఆ సచివాలయ పరిధిలో అత్యంత ప్రాధాన్యతగా ఉన్న పనులు చేపట్టాలి. సచివాలయానికి రూ.20 లక్షలు అంటే నియోజకవర్గానికి దాదాపు రూ.20 కోట్లు కేటాయించినట్లవుతుంది. అందువల్ల ఆ సచివాలయంలో రెండు రోజుల పాటు.. ఒక్కో రోజు కనీసం 6 గంటలు గడపాలి. ఆ తర్వాత ఆ గ్రామంలో ప్రాధాన్యత ఉన్న పనులు చేపట్టాలి.

ఎమ్మెల్సీ చల్లా భగీరథ్‌రెడ్డి కన్నుమూత

- న్యుమోనియాతో బాధపడుతూ హైదరాబాద్ ఏఐజీలో చికిత్స
- 4 రోజులుగా వెంటిలేటర్‌పైనే.. బుధవారం తుదిశ్వాస



సాక్షి, అమరావతి/అవుకు: నంద్యాల జిల్లా అవుకుకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ చల్లా భగీరథ్‌రెడ్డి(46) కన్నుమూశారు. గత కొంతకాలంగా న్యుమోనియాతో బాధపడుతున్నారు. ఈ మధ్యనే అయ్యప్పమాల ధరించిన ఆయన.. శబరిమల వెళ్లొచ్చిన అనంతరం అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు చెప్పారు. 1976 మే 28న జన్మించిన భగీరథ్‌రెడ్డి.. ఉమ్మడి కర్నూలు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయనకు భార్య శ్రీలక్ష్మి(అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు), ఇద్దరు కుమారులు రాజ్యాభిషేక్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి ఉన్నారు.

గవర్నర్ విచారం

ఎమ్మెల్సీ చల్లా భగీరథ్‌రెడ్డి మృతిపట్ల గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. భగీరథ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని గవర్నర్ ఆకాంక్షించారని రాజ్‌భవన్ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

సీఎం జగన్ దిగ్భ్రాంతి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ చల్లా భగీరథ్‌రెడ్డి అకాల మరణం పట్ల సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అవుకులోని ఒక ప్రముఖ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన భగీరథ్‌రెడ్డి చురుకైన నాయకుడని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు.

ప్రాసెసింగ్ చార్జీలొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

రిజర్వు బ్యాంక్ ప్రధాన కార్యాలయంలోని చీఫ్ జనరల్ మేనేజర్, హైదరాబాద్‌లోని రిజర్వు బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ జనరల్ మేనేజర్‌తో పాటు రాష్ట్ర బ్యాంకర్ల సమితి(ఎస్ఎల్‌బీసీ) కన్వీనర్లకు వేర్వేరుగా లేఖ రాశారు. రుణం ఇచ్చే బ్యాంకును బట్టి ప్రస్తుతం పొదుపు సంఘాల రుణ మొత్తంపై 0.5 శాతం నుంచి 1.2 శాతం దాకా ప్రాసెసింగ్ ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రస్తుతం పొదుపు సంఘాల మహిళలకు గరిష్టంగా రూ.20 లక్షల వరకు బ్యాంకు రుణాలు ఇచ్చే వెసులు బాటు ఉంది. అంటే, మహిళలు రూ.20 లక్షల రుణం తీసుకుంటే సుమారు రూ.20 వేలు ప్రాసెసింగ్ ఫీజు పేరిట బ్యాంకులు మినహాయించుకుంటున్నాయి. పొదుపు సంఘాలు తీసుకునే రుణాల్లో అత్యధికులు పేద కుటుంబాలకు చెందిన వారే కావడంతో ఈ తరహా ప్రాసెసింగ్ చార్జీలు వారికి భారంగా తయారవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఈ లేఖ ద్వారా ఆర్బీఐ దృష్టికి తీసుకొచ్చింది. ఈ తరహా రుణాలపై ప్రాసెసింగ్ చార్జీలతో పాటు డాక్యుమెంటేషన్ చార్జీలు, ఇతర అడహాక్ చార్జీలు సైతం బ్యాంకులు వసూలు చేయకుండా అన్ని బ్యాంకులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆర్బీఐని ప్రభుత్వం కోరింది.



రుణాల చెల్లింపులో దేశంలోనే ప్రథమ స్థానం


పొదుపు సంఘాల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరాతో పాటు సకాలంలో రుణాలు చెల్లించే వారికి సున్నా వడ్డీ పథకం అమలు వంటి చర్యలు చేపట్టడంతో రాష్ట్రంలో ప్రస్తుతం మహిళలు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలలో 99.5 శాతం సకాలంలో చెల్లిస్తున్నారు. పొదుపు సంఘాల రుణాల చెల్లింపుల్లో మన రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దీంతో బ్యాంకులు కూడా మహిళా పొదుపు సంఘాల గరిష్ట పరిమితి మేరకు రుణాలు ఇస్తున్నాయి. మరో పక్క.. రాష్ట్రంలో పొదుపు సంఘాల పేరిట ప్రస్తుతం రూ.30 వేల కోట్ల పైబడి మహిళలు బ్యాంకు నుంచి రుణాలు తీసుకొని ఉన్నారు. అందులో ఎప్పటికప్పుడు కిస్తీ ప్రకారం పాత రుణాల చెల్లింపులు పూర్తి కాగానే, తిరిగి కొత్తగా ఏటా రూ.15 వేల కోట్లు రుణాలు పొందుతున్నారు.

ఇప్పటికే కొన్ని బ్యాంకుల స్పందన

- పొదుపు సంఘాలు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలపై రూ.2.5 లక్షల వరకు ప్రాసెసింగ్ చార్జీలను మినహాయిస్తూ ఆర్బీఐ గతంలోనే అన్ని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. మూడేళ్ల క్రితం వరకు మన రాష్ట్రంలోనూ అత్యధిక సంఘాలు ఈ పరిమితి మేరకే బ్యాంకుల నుంచి రుణాలు పొందే పరిస్థితి ఉంది.
- అయితే, రాష్ట్రంలో ఇటీవలి కాలంలో అత్యధిక పొదుపు సంఘాలు బ్యాంకుల నుంచి రూ.10 లక్షలకు పైబడే రుణాలు పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాసెసింగ్ చార్జీ భారంగా మారింది. ఈ విషయం ప్రభుత్వం దృష్టి రాగానే.. గత రెండేళ్లగా జరిగిన ఎస్ఎల్‌బీసీ సమావేశాలన్నింటిలో సీఎం జగన్ ప్రభుత్వం ఈ విషయాన్ని బ్యాంకర్ల దృష్టికి తీసుకొచ్చింది.
- ఫలితంగా రూ.10 లక్షల వరకు ప్రాసెసింగ్ చార్జీలను మినహాయిస్తూ యూనియన్ బ్యాంకు (గతంలో ఆంధ్రా బ్యాంకు) 2021 సెప్టెంబర్ 1వ తేదీన అన్ని బ్రాంచ్‌లకు ఆదేశాలు జారీ చేంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు కూడా 2021 ఆగస్ట్ 23వ తేదీన అదే తరహా ఉత్తర్వులిచ్చింది.
- సకాలంలో చెల్లింపులు జరుగుతుండడంతో ఇప్పుడు బ్యాంకులు రూ.20 లక్షల దాకా సంఘాల పేరిట రుణాలు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన బ్యాంకర్ల సమావేశంలో సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకంగా రూ.20 లక్షల వరకు ప్రాసెసింగ్ చార్జీల మినహాయింపు విషయాన్ని ప్రస్తావించారు. ఆ అంశాన్ని సమావేశ మినిట్స్‌లో ఉదహరించి, అన్ని బ్యాంకులకు ఆదేశాలివ్వాలంటూ సూచన చేశారు.
- రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ బ్యాంకు (ఆప్కాబ్) ఇప్పటికే రూ.20 లక్షల వరకు పొదుపు సంఘాల రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు వసూలును పూర్తిగా మినహాయిస్తూ ఆదేశాలు జారీ చేసిందని సెర్ప్ అధికారులు వెల్లడించారు.

పేదలకు మేలు చేయడమే సీఎం లక్ష్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదలకు మంచి చేయడానికి సీఎం జగన్ చిత్తశుద్ధితో పని చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చెప్పారు. సీఎంగా మళ్లీ వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరిస్తేనే తమకు మరింత ప్రయోజనం కలుగుతుందని రాష్ట్ర ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మండపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సీఎం సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో తాను టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయానని గుర్తు చేశారు. ఫలితాలు వెలువడిన రెండు నెలలకే వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించి, మండపేట నియోజకవర్గ బాధ్యతలతోపాటు ఎమ్మెల్సీ పదవిని సీఎం వైఎస్ జగన్ తనకు ఇచ్చారన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం శాయశక్తులా పని చేస్తానని స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌దేనని చెప్పారు.

పరిశ్రమల సైరన్

▶ మొదటి పేజీ తరువాయి

ఉపాధి లభించనుందని అధికారులు వెల్లడించారు.

మరో 20 భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన

ఉత్పత్తిని ప్రారంభించడంతోపాటు కొత్త ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులిచ్చి నిర్మాణ పనులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వచ్చే 3 నెలల్లో రూ.64,555 కోట్ల విలువైన 20 భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసే విధంగా పరిశ్రమల శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా రూ.300 కోట్లతో ఏర్పాటవుతున్న అసాగో బయోఇథనాల్ ప్రాజెక్టుకు శుక్రవారం భూమి పూజ జరగనుంది. వీటితో పాటు త్వరలోనే విశాఖలో రూ.14,634 కోట్లతో అదానీకి చెందిన వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్, ఐటీ పార్క్ పనులు ప్రారంభం కానున్నాయి. రూ.43,143 కోట్లతో నెల్లూరు జిల్లా రామాయపట్నం వద్ద ఇండోసోల్ సోలార్ కంపెనీ సౌర విద్యుత్‌కు చెందిన ఉపకరణాల తయారీ యూనిట్‌కు సంబంధించిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తిరుపతి జిల్లాలో 2.25 మిలియన్ టన్నుల జిందాల్ స్టీల్ ప్లాంట్ పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నారు. మొత్తం 20 యూనిట్లు నిర్మాణం పూర్తి చేసుకొని ఉత్పత్తి ప్రారంభిస్తే 44,285 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఫిబ్రవరి చివరి వారంలో జరిగే పెట్టుబడుల సదస్సు నాటికి యూనిట్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు పూర్తి చేయాలని పరిశ్రమల శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

రాష్ట్రానికి దిగ్గజ సంస్థలు: మంత్రి గుడివాడ

రాష్ట్రంలోకి టాటా, బిర్లా, అదానీ, సంఘ్వీ లాంటి దిగ్గజ కంపెనీలతో పాటు ఇన్ఫోసిస్, రాండ్‌స్టాండ్, యాసెంచర్ లాంటి ప్రముఖ ఐటీ కంపెనీల యూనిట్లు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా ఉత్తుత్తి పెట్టుబడుల ఒప్పందాలు కాకుండా వాస్తవ రూపం దాల్చేలా యూనిట్లు ఏర్పాటవుతున్నాయి. ముఖ్యంగా పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధిపై ముఖ్యమంత్రి జగన్ ప్రధానంగా దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ఒకేసారి నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది.

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలకు రోజుకు రూ.23 కోట్ల ఖర్చు

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్



కర్నూలు(అర్బన్): రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రోజు రూ.23 కోట్లు ఖర్చు చేస్తున్నదని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిని సమీక్షించేందుకు ఆయన బుధవారం కర్నూలు వచ్చారు. జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావుతో కలిసి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాల్లో పురోగతి చూపితే రోజుకు రూ.50 కోట్లు కూడా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గత ఏడు నెలల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. 'నవరత్నాలు–పేదలందరికి ఇళ్లు' కార్యక్రమంలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వచ్చే ఎనిమిది నెలల్లోపు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇంటి పట్టాలను ఇవ్వడం జరిగిందని, ఇందులో మొదటి విడతలో 18 లక్షల ఇళ్లను నిర్మిస్తున్నామని వివరించారు.

ఏపీటీఎస్ ఎండీగా రమణారెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (ఏపీటీఎస్) మేనేజింగ్ డైరెక్టర్‌గా రమణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఏపీటీఎస్ ఎండీగా ఉన్న నందకిషోర్ రైతు బజార్ల సీఈవోగా బదిలీ కావడంతో రమణారెడ్డిని ఎండీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. రమణారెడ్డి ఇప్పటివరకు ఏపీ టవర్స్ లిమిటెడ్ సీఈవోగా వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా మురళీకృష్ణ

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు విజయవాడకు చెందిన పల్లపోతు మురళీకృష్ణను పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

'తుని-సబ్బవరం'ను జాతీయ రహదారిగా మార్చండి

కేంద్రమంత్రి గడ్కరీకి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ విజ్ఞప్తి




సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలోని తుని–సబ్బవరం రహదారిని జాతీయ రహదారిగా మార్చాలని కేంద్ర జాతీయ రహదారులు, రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ విజ్ఞప్తి చేశారు. బుధవారం కేంద్ర మంత్రితో భేటీ అనంతరం ధర్మశ్రీ మీడియాతో మాట్లాడారు. 133 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ రహదారికి రూ.2,200 కోట్లు ఖర్చవుతుందన్నారు. దీనికి సంబంధించి డీపీఆర్ కూడా పూర్తయిందని చెప్పారు. రహదారి పనులు వేగంగా చేపట్టాలని కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశానన్నారు. ఈ రహదారి పూర్తయితే ఏడు నియోజకవర్గాల్లో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.80 లక్షలు

సాక్షి, అమరావతి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరో బెటాలియన్ కానిస్టేబుల్ ఉమ్మారెడ్డి రవికుమార్ కుటుంబానికి పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద రూ.80 లక్షలను డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం అందించారు. పోలీసు శాఖ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం శాలరీ ప్యాకేజీ కేవలం అయిదు నెలల్లోనే వచ్చేట్లుగా అధికారులు చొరవ చూపించారు. మంగళగిరిలో రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో రూ.80 లక్షల చెక్‌ను కానిస్టేబుల్ రవికుమార్ కుటుంబ సభ్యులకు అందించారు.

స్పందన కార్యక్రమం పబ్లిసిటీకే పరిమితం

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం పబ్లిసిటీకే పరిమితమైందని చంద్రబాబు విమర్శించారు. ప్రజల సమస్యలు పరిష్కరించలేనప్పుడు స్పందన కార్యక్రమం వల్ల ఎవరికి ఉపయోగమని ప్రశ్నిస్తూ బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అధికార మదంతో సామాన్య ప్రజలపై జరుగుతున్న వేధింపులకు ముగింపు ఎప్పుడని ప్రశ్నించారు. అన్నవరానికి చెందిన ఆరుద్ర అనే మహిళ న్యాయం కోసం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నం చేయడం బాధాకరమన్నారు. కూతురి వైద్యానికి తన ఇంటిని అమ్ముకునే స్వేచ్ఛ కూడా ఆమెకు లేకుండా చేయడం దారుణమని తెలిపారు.

'అమూల్' రైతులకు అదనపు లాభం

పాల సేకరణ ధరలు మరోసారి పెంపు

సాక్షి, అమరావతి: లాభాల వెల్లువతో పాడి రైతన్నల్లో దరహాసం విరబూస్తోంది. 'జగనన్న పాల వెల్లువ' ద్వారా పాల సేకరణ ధరను అమూల్ సంస్థ తాజాగా మరోసారి పెంచింది. లీటర్ గేదె పాలపై రూ.3.30, ఆవు పాలపై రూ.1.58 చొప్పున పెంచడంతో పాడి రైతన్నలకు మరింత లాభం చేకూరుతోంది. పెంచిన ధరలు గురువారం నుంచి అమలులోకి రానున్నాయి.

నాలుగోసారి పెంపు వర్తింపు

'జగనన్న పాల వెల్లువ' పథకం 2020 డిసెంబర్‌లో మూడు జిల్లాల్లో ప్రారంభం కాగా ప్రస్తుతం 16 జిల్లాలకు విస్తరించారు. గత 23 నెలల్లో మూడుసార్లు సేకరణ ధరలను పెంచారు. ఉత్తరాంధ్ర పరిధిలో గత నెలలో పెంచగా, తాజాగా కోస్తాంధ్రలో 10 జిల్లాల పరిధిలో పాలసేకరణ ధరలను నాలుగోసారి పెంచారు.

1.12 లక్షల మందికి అదనపు లబ్ధి

కోస్తాంధ్ర పరిధిలో ఇప్పటికే లీటర్ గేదె పాలకు రూ.79.20, ఆవుపాలకు రూ.37.90 చొప్పున చెల్లిస్తుండగా తాజాగా లీటర్‌కు గరిష్టంగా గేదె పాలపై రూ.3.30, ఆవుపాలపై రూ.1.58 పెంచారు. దీంతో గరిష్టంగా గేదె పాలు రూ.82.50, ఆవు పాలు రూ.39.48 చొప్పున సేకరణ ధరలు చేరాయి. వెన్నపై కిలోకు రూ.30, ఎస్ఎన్ఎఫ్‌పై కిలోకు రూ.11 చొప్పున పెంచడంతో వెన్న ధర రూ.750, ఘన పదార్థాల ధర రూ.280కి చేరుకుంది. గత నెలలో అమలులోకి వచ్చిన పెంపు వల్ల ఉత్తరాంధ్రలో 233 గ్రామాల పరిధిలోని 33,327 మంది రైతులు లబ్ధి పొందగా తాజా పెంపుతో కోస్తాంధ్రలోని బాపట్ల, తూర్పు గోదావరి, ఏలూరు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, ఎస్‌పీఎస్ ఆర్ నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 890 గ్రామాలకు చెందిన 1,12,313 మంది రైతులకు అదనపు లబ్ధి చేకూరనుంది.

రూ.208.23 కోట్లు చెల్లింపు

రాష్ట్రంలో ప్రస్తుతం 16 జిల్లాల పరిధిలో 2,833 గ్రామాలకు చెందిన 2,44,069 మంది రైతుల నుంచి పాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం 30 వేల మంది పాల ఉత్పత్తిదారులు ప్రతిరోజూ సగటున లక్ష లీటర్ల చొప్పున పాలు పోస్తున్నారు. ఇప్పటి వరకు 4.86 కోట్ల లీటర్ల పాలను సేకరించగా రైతులకు రూ.208.23 కోట్లు చెల్లించారు. ప్రైవేట్ డెయిరీలతో పోలిస్తే జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాలు పోసే రైతులు అదనంగా రూ.25 కోట్ల మేర లబ్ధి పొందారు. దళారీలకు తావు లేకుండా ప్రతి పది రోజులకోసారి పాలుపోసే రైతుల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేస్తున్నారు.

లీటర్‌కు పెరిగిన కనిష్ట, గరిష్ట పాల సేకరణ ధరలు రూ.ల్లో

	కొవ్వు శాతం	ఎస్ఎన్ఎఫ్ శాతం	పాతధర	కొత్తధర	పెరిగిన ధర
ఆవుపాలు	3.2	8.3	29.01	30.26	1.25
	5.4	8.7	37.90	39.48	1.58
గేదెపాలు	5.5	8.7	35.60	37.25	1.65
	11	9	79.20	82.50	3.30

పెరిగిన వెన్న, ఘనపదార్థాల సేకరణ ధరలు కిలోకు (రూ.ల్లో)

	పాతధర	కొత్త ధర	పెరిగిన ధర
వెన్న	720	750	30
ఘనపదార్థాలు	269	280	11

డిసెంబర్ లోగా రాష్ట్రమంతా విస్తరణ

జగనన్న పాల వెల్లువ కింద పాలసేకరణ ధరను అమూల్ నాలుగోసారి పెంచింది. ఇప్పటికే 16 జిల్లాల్లో అమలవుతున్న ఈ పథకాన్ని డిసెంబర్ నెలాఖరులోగా రాష్ట్రమంతా విస్తరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– అహ్మద్ బాబు, ఎండీ, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్

వికేంద్రీకరణతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

శివరామకృష్ణన్ కమిటీ నివేదిక అమలు చేయాలి

- మూడు రాజధానులను వ్యతిరేకించే వారు చరిత్రహీనులే
- నినదించిన వేలాది గొంతులు
- నరసన్నపేటలో ఉత్తరాంధ్ర గర్జన భారీ ర్యాలీ
- ఆమదాలవలసలో రౌండ్ టేబుల్ సమావేశం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



వికేంద్రీకరణ కావాలని కోరుతూ ర్యాలీలో ప్ల కార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నరసన్నపేట /ఆమదాలవలస/ఆమదాలవలస రూరల్: మూడు రాజధానుల వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, విశాఖలో పాలన రాజధాని ఏర్పాటు వల్లే ఉత్తరాంధ్రకు లబ్ధి చేకూరుతుందని ఉద్యోగ, వ్యాపార, కార్మిక, కర్షక, విద్యార్థి, మహిళ సంఘాల నేతలు స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఇదే ఆకాంక్షను గొంతెత్తి చాటుతున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కావాలంటే విశాఖలో పాలన రాజధాని ఏర్పాటు చేయాల్సిందేనని, ఇందుకు అందరూ కలిసి రావాలని, రాజకీయ పార్టీలన్నీ మద్దతు ప్రకటించాలని కోరుతున్నారు. పాలన రాజధాని ఏర్పాటయ్యే వరకు విశ్రమించబోమని తేల్చి చెబుతున్నారు. నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఉత్తరాంధ్ర గర్జన పేరుతే శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో భారీ ర్యాలీ నిర్వహించగా, ఆమదాలవలసలో రాజధాని సాధన ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ర్యాలీలో ప్రజాప్రతినిధులు, జేఏసీ నాయకులు, వివిధ సంఘాల వారు భారీగా పాల్గొన్నారు. విశాఖలో పాలన రాజధాని ఏర్పాటు చేయాలంటూ ప్ల కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మేధావులు తమ ఆకాంక్షను బలంగా చాటారు. 'విశాఖ అభివృద్ధి చెందిన నగరంగా ఎప్పుడో గుర్తింపు పొందింది. ఇది రాజధాని అయితే చుట్టుపక్కల 100 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలన్నీ బాగా అభివృద్ధి చెందుతాయి. అందువల్ల విశాఖ రాజధాని నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలి' అని కోరారు. ఇంకా ఎవరెవరు ఏమన్నారంటే..

వికేంద్రీకరణతోనే సమన్యాయం

పరిపాలన వికేంద్రీకరణతోనే రాష్ట్రానికి సమన్యాయం జరుగుతుంది. మూడు రాజధానుల కోసం ప్రతిఒక్కరూ మద్దతు ప్రకటించాలి. వికేంద్రీకరణ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నిర్ణయం కాదు. రాష్ట్ర ప్రజల మనోగతాన్ని గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నారు. విశాఖలో విశాలమైన రోడ్లు, రైల్వే, ఎయిర్‌పోర్టు, పోర్టు తదితర సదుపాయాలు ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న నగరాల్లో దేశంలోనే రెండో స్థానంలో ఉన్నందునే రాజధానిగా ఎంపిక చేశారు. ఈ నిర్ణయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుంది. విశాఖలో రాజధాని ఏర్పాటైతే ఐటీ పరిశ్రమలు, కోస్టల్ కారిడార్‌తో పాటు వలసలకు అడ్డుకట్ట పడుతుంది. సిక్కోలు జిల్లాలో వెనుకబాటుతనం పోవాలంటే విశాఖకు కచ్చితంగా రాజధాని రావాలి.

– తమ్మినేని సీతారాం, శాసనసభ స్పీకర్

చంద్రబాబుకు వంతపాడొద్దు



విజ్ఞత, పరిణతి కలిగిన మంచి నాయకుడి ఆలోచనకు ప్రజలందరూ మద్దతు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. ఉత్తరాంధ్రులంతా విశాఖలోనే పాలనా రాజధాని కావాలని ఆకాంక్షిస్తున్నారు. విశాఖలో రాజధాని వద్దని టీడీపీ వాదిస్తోంది. విశాఖలో రాజధాని చంద్రబాబుకు ఇష్టం లేదని, మిగతా ఆ పార్టీ నేతలు ఆయనకు వంత పాడుతుండటం దారుణం. వారంతా చరిత్రహీనులుగా, ఉత్తరాంధ్ర ద్రోహులుగా మిగిలిపోవడం ఖాయం. వికేంద్రీకరణ కావాలంటున్న ప్రతి ఒక్కరూ టీడీపీ నాయకులను నిలదీయాలి. ఇక్కడ రాజకీయాలు ప్రధానం కాదు. ఇక్కడ రాజధాని ఏర్పడితే అందరికీ ప్రయోజనం చేకూరుతుంది.

– ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట ఎమ్మెల్యే

అందరూ ఏకతాటిపై నడవాలి



వికేంద్రీకరణకు ప్రజలందరూ మద్దతు ప్రకటించాలి. మూడు రాజధానుల కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలి. వికేంద్రీకరణ ద్వారా వెనుకబడిన శ్రీకాకుళం జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుంది. విశాఖ కోసం అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకడం శుభపరిణామం. జిల్లా ప్రజలంతా ఏకతాటిపై నడిచి మన ఆకాంక్షను నెరవేర్చుకోవాలి.

– డాక్టర్ దానేటి శ్రీధర్, నాన్ పొలిటికల్ జేఏసీ జిల్లా కన్వీనర్

ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్దాం



సిక్కోలు జిల్లాకు పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టులు రావాలన్నా, ఇతర అవసరాలు తీరాలన్నా వికేంద్రీకరణే మార్గం. విశాఖను రాజధానిగా ప్రకటిస్తే వలసల నివారణ సాధ్యం. యువతకు ఉపాధి దొరుకుతుంది. గతంలో చేసిన పోరాటాల మాదిరిగానే ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళదాం. రాజధానిని సాధించుకుందాం.

– కె.సుగుణాకరరావు, విశాఖ రాజధాని సాధన ఐక్యవేదిక అధ్యక్షుడు

వికేంద్రీకరణకే ఉద్యోగ సంఘాల మద్దతు



వికేంద్రీకరణతో అందరికీ సమన్యాయం జరుగుతుంది. విశాఖ రాజధాని నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలి. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయానికి ఉద్యోగ సంఘాల మద్దతు ఉంటుంది. ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాల నేతలు ఐక్యతతో ముందుకు సాగాలి.

– చౌదరి పురుషోత్తంనాయుడు, ఏపీ ఎన్‌జీఓ సంఘం ఉపాధ్యక్షుడు

ఇదే మంచి తరుణం



వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. కర్నూలులో న్యాయ రాజధాని, అమరావతిలో శాసన రాజధాని, విశాఖలో పాలనా రాజధాని ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రికి మన మందరం రుణపడి ఉన్నాం. విశాఖలో పాలనా రాజధాని ఏర్పాటుకు ఇదే మంచి తరుణం. ఉత్తరాంధ్రులంతా సమైక్యంగా పోరాడాలి.

– లజపతిరాయ్, నాన్ పొలిటికల్ జేఏసీ ఉత్తరాంధ్ర కన్వీనర్

సీఎం క్యాంప్ కార్యాలయం సమీపంలో

మహిళ ఆత్మహత్యాయత్నం

- బ్లేడుతో చేతి మణికట్టు వద్ద కోసుకున్న వైనం
- వెంటనే ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- ఆస్తి తగాదాలే కారణం.. సంబంధితులపై ఇప్పటికే చర్యలు



ఆత్మహత్యాయత్నం చేసిన రాజులపూడి ఆరుద్ర

తాడేపల్లి రూరల్/సాక్షి అమరావతి/ప్రత్తిపాడు/తుని రూరల్: సీఎం వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం సమీపంలో అమలాపురానికి చెందిన రాజులపూడి ఆరుద్ర అనే మహిళ బుధవారం బ్లేడుతో చేతి మణికట్టు వద్ద కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెన్నెముక సమస్యతో అచేతన స్థితిలో ఉన్న తన కుమార్తె సాయిలక్ష్మీచంద్రను కాపాడాలని కోరుతూ స్పందనలో సీఎంవో అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చి, బయటకొచ్చాక క్రిస్టియన్‌పేట రోడ్డుపై అఘాయిత్యానికి ఒడిగట్టింది. ఆమెను పోలీసులు వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తాడేపల్లి సీఐ సాంబశివరావు కథనం మేరకు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఆరుద్రకు అన్నవరం, అమలాపురంలో స్థిరాస్తులున్నాయి. అన్నవరం సమీపంలోని స్థలాన్ని అమ్ముకునేందుకు కొందరు పోలీసు సిబ్బంది అడ్డుపడుతున్నారని కాకినాడ ఎస్పీకి సెప్టెంబర్ 12న ఫిర్యాదు చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు కానిస్టేబుళ్లు, గన్‌మేన్‌ను ఇంటెలిజెన్స్ విభాగం నుంచి తొలగించి, వీఆర్‌కు పంపించారు. ఈ చర్యలపై ఇద్దరు కానిస్టేబుళ్లు హైకోర్టును ఆశ్రయించగా అక్టోబర్ 30న న్యాయస్థానం 8 వారాలపాటు స్టే విధించింది. వారు ప్రస్తుతం ఏ ప్రజాప్రతినిధికి గన్‌మేన్‌లుగా లేరు. అమలాపురం ఆస్తికి సంబంధించి.. ఆరుద్ర భర్త భువనేశ్వర్ తల్లిదండ్రులకు ఐదుగురు సంతానం. భువనేశ్వర్ ఐదో, సోమేశ్వరరావు నాల్గో సంతానం. వీరి తండ్రి రాయపూడి వైకుంఠరావు చనిపోయే ముందు తన భార్య సీతమ్మ పేరిట అన్ రిజిస్టర్డ్ వీలునామా రాశారు. దాని ద్వారా పొందిన హక్కుతో సీతమ్మ కూడా 2007 ఆగస్టు 15న ఒక అన్ రిజిస్టర్డ్ వీలునామా రాశారు. దాని ప్రకారం ఐదో కుమారుడు భువనేశ్వర్ ఆ ఆస్తిని తను ఉన్నంత కాలం అనుభవించాలి. తదనంతరం నాలుగో కుమారుడు సోమేశ్వరరావు కుమారుడు భరత్‌కుమార్‌కు సర్వ హక్కులతో ఆ ఆస్తి చెందుతుంది. అయితే ఆరుద్ర.. తన కుమార్తె సాయిలక్ష్మీచంద్ర వైద్యం కోసం ఆ ఆస్తిని అమ్మేందుకు యత్నించగా భరత్‌కుమార్ కోర్టులో దావా వేశారు. దీనిపై ఆరుద్ర డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌కు సెప్టెంబర్ 26న స్పందనలో ఫిర్యాదు చేయగా 29న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇది సివిల్ తగాదా అని, కోర్టు పరిధిలో ఉందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఆరుద్ర.. సీఎంవో అధికారులను కలిసి స్పందనలో తన కుమార్తె వైద్యం నిమిత్తం అర్జీ అందజేసింది. స్పందించిన అధికారులు వైద్యానికి అయ్యే అంచనా ఖర్చును తెలపాలని కోరారు. తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఆమె సీఎంవో కార్యాలయం నుంచి బయటకు రాగానే ఆత్మహత్యాయత్నం చేసింది.

లోకేశ్ ట్వీట్ హాస్యాస్పదం

తన గన్‌మ్యాన్ ఓ మహిళకు అన్యాయం చేశాడని లోకేశ్ ట్విటర్ వేదికగా స్పందించడం హాస్యాస్పదంగా ఉందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వాస్తవాలు తెలుసుకోకుండా లోకేశ్ ఇష్టానుసారం మాట్లాడటం తగదన్నారు. ఆరోపణలు ఎదుర్కొన్న గన్‌మ్యాన్‌ను ఇదివరకే తొలగించి, కొత్త వారిని నియమించారన్నారు. కాగా ఈ ఘటనపై ప్రత్తిపాడు సీఐ కిషోర్‌బాబు స్పందిస్తూ 'అన్నవరంలోని ఇల్లు అమ్మకం విషయంలో ఆరుద్ర.. న్యాయవాది రాజాల చిట్టిబాబు, ముత్యాలరావు, మెరపల శివ, మెరపల కన్నయ్యలపై సెప్టెంబర్ 12న ఫిర్యాదు చేస్తే, ఆ మరుసటి రోజే కేసు నమోదు చేశాం. పోలీసు శాఖలో పని చేస్తున్న మెరపల శివ, మెరపల కన్నయ్యలను విధుల నుంచి తొలగించాం. శాఖాపరంగా చర్యలు తీసుకున్నాం. ఇల్లు అమ్మకానికి సహకరిస్తామని చెప్పాం' అని తెలిపారు. కాగా, ఆరుద్ర విషయంలో చట్ట ప్రకారం నడుచుకుంటున్నామని ఎస్పీ రవీంద్రనాథ్ బాబు చెప్పారు.

రాజకీయాల్లో సహనం ఎంతో అవసరం

- బూతులు తిట్టడమే రాజకీయం కాదు
- 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి తిరుగులేని విజయం ఖాయం
- సీఎం జగన్‌ను కలిసిన అనంతరం సినీనటుడు అలీ



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న అలీ దంపతులు

సాక్షి, అమరావతి: రాజకీయాల్లో సహనం ఎంతో అవసరమని, అది కోల్పోయి మాట్లాడితే జనమే రాజకీయ నేతలపై తిరగబడతారని సినీనటుడు, ఏపీ ప్రభుత్వ సలహాదారు (ఎలక్ట్రానిక్ మీడియా)గా నియమితులైన అలీ చెప్పారు. ఆయన బుధవారం సతీసమేతంగా తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిశారు. తనను ప్రభుత్వ సలహాదారుగా నియమించినందుకు ఆయన సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన సాక్షితో మాట్లాడుతూ ఈ నెలలో జరగనున్న తన కుమార్తె వివాహానికి సీఎం జగన్‌ను ఆహ్వానించేందుకు వచ్చినట్లు చెప్పారు. ఫస్ట్ కార్డు సీఎంకి అందజేశానన్నారు. సీఎం జగన్ తనకు అద్భుత అవకాశం ఇచ్చారని, ఆయన ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని చెప్పారు. గతంలో రాఘవేంద్రరావు ఈ పదవిలో ఉన్నారని గుర్తుచేశారు. దీనికి అలీ అయితే కరెక్ట్ అని సీఎం తనని నియమించారన్నారు. తన వల్ల సీఎం జగన్‌కు ఎంతపేరు తీసుకురావాలో అంతా తీసుకొచ్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానన్నారు. రాజకీయాల్లో సహనం ఉన్న వారు గొప్ప నేతలు అవుతారని చెప్పారు. సీఎం జగన్ అలా ఉండి ప్రజాసమస్యలపై తిరుగులేని పోరాటాలు చేయటం వల్లే, తిరుగులేని మెజార్టీ సాధించి, సీఎం పదవి అధిరోహించారన్నారు. పదవుల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేయాలనుకునే వారు సీఎం జగన్‌లా ఉండాలని చెప్పారు. బూతులు తిట్టడమే రాజకీయం అనుకోవటం నేతలకు సరైంది కాదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని నేతలు గ్రహించాలని సూచించారు. గతంలో అలీ పాత్ర రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని, ఇకముందు సీఎం జగన్ ఆదేశాలను శిరసావహించి ముందుకు కదులుతానని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనిషి అని పేర్కొన్నారు. అన్నివర్గాల్లో పేదల కోసం, ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెచ్చారని చెప్పారు. ప్రజలు ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై లబ్ధిపొందారన్నారు. ప్రజలు పథకాలను ఆదరిస్తున్నారని చెప్పారు. ఈసారి 175కి 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని, ముఖ్యమంత్రి జగన్ 2024లో తిరుగులేని మెజార్టీతో మళ్లీ సీఎంగా ఎన్నికవుతారని పేర్కొన్నారు. ఆ క్రతువులో తనవంతు పాత్ర పోషిస్తానన్నారు. ఇక నుంచి ప్రభుత్వంలో భాగస్వామిగా మరో అలీని చూస్తారని ఆయన చెప్పారు.

అవినీతి రహిత వ్యవస్థే ఏసీబీ లక్ష్యం

రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ వీణా ఈష్

సాక్షి, అమరావతి: అవినీతి రహిత వ్యవస్థ సాధనలో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ వీణా ఈష్ పేర్కొన్నారు. రాష్ట్ర ఏసీబీ విభాగం 'అవినీతి రహిత భారతం – అభివృద్ధికర భారతం' అనే అంశంపై విజయవాడలోని ఆర్టీసీ భవన్లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఏసీబీ విభాగం క్రియాశీల విధానాల ద్వారా అవినీతి కట్టడికి చర్యలు చేపట్టాలని సూచించారు. అందుకోసం అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఏసీబీ డీజీ కూడా అయిన రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ 14400 మొబైల్ యాప్, కాల్‌సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవడం ద్వారా అవినీతిని రూపుమాపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఏసీబీ కేసులను సత్వరం దర్యాప్తు చేసి పరిష్కరించాలని సూచించారు. ఏసీబీ, విజిలెన్స్ విభాగాల మధ్య సమన్వయంతోనే సత్ఫలితాలు సాధించగలమని కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ సభ్యుడు ఆర్పీ ఠాకూర్ చెప్పారు. కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ సభ్యుడు జె.సత్యనారాయణ, విజిలెన్స్ డీజీ శంఖబ్రత బాగ్చీ, జీఏడీ కార్యదర్శి పి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

15లోగా ఎన్‌సీఐపీ పోర్టల్‌లో ఈ-పంట తుది జాబితా

వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్

సాక్షి, అమరావతి: సామాజిక తనిఖీలో భాగంగా రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్బీకేల్లో) ప్రదర్శిస్తున్న ఈ-పంట తుదిజాబితా వివరాలను ఈ నెల 15వ తేదీలోగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ (ఎన్‌సీఐపీ)లో అప్‌లోడ్ చేస్తామని వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ చెప్పారు. 2022–23 సీజన్‌లో దిగుబడి ఆధారంగా అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా – పీఎం ఎఫ్‌బీవై కోసం ఎంపిక చేసిన బీమా కంపెనీలతో బుధవారం గుంటూరులో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వెబ్‌ల్యాండ్, సీసీఆర్సీ డేటా ఆధారంగా ఈ-పంట నమోదు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఉమ్మడి అజమాయిషీలో 100 శాతం ఈ-పంట వివరాలు నమోదు చేశామన్నారు. సామాజిక తనిఖీ, అభ్యంతరాల నమోదు, గ్రామసభల నిర్వహణ ద్వారా దేశంలో మరే రాష్ట్రంలోను అమలుకాని రీతిలో ఈ-పంట నమోదు చేపట్టామని చెప్పారు. పంట కోత ప్రయోగాలను కూడా అత్యంత సమర్థంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ-పంట నమోదు, ఆర్బీకేల్లో జాబితాల ప్రదర్శనపై బీమా కంపెనీలు క్షేత్రస్థాయి పరిశీలనలో సంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

పెట్రో కెమికల్ రంగంలో పెట్టుబడులకు ఏపీ అనుకూలం

ఇండియా కెమ్–2022 సదస్సులో మంత్రి అమర్‌నాథ్

సాక్షి, న్యూఢిల్లీ: పెట్రో కెమికల్ రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూలమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. భారత రసాయన, పెట్రో కెమికల్ పరిశ్రమ వృద్ధిలో ఏపీ ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. 2020–21 నాటికి రాష్ట్రంలో కెమికల్స్, పెట్రో కెమికల్స్ ఉత్పత్తి 11.9 బిలియన్ డాలర్లతో దేశీయ ఉత్పత్తిలో ఎనిమిది శాతంగా ఉందన్నారు. ఈ రంగంలో ఇంకా 7.3 బిలియన్ డాలర్ల పెట్టుబడికి 1,39,627 మందికి ఉపాధి కల్పించడానికి రాష్ట్రం అనుకూలంగా ఉందన్నారు. బుధవారం ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో నిర్వహించిన ఇండియా కెమ్–2022 సదస్సులో మంత్రి మాట్లాడారు. కెమికల్స్, పెట్రో కెమికల్స్ రంగంలో ఏపీ చాంపియన్‌లా దూసుకెళ్తోందని, పోర్టు ఆధారిత అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. గడిచిన మూడేళ్లలో రాష్ట్రానికి రూ.46,280 కోట్లతో 107 మెగా పరిశ్రమలు వచ్చాయని 70,606 మందికి ఉపాధి దక్కిందన్నారు. 35,181 చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో 2,11,374 ఉద్యోగాలు కల్పించామని మంత్రి తెలిపారు.



నిశ్శబ్దంగా, నిర్మలంగా ఉండండి.
ఎప్పుడూ మిమ్మల్ని మీ నియంత్రణలో ఉంచుకోండి.
కలిసి బతకడం ఎంత సులువో మీకు తెలుస్తుంది.
– పరమహంస యోగానంద

సాక్షి

గురువారం, నవంబర్, 3

అరుణారుణ ఆశాకిరణం

వర్గాలుగా చీలిన ఓటర్లు... హోరాహోరీ పోరు... అతివాద ఛాందస దేశాధ్యక్షుడు బోల్సనారో ఒక వైపు, వామపక్ష ప్రజాస్వామ్యవాది లూలా మరోవైపు... 34 ఏళ్ళ బ్రెజిల్ ప్రజాస్వామ్యంలో ఎన్నడూ లేనంత ఉత్కంఠభరితంగా దేశాధ్యక్ష ఎన్నికలు. అలాంటి సందర్భంలో ఆదివారం లూలా దక్షిణ అమెరికాలో అతిపెద్ద దేశానికి అధ్యక్షుడిగా గెలుపొందడం చరిత్రాత్మకం. 580 రోజులు జైలులో ఉండి బయటపడి, రాజకీయ విరోధుల అంచనాల్ని అధిగమించి, బలమైన ప్రత్యర్థి బోల్సనారోను ఓడించడం వామపక్ష వర్కర్స్ పార్టీకి లూలా సృష్టించిన అపూర్వ సందర్భం. 2020 నుంచి పొరుగున బొలీవియా, చిలీ, పెరూ, కొలంబియా, హోండురస్‌లలో ఎగిరిన ఎర్ర జెండాకు బ్రెజిల్ గెలుపు మరో ఊపు. అరుణారుణమవుతున్న లాటిన్ అమెరికాకు ఇది ప్రతీక. స్థానికవాద సెంటిమెంట్లను పెంచిపోషించే ఛాందస మితవాద ప్రభుత్వాలు ఐరోపాలో ఎన్నికవుతున్న వేళ మరో ఆశాకిరణం.

లూలాకు దేశాధ్యక్ష పదవి కొత్త కాదు. ఆయన పగ్గాలు చేపట్టడం బ్రెజిల్ చరిత్రలో ఇది మూడోసారి. 2003 నుంచి 2010 దాకా నాలుగేసి ఏళ్ళ వంతున రెండు తడవలు ఆయన ఆ పదవిలో ఉన్నారు. సంక్షేమ చర్యలు చేపడుతూనే, దేశంలో ఆర్థికాభివృద్ధి, సామాజిక చేర్పు సాధించిన ప్రజాదరణ గల నేతగా నిలిచారు. మళ్ళీ పుష్కరకాలానికి పీఠమెక్కారు. మధ్యలో పదవి చేపట్టిన ఆయన శిష్యుడు 2016లో అభిశంసనకు గురికావడం, కాంట్రాక్టుల్లో అవినీతిపై 2017లో లూలా జైలు పాలవడం, 2018 ఎన్నికల్లో పోటీకి అనర్హుడు కావడం, వీటన్నిటితో దేశంలో మితవాద పార్టీల విజృంభణ అంతా ఓ పెద్ద కథ. తాజాగా అక్టోబర్ 2 నాటి తొలి విడత ఎన్నికల్లో పూర్తి మెజారిటీ రాని ఆయన ఆదివారం తుది విడతలో పదవిని స్థిరం చేసుకున్నారు. లూలాకు 50.9 శాతం, ప్రత్యర్థి బోల్సనారోకు 49.1 శాతం ఓట్లు వచ్చాయి. 1980లలో నిరంకుశత్వం నుంచి బ్రెజిల్ బయటపడ్డాక ఇంత స్వల్ప తేడాతో ఎన్నికల గెలుపు నమోదైంది ఇప్పుడే!

తాజా మాజీ అధ్యక్షుడు బోల్సనారో, ఆయన మద్దతుదారులు సాగించిన నాటకీయ, విద్వేష ప్రచారం అంతా ఇంతా కాదు. గతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసినట్టే బోల్సనారో బృందం మీడియానూ, ఎన్నికల ప్రక్రియనూ దుమ్మెత్తిపోసింది. ఈ ఎన్నికల ఫలితాలను ఔదలదాల్చేది లేదు పొమ్మని బెదిరించింది. లూలా మాత్రం బోల్సనారో ప్రాచుర్యాన్ని అధిగమించేందుకు తన మాజీ ప్రత్యర్థి జెరాల్డో అల్క్‌మిన్‌ను ఉపాధ్యక్ష అభ్యర్థిగా నిలబెట్టి, వామపక్షాల నుంచి మధ్యేవాద మితవాదుల దాకా పది పార్టీలతో జాగ్రత్తగా కూటమి కట్టారు. గెలుపు తీరాలకు చేరారు. బోల్సనారో హయాంలో 7 లక్షల పైగా మరణాలతో కోవిడ్ కట్టడిలో వైఫల్యాన్నీ, అమెజాన్ అడవుల నరికివేతనూ, కునారిల్లిన ఆర్థికవ్యవస్థనూ బ్రెజిల్ చవిచూసింది. ఒకప్పుడు 2.5 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తెచ్చిన లూలా లాంటి సమర్థుడికి సైతం దేశాన్ని మళ్ళీ పట్టాలెక్కించడం సవాలే!


కలసి పోటీ చేసిన పార్టీల కూటమిని రేపు అధికారంలోనూ లూలా ఎంత కలసికట్టుగా ఉంచగలుగుతారనేది కీలకం. అది ఆయన ప్రభుత్వ భవితవ్యాన్ని నిర్ణయిస్తుంది. పర్యావరణం, ప్రజారోగ్యం, విద్య, విదేశాంగ విధానం, మానవహక్కుల లాంటి అంశాల్లో పాత పాలకుడు చేసిన నష్టాన్ని పూడ్చడానికి అనుసరించే విధానాల్లో భాగస్వాములతో పొరపొచ్చాలు రాకుండా చూసుకోవాల్సి ఉంటుంది. దేశంలో ఆకలి, దారిద్ర్యాన్ని తగ్గించడం, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, పారిశ్రామిక రంగాన్ని పరిపుష్టం చేయడం తమ ప్రభుత్వ తక్షణ లక్ష్యాలని ఆయనే చెప్పారు. కానీ, గతంలో ఆయన అధికారంలో ఉన్నప్పటితో పోలిస్తే ఇప్పుడు నిరుద్యోగం, అప్పులు, ద్రవ్యోల్బణం పెరిగిపోయాయి. ఖజానా ఖాళీ అయింది. ఉత్పత్తి స్తబ్ధమైంది. అనేక రంగాల్లో అంతర్జాతీయ పోటీలో నిలిచే పరిస్థితి లేదు.

ఇవి చాలదన్నట్టు రాజకీయంగానూ తిప్పలున్నాయి. సెనేట్‌లో అధిక స్థానాలు బోల్సనారోకు చెందిన లిబరల్ పార్టీకే ఉన్నాయి. దిగువ సభలోనూ ఆ పార్టీయే అతి పెద్ద పార్టీ. ఇక, 27 రాష్ట్రాల్లో 11 రాష్ట్రాల్లో, అందులోనూ రియో డి జనీరో సహా కీలకమైన, మూడు అతి పెద్ద రాష్ట్రాల్లో ప్రత్యర్థి బోల్సనారో సమర్థకులే వచ్చే ఏటి నుంచి గవర్నర్లు. అలాగే, 1964 – 1985 మధ్య బ్రెజిల్‌ను ఏలిన సైనిక వ్యవస్థ, అమెజాన్ వర్షారణ్య దోపిడీ వ్యవస్థల శక్తిమంతమైన వ్యాపార ప్రయోజనాల్ని ఢీకొనాల్సి వస్తుంది. ఇన్నింటినీ అధిగమిస్తూ, ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడం, జనరంజకంగా పాలించడం ఎవరికైనా కత్తి మీద సామే. సహజ వనరులపైనా, చమురుతో ముడిపడ్డ ఆర్థిక విజృంభణ పైనా అతిగా ఆధారపడ్డా కష్టమేనని పొరుగున ఉన్న వెనిజులా పాఠం చెబుతోంది.

విజయోత్సవ ప్రసంగాన్ని ఆరంభిస్తూ, లూలా అన్న మాట ఒకటే... 'వారు నన్ను సజీవ సమాధి చేయాలనుకున్నారు. కానీ, ఇదుగో ఇప్పుడు మీ ముందు సజీవంగా నిలిచాను.' క్లిష్టసమయంలో పదవి చేపట్టిన ఈ 77 ఏళ్ళ పోరాటయోధుడు ఇక ప్రజాస్వామ్యవాదుల ఆకాంక్షల్ని సజీవంగా నిలపాలి. ఒబామా శైలిలో 'నాకు ఓటేసిన వారికే కాదు, మొత్తం 21.5 కోట్ల బ్రెజిలియన్లకూ సుపరిపాలన అందిస్తాను' అన్న మాటల్ని నిజం చేసి, విభజన రాజకీయాలకు విరుద్ధంగా దేశాన్ని ఒక్కటి చేయాలి. మునుపటిలా ప్రభుత్వ సంపదను ప్రజలకు పునఃపంపిణీ చేసే ప్రజాకర్షక సంక్షేమ విధానాలకూ, వర్తమాన ఆచరణాత్మకతకూ మధ్యన ఈ కొత్త ప్రయాణం రాజకీయ పునరుత్థానం పొందిన ఈ కురువృద్ధుడికి అసలు సిసలు అగ్నిపరీక్ష.

అంతరాలను తగ్గించాలనే...

సందర్భం



కాలువ మల్లయ్య

మహా నగరాలు ఒకే రోజులోనో, స్వల్ప సమయంలోనో నిర్మింప బడవు. కాల క్రమంలో చారిత్రక, సామాజిక, సాంఘిక, మానవ వన రుల అవసరాలను బట్టి గ్రామాలు పట్టణాలుగా, పట్టణాలు నగరా లుగా, నగరాలు మహా నగరా లుగా అభివృద్ధి చెందుతాయి. అందుకే 'రోమ్ వజ్ నాట్ బిల్ట్ ఇన్ ఎ డే' (రోమ్ నగరం ఒక్క రోజులో నిర్మితమవ్వలేదు) అనే నానుడి పుట్టింది. హైదరాబాద్, చెన్నయ్, ముంబయి, కోల్‌కతా, ఢిల్లీ లాంటి మహానగరాలు కూడా ఒక సంవత్స రంలోనో, స్వల్పకాలంలోనో మహానగరాలుగా ఎదిగినవి కావు. ఇది చరిత్ర. చారిత్రక దృష్టిలేని వారు; చరిత్రనుండి పాఠాలు, గుణపాఠాలు నేర్వలేనివారు... వేల కొద్ది ఎకరాల పంట భూములను సేకరించి అక్కడ రాజధాని భవనాలు నిర్మించి అత్యల్ప కాలంలోనే సింగ పూర్ లాంటి నగరాలను తీసుకు వస్తామని చెబుతారు. 'చరిత్ర తెలి యనివారు చరిత్రను సృష్టించలేరు'. అక్కడేమీ లేకున్నా రాజధాని పేరు మీద కొన్ని భవనాలు నిర్మించినంత మాత్రాన అది సింగ పూర్ అవుతుందని భావించడం సరైందికాదు. ఉమ్మడి పంజాబ్ రాష్ట్రంలో ఉన్న పట్టణాలను వదిలి... ఛండీ గర్‌ను కొత్త రాజధానిగా నిర్మించి రెండు రాష్ట్రాలకు రాజధానిని చేయడం వల్ల జరిగిందేంటి? అది నాలుగు దశాబ్దాలు గడి చినా మహానగరం కాలేదు. పట్టణంగా మాత్రమే ఉండి పోయిందన్న సంగతి మరువరాదు.

ఆంధ్రప్రదేశ్ భౌగోళిక, సామాజిక, ఆర్థిక అంతరా లతో మూడు ప్రాంతాల సమాహారంగా ఉంది. ఇది సహజం. వీటినన్నిటినీ దృష్టిలో పెట్టుకొని అధికార వికేం ద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా మూడు ప్రాంతా ల్లోని అసమానతలను, అంతరాలను వీలైనంతవరకు తగ్గించాలన్న ఉద్దేశ్యంతో 'మూడు రాజధాను'లను ప్రతి పాదించింది జగన్ ప్రభుత్వం. మొత్తం బడ్జెట్ అమరావతికే ఉపయోగిస్తే రాష్ట్ర ప్రజలకు విద్య, వైద్యం, ఉద్యోగ కల్పన, వ్యవసాయాభివృద్ధి, సంక్షేమ పథకాల మాటే ంటి? మంచి పాలకునికి చరిత్ర తెలిసిన పాలకునికి ప్రజలు ముఖ్యం కదా!


అమరావతిలో అసెంబ్లీ ఉంచి, విశాఖపట్టణంలో సచివాలయం నిర్మించి పరిపాలనా రాజధానిని చేయడం వల్ల వెనుకబడిన ప్రాంతమైన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే మహానగరంగా ఉన్న విశాఖ పట్ట ణాన్ని రాజధాని చేస్తే అత్యంత తక్కువ సమయంలో మరింత గొప్ప నగరంగా అభివృద్ధి చెందుతుంది. అమ రావతిలా ఇక్కడ వేలకోట్లు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. ఉత్తరాంధ్ర ప్రజల వెనుకబాటు తనాన్ని రూపు మాపి సామాజిక, ఆర్థిక అంతరాలు తగ్గించడానికి ఇదెంతో ఉపయోగపడుతుంది. అమరావతిలో అసెంబ్లీ భవనాలు, శాసన రాజధాని ఉంటుంది. కాబట్టి ఇది కూడా నగరంగా అభివృద్ధి చెందుతుంది. మరో దిక్కున కర్నూలులో హైకోర్టు వల్ల అదో మహా నగరంగా అభివృద్ధి చెందుతుంది. 3 ప్రాంతాల్లో విద్యా, వైద్యం, ఐటీ విస్తరణ, ఉద్యోగ కల్పన, సేద్యం వంటి వాటిపై దృష్టి పెట్టి సామాజిక న్యాయం బాగా జరి గేలా చూస్తే అంతకంటే మించిన సుపరిపాలనేముంది? ఆ దిశగా శర వేగంతో అడుగులేస్తు న్నాడు జగన్. దీంతో భవిష్యత్తులో వేర్పాటు వాదాలు వచ్చే అవకాశం ఉండదు. ప్రజల మధ్య భేదాభిప్రాయాలు రాకుండా సోదర భావం నెలకొంటుంది. అప్పుడే శాంతి భద్రతలు వెల్లి విరుస్తాయి. ఫలితంగా పెట్టుబడులు దేశ, విదేశాల నుంచి ఏపీకి ప్రవహిస్తాయి. అందువల్ల రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుంది.

మూడు రాజధానులను వ్యతిరేకించడం ఆపి రాజ ధాని నిర్మాణం త్వరగా పూర్తి కావడానికి సహకరిస్తే శూన్యంగా మిగిలిన తెలుగు దేశానికి ఇసుమంతైనా ప్రజా మోదం లభిస్తుంది. అలా కాదంటారా చరిత్రహీనులుగా మిగిలిపోతారు. సకల జనుల వృద్ధిని ఆశించే ప్రస్తుత సీఎం జనం హృదిలో శాశ్వతంగా నిలిచిపోతారు.

వ్యాసకర్త ప్రముఖ సాహితీ వేత్త | 9182918567

పిల్లల్ని చదువుకోనివ్వండి రామోజీ!

- బాలికలు 10తో చదువు మానేయకుండా మండలానికో జూనియర్ కాలేజీ
- 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్లు; దీనికోసం స్కూళ్ల మ్యాపింగ్
- వనరుల సమర్థ వినియోగానికి ఆరు రకాలుగా స్కూళ్ల వర్గీకరణ
- 'నాడు-నేడు'తో స్కూళ్లలో అద్భుతమైన మౌలిక సదుపాయాలు
- అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద, విద్యార్థులకు ట్యాబ్‌లు
- 4 నుంచి 10వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్
- విద్యారంగంలో సరికొత్త స్వప్నాన్ని నిజం చేస్తున్న ముఖ్యమంత్రి
- ప్రభుత్వంపై పెరుగుతున్న సానుకూలత తట్టుకోలేని పచ్చ ముఠా
- అందుకే సంస్కరణలతో స్కూళ్లు అస్తవ్యస్తమంటూ ఏడుపుగొట్టు రాతలు





విష వృక్షాలుగా ఎదిగిపోయిన విద్యా రంగ కలుపు మొక్కలకు మందు వేయటం మొదలైంది. కొంత సమయం పట్టినా... ఆరంభమయ్యింది కనక అంతమూ జరిగి తీరుతుంది. కానీ ఈ పరిణామం ఎల్లో ముఠా మేస్త్రీ 'ఈనాడు'ను, విత్తులేసి పెంచి పోషించిన తెలుగుదేశాన్ని తీవ్రంగా కలవరపెడుతోంది. అందుకే సంస్కరణలతో విద్యా వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తమైపోతోందంటూ గగ్గోలు మొదలయ్యింది. ఇదెలా ఉందంటే... జబ్బు చేసిన వ్యక్తికి చికిత్స చేయొద్దని, చేస్తే ఆరోగ్యం దెబ్బతింటుందని ధర్నాకు దిగినట్టుగా!!. ఇంగ్లిష్ మీడియం పెట్టడం వల్ల విద్యార్థులు ఆంగ్లంలో చదవలేక ప్రభుత్వ స్కూళ్లు వదిలేసి వెళ్లిపోతున్నారనే వింత వాదన విన్నాక... వీరి మానసిక స్థితి తేలిగ్గానే తెలిసిపోతుంది. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులు అందకూడదని వీళ్లెన్ని కుట్రలు పన్నుతున్నారో అర్థమవుతుంది. ఇలాంటి రాతలను అధికారులెవరైనా ఖండిస్తే... సామాజిక కార్యకర్తల పేరిట తెలుగుదేశం కార్యకర్తల చేత లేఖలు రాయించి... వారికి సామాజిక కార్యకర్తలనే ముసుగు వేసి ప్రచురించటమనే విద్యలో కూడా ఇపుడు రామోజీరావు ఆరితేరిపోయారు. పొద్దున్న లేస్తే పచ్చ పత్రికలు వండి వార్చిన ప్రభుత్వ వ్యతిరేక వార్తలను, వాటి అధిపతుల కామెంట్లను, చంద్రబాబు నిస్సిగ్గుగా చేసే ఆరోపణలను సామాజిక మాధ్యమాల్లో వ్యాపింపజేసే వ్యక్తులకు కూడా సామాజిక కార్యకర్తల ముసుగేస్తే ఎలా రామోజీరావు గారూ?

తెలుగుదేశం కార్యకర్త అనో, ఎల్లో మీడియా సానుభూతిపరుడనో రాస్తే పోయేది కదా? ఇంకా ఎన్నాళ్లీ డ్రామాలు? మీ పిల్లలు చదువుతున్నదెక్కడ? ఇంగ్లిష్ మీడియంలోనే కదా? పేద పిల్లలకు ఆ చదువు అందకూడదని ఎందుకింత కక్ష? అని అధికారులు సూటిగా మీ ఎల్లో ముఠాని అడిగితే... దానికి వార్త రాసిన పాత్రికేయులను అడిగినట్లుగా రంగేసి... ఐఏఎస్‌ల పిల్లలు చదువుతున్నదెక్కడ? అంటూ మీ సామాజిక కార్యకర్తతో ప్రశ్న అడిగించారంటే మీ బుద్ధి భూమిలోకి పోయిందని అర్థం కావటం లేదూ? ఐఏఎస్‌లు తమ పిల్లల్ని ఇంగ్లిష్ మీడియంలో చదివిస్తూ ఉండొచ్చు. వారేమీ పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులొద్దని మీలా చెప్పటం లేదు కదా? మరి వారి ప్రస్తావనెందుకు? మరీ ఇలా తలాతోకా లేని ప్రశ్నలేసి మీకు మీరే శెహబాష్‌లు చెప్పకుంటే ఎలా?

ప్రభుత్వ స్కూళ్లపై విషం చిమ్మటం వెనక రామోజీరావు ఆందోళన ఒక్కటే. ప్రభుత్వ స్కూళ్లను ఫణంగా పెట్టి తాము పెంచిపోషించిన కొన్ని కార్పొరేట్ స్కూళ్లకు నూకలు చెల్లుతున్నాయన్నదే!. గాలీవెలుతురూ లేని భారీ భవనాల్లో.. విద్యార్థులను బట్టీపట్టే యంత్రాల్లా మార్చేసే ఈ 'కార్పొరేట్' స్కూళ్లకు కర్త, కర్మ, క్రియ అయిన చంద్రబాబు ఇపుడు అధికారంలో లేరన్నదే ఆయన బాధ. అందుకే... ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారుస్తూ.. మౌలిక సదుపాయాలతో పాటు బోధనాభ్యసన ప్రక్రియల్లో సమూల మార్పులు తెస్తున్న వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆయనకు సుతరామూ నచ్చటం లేదు. అందుకే సోమవారం 'పిల్లలపై పిడుగు' పడేశారు. దానికి మంత్రి, అధికారులు జవాబివ్వగా... తమ 'సామాజిక కార్యకర్త' ద్వారా దానిపై ఓ వంకర లేఖను రాయించి అచ్చు వేశారు.

ఇవీ.. విద్యార్థుల సంఖ్యపై వాస్తవాలు

2014–15లో ప్రభుత్వ స్కూళ్లలో 42 లక్షల మంది విద్యార్థులుండగా చంద్రబాబు హయాంలో అది 37 లక్షలకు దిగజారిపోవటం అబద్ధమా? ఆ సంఖ్య ఇపుడు 40.31 లక్షలకు పెరగటం అబద్ధమా? బాబు కాలంలో ప్రయివేటు స్కూళ్లలోని విద్యార్థుల సంఖ్య 27 లక్షల నుంచి 32 లక్షలకు పెరగటం అబద్ధమా? ఆ ఐదు లక్షల మందినీ మీరే మీ కార్పొరేట్ స్కూళ్లకు ఫీడ్ చేయటం అబద్ధమా? ఇవన్నీ పచ్చి నిజాలు కావా రామోజీ? వీటిని మీ పత్రికలో ఎందుకు రాయరు? ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ఫలితంగా ఇపుడు ఎయిడెడ్‌తో కలిసి విద్యార్థుల సంఖ్య 41.44 లక్షలకు చేరిందని, ప్రైవేటు స్కూళ్ల కన్నా (30.18 లక్షలు) ప్రభుత్వ స్కూళ్లలో ఏకంగా 11 లక్షల మంది విద్యార్థులు అధికంగా ఉన్నారని ఎన్నడూ చెప్పరెందుకు? బాబు జమానాతో పోలిస్తే ఇపుడు ప్రయివేటు స్కూళ్లలో 4 లక్షల మంది విద్యార్థులు అధికంగా ఎందుకున్నారు? సర్కారీ విద్యలో తెచ్చిన మార్పుల వల్లే కదా? దీన్నెందుకు చెప్పరు?

ఇంగ్లిష్ మీడియంపై ఏడుపెందుకు?

పేదపిల్లలు ఇంగ్లిష్ మీడియం చదివితే తమ సామ్రాజ్యాలకు కూలీలు దొరకరనే బెంగ రామోజీకి ఉండి ఉండొచ్చు. ఎందుకంటే ఇంగ్లిష్ మీడియాన్ని అడ్డుకోవటానికి ఆయన చేయని ప్రయత్నమంటూ లేదు. చివరికి కోర్టులకెక్కి మరీ యాగీ చేశారు. కానీ విద్యార్థులకు ఏ మీడియం కావాలని అడిగితే 98 శాతం ఇంగ్లిష్‌నే ఎంచుకున్నారు. దాంతో ఆ మాధ్యమం అమల్లోకి వచ్చింది. వీరికి తేలిగ్గా అర్థం కావటం కోసం పాఠ్య పుస్తకాల్లో ఒకవైపు తెలుగు, మరోవైపు ఇంగ్లిష్ ఉండేలా బైలింగ్యువల్ బుక్స్‌ను అందిస్తోంది ప్రభుత్వం. ఎల్లో ముఠా ఊహించని ఈ పరిణామాన్ని ఇపుడు ఇతర రాష్ట్రాలూ ఆదర్శంగా తీసుకున్నాయి. ఇక బాలికల కోసం ప్రతి మండలానికి ప్రత్యేకంగా ఓ జూనియర్ కాలేజీని ఏర్పాటుచేసి వారు పదో తరగతి తరువాత చదువు కొనసాగించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వారి కోసం ప్రత్యేకంగా హైస్కూలు ప్లస్ ఏర్పాటు చేయటంతో పాటు... దేశవ్యాప్తంగా మన విద్యార్థులు ఇతరులతో పోటీ పడేందుకు అంతటా అమలు చేస్తున్న సీబీఎస్ఈ విధానాన్ని రాష్ట్రం కూడా అమల్లోకి తెస్తోంది. చంద్రబాబు హయాంలో ఇలాంటి ఆలోచనలు కూడా రాకపోవటంతో... ఈ సంస్కరణలు విద్యా రంగాన్ని సమూలంగా మార్చి, ఈ రాష్ట్రంలో తమకు పుట్టగతులుండకుండా చేస్తాయనే భయం ఎల్లో ముఠాను వేధిస్తోంది. అందుకే పాలనా పరమైన చిన్న చిన్న కారణాలను భూతద్దంలో చూపిస్తూ మొత్తం ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా విష ప్రచారానికి దిగుతోంది.

ఏది నిజం?

సెల్‌ఫోన్లు భారమవుతాయా?

కోవిడ్ కారణంగా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు దెబ్బతిన్నాయని అసర్, ఎన్ఏఎస్ వంటి సర్వేలు తేల్చాయి. దీన్ని పరిష్కరించడానికి... ఎడ్యుకేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు గూగుల్ రీడ్ ఎలాంగ్, పీఏఎల్, బైజూస్ మొదలైన లెర్నింగ్ యాప్‌లను పరిచయం చేయడం... రెమిడియల్ టీచింగ్, స్కూళ్లకు- టీచర్లకు ర్యాంకింగ్, టీచర్ కెపాసిటీ బిల్డింగ్ వంటివి రూపొందించారు. ఆన్‌లైన్ ఎడ్యుటెక్ కంపెనీలందించే కంటెంట్ కేవలం కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన పరిస్థితుల్లో... ప్రభుత్వ స్కూళ్లలో 4 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు దిగ్గజ ఎడ్యుటెక్ సంస్థ 'బైజూస్' నుంచి పాఠ్యాంశాలందేలా ప్రభుత్వం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అన్ని తరగతులనూ డిజిటలైజ్ చేసి విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందేలా చేస్తోంది. 'బైజూస్' కంటెంట్‌తో 2025లో సీబీఎస్ఈ బోర్డు పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా 8వ తరగతి విద్యార్థులకు, వారికి బోధించే ఉపాధ్యాయులకు 5.18 లక్షల మందికి ట్యాబ్‌లను ఈ నవంబరు చివరికల్లా పంపిణీ చేయనున్నారు. అంటే... ప్రతి విద్యార్థికీ రూ.36వేల విలువైన ల్యాప్‌టాప్, బైజూస్ కంటెంట్ ఉచితంగా అందుతుంది. అలాగే 4వ తరగతి నుంచి పిల్లలకు వేల రూపాయల ఖర్చయ్యే బైజూస్ కంటెంట్... ప్రత్యేక యాప్ ద్వారా ఉచితంగా అందనుంది. తల్లిదండ్రుల ఫోన్లలోనో, ఇంట్లో ఉండే వేరే ఫోన్లలోనో ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని, ఇంట్లో ఉన్నపుడు అభ్యసించొచ్చు. ఇదీ వాస్తవం. కానీ సెల్‌ఫోన్లకోసం రూ.8వేల భారం అంటూ అసత్యాలను ప్రచారం చేయటం 'ఈనాడు' మార్కు పాత్రికేయం.

స్కూళ్లు మూతపడిందెక్కడ రామోజీ?

3వ తరగతి నుండి అన్ని తరగతులకూ అర్హత కలిగిన సబ్జెక్ట్ ఉపాధ్యాయులను అందించడానికి పాఠశాలల్ని 5:3:3:4 నమూనాలో 6 రకాలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్ (పీపీ1, పీపీ2), ఫౌండేషన్ స్కూల్ (పీపీ1, పీపీ2 క్లాస్ 1 - 2), ఫౌండేషన్ స్కూల్ ప్లస్ (పీపీ1, పీపీ2 క్లాసులు 1 నుండి 5) ప్రీ-హై పాఠశాల (తరగతులు 3 నుండి 7/8 వరకు) హైస్కూలు (తరగతులు 3 నుండి 10 వరకు) హైస్కూలు ప్లస్‌గా (తరగతులు 3 నుండి 12 వరకు) వీటిని మార్పు చేస్తోంది. దీనికి తగ్గట్టుగా స్కూళ్ల మ్యాపింగ్ చేయిస్తున్నారు. ఇప్పటివరకు 494 ఫౌండేషన్ ప్లస్ స్కూళ్లలోని 3,4,5 తరగతులను 1 కి.మీ.లోపులో ఉన్న 428 ప్రీ-హై స్కూళ్లకు అనుసంధానించారు. 4237 ఫౌండేషన్ ప్లస్ పాఠశాలల్లోని 3,4,5 తరగతులను 1 కి.మీ.లోపు ఉన్న 2944 ఉన్నత పాఠశాలలకు మ్యాప్ అయ్యాయి. 21 ప్రీ-హై స్కూళ్లలోని 3 నుండి 8 తరగతులను 18 హైస్కూళ్లకు మ్యాప్ చేశారు. 191 ప్రీ-హై స్కూళ్లలోని 3 నుండి 8 తరగతులను 1 కి.మీ.లోపు ఉన్న 167 హైస్కూళ్లకు మ్యాపింగ్ చేశారు. మొత్తంగా 4943 ఫౌండేషన్ ప్లస్, ప్రీహైస్కూళ్లలోని కొన్ని తరగతులు 3557 ప్రీ హైస్కూల్, హైస్కూళ్లలో మ్యాప్ అయ్యాయి. వీటిలో 3వ తరగతి నుంచి సబ్జెక్టుల వారీగా బోధిస్తారు. దీనికోసం ఇప్పటికే 4,421 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ల పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారు. అప్‌గ్రేడ్ చేసిన హైస్కూళ్లకు హెడ్‌మాస్టర్ పోస్టులను అందించడానికి 998 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్ని హెచ్ఎంలుగా అప్‌గ్రేడ్ చేశారు. పర్యవేక్షణ కోసం ప్రతి మండలానికి ఇద్దరు చొప్పున ఎంఈఓలను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో రెండో ఎంఈఓ కోసం 679 పోస్టులను అదనంగా మంజూరు చేశారు కూడా. డెప్యూటీ డీఈఓ పోస్టులను 53 నుంచి 74కు పెంచారు. మ్యాపింగ్ వల్ల విద్యార్థులు ఉత్తమ ప్రమాణాలు సంతరించుకుంటారని, ఒక్క పాఠశాల కూడా మూతపడదని ప్రభుత్వం చెబుతున్నా రామోజీ మాత్రం తప్పుడు కూతలు మానటం లేదు. కొత్త విధానానికి అనుగుణంగా ఆయా స్కూళ్లకు అవసరమైన అదనపు తరగతి గదులను ప్రభుత్వం నిర్మిస్తోంది. కొన్ని చోట్ల సమస్యలు ఎదురవ్వగా స్థానిక విద్యాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. వీటికి ముసుగేసి... విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారంటూ ఒకటీ అరా ప్రాంతాల్లోని సమస్యను రాష్ట్రమంతటికీ వర్తింపజేసి విషం చిమ్ముతోంది ఎల్లో ముఠా.

సీబీఎస్ఈ విధానంపైనా అదే తీరు...

దేశవ్యాప్తంగా విద్యార్థులతో పోటీ పడటానికి ప్రభుత్వ స్కూళ్లలోనూ సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేయాల్సిన అవసరాన్ని గుర్తించింది ఈ ప్రభుత్వమే. ఇప్పటివరకు 1,247 పాఠశాలలు సీబీఎస్ఈ విధానంలోకి వచ్చాయి. సీబీఎస్ఈని దృష్టిలో ఉంచుకుని, 8వ తరగతికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఎన్సీఈఆర్టీ అంశాలతో ద్విభాషా పుస్తకాలుగా ముద్రించారు. 8వ తరగతి ఉపాధ్యాయులు సీబీఎస్ఈ మోడ్‌లో శిక్షణ పొందారు. సీబీఎస్ఈ అనుబంధ స్కూళ్ల విద్యార్థులు ఆ బోర్డు నిర్వహించే పరీక్షలు రాస్తారు. అనుబంధం లేకున్నా సీబీఎస్ఈ సిలబస్ చదువుతున్న విద్యార్థులకు అందుకు అనుగుణంగా ఎస్సీఈఆర్టీ పరీక్షలు నిర్వహిస్తుంది. దీనిపై అవగాహన లేని రామోజీ... విద్యార్థులకు ఇబ్బందంటూ తోచిన కథనాన్ని వండేశారు.

బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనపడటం లేదా?

హైస్కూల్‌లో ఉత్తీర్ణులైన బాలికలెవరూ చదువు మానేయకుండా కొనసాగించేలా ప్రతి మండలంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తోంది ప్రభుత్వం. దీనికోసం 292 ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. 352 కేజీబీవీలలో ప్లస్ 2 తరగతులు ప్రవేశపెట్టారు. వీటికి తగినంత మంది టీచర్లను, అధ్యాపకులను ఏర్పాటు చేస్తున్నారు. కొద్దిరోజుల్లో ఇది పూర్తవుతుంది. ప్రస్తుత స్కూల్ అసిస్టెంట్లకు లెక్చరర్లుగా పదోన్నతులివ్వటంతో పాటు ప్రత్యేకంగా జూనియర్ లెక్చరర్ల నియామకానికీ ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. దీన్ని మరుగున పడేసి... స్కూల్ అసిస్టెంట్లతోనే నెట్టుకొస్తున్నట్లు అవాస్తవాలు గుప్పించారు.

ఇవీ... సంస్కరణలంటే

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎనలేని ప్రాధాన్యమిస్తూ... కునారిల్లిన విద్యా వ్యవస్థకు చికిత్స మొదలెట్టింది. దీన్లో భాగంగానే నాడు-నేడు పేరిట స్కూళ్లను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దటంతో పాటు పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను ప్రోత్సహించేందుకు జగనన్న అమ్మఒడి... స్కూళ్లు తెరిచేనాటికే షూ, యూనిఫామ్‌తో సహా పుస్తకాలన్నీ విద్యార్థులకు ఉచితంగా అందించే జగనన్న విద్యాకానుక... ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారంతో జగనన్న గోరుముద్ద... పాఠ్యాంశాల సంస్కరణలు, మరుగుదొడ్ల నిర్వహణ నిధి (టీఎంఎఫ్), పాఠశాల నిర్వహణ నిధి (ఎస్ఎంఎఫ్) వంటి కార్యక్రమాలను చేపట్టింది. రాష్ట్ర విద్యా రంగాన్ని మారుస్తూ... భావి తరాన్ని సమర్థంగా తీర్చి దిద్దే ఈ యజ్ఞం... పచ్చ ముఠా గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఆయా పథకాలు చూస్తే...

జగనన్న అమ్మ ఒడి



2018లో కేంద్రం గణాంకాల ప్రకారం ఏపీలో ప్రాథమిక విద్యలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) 84.48. జాతీయ సగటు 99.21తో పోలిస్తే ఇది తక్కువ. ఈ సమస్యను పరిష్కరించడానికి స్కూళ్లకు పిల్లల్ని పంపే అర్హులైన తల్లి లేదా సంరక్షకుడికి ప్రభుత్వం 'అమ్మ ఒడి' పథకం కింద ఏటా రూ.15,000 ఇస్తోంది. ఈ మూడేళ్లలో రూ.19,617.6 కోట్లు జమ చేయటం ద్వారా 44.49 లక్షల మంది తల్లులకు, 84 లక్షల విద్యార్థులకు లబ్ధి చేకూర్చింది ప్రభుత్వం. పాఠశాలల్లో చేరికలూ పెరిగాయి.

మనబడి నాడు-నేడు...



ప్రభుత్వ పాఠశాలల్లో 11 రకాల మౌలిక సదుపాయాలను కల్పించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటమే నాడు-నేడు ఉద్దేశం. రన్నింగ్ వాటర్ తో టాయిలెట్లు, తాగునీటి సరఫరా, మరమ్మతులు, ఫ్యాన్లు ట్యూబ్ లైట్లతో విద్యుద్దీకరణ, విద్యార్థులు సిబ్బందికి ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్, కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, అదనపు తరగతి గదులు ఏర్పాటు చేస్తున్నారు. తొలి దశలో 15,715 పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించారు. దీనికోసం రూ.3669 కోట్లు ఖర్చు చేశారు. రెండో దశలో రూ.8వేల కోట్లతో 22,344 పాఠశాలల్లో పనులు చేపట్టారు.

జగనన్న గోరుముద్ద



నాణ్యమైన, రుచికరమైన పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని జగనన్న గోరుముద్ద కింద పిల్లలకు అందించటమే ఈ పథకం ఉద్దేశం. రోజుకో రకమైన మెనూ ఆహార పదార్థాలతో పాటు వారానికి ఐదు గుడ్లు, మూడు వేరుశెనగ బెల్లం చిక్కిలు పిల్లలకు అందిస్తున్నారు. ఎక్కువ పోషక విలువలతో ప్రతి వారం 15 రకాల పదార్థాలు పిల్లలకు అందుతున్నాయి. కుక్, హెల్పర్ల గౌరవ భృతిని రూ.వెయ్యి నుంచి 3వేలకు పెంచారు. గత ప్రభుత్వం ఏడాదికి మధ్యాహ్న భోజనానికి రూ. 450 కోట్లు వెచ్చిస్తే... ఈ ప్రభుత్వం ఏటా రూ.1800 కోట్లు ఖర్చు చేస్తోంది. అదీ... విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి అంటే!.

గర్భిణులు, బాలింతలు, పసి పిల్లలకు...



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద అంగన్వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తోంది ప్రభుత్వం. 7,12,300 మంది గర్భిణులు, బాలింతలు, 6–36 నెలల వయస్సు గల 15,53,400 మంది పిల్లలు మరియు 3 6 సంవత్సరాల వయస్సు గల 9,59,500 మంది పిల్లలు లబ్ధిపొందుతున్నారు. దీనికి ఏటా పెడుతున్న ఖర్చు రూ.1956.34 కోట్లు. ఇప్పటివరకు రూ.4849.45 కోట్లు దీనికోసమే ఖర్చు చేశారు.

జగనన్న విద్యా కానుక ..



విద్యార్థి కిట్‌ల రూపంలో బోధన-అభ్యాస సామగ్రిని 'విద్యా కానుక'గా అందిస్తోంది ప్రభుత్వం. ప్రతి విద్యార్థికీ స్కూల్ బ్యాగ్, స్టిచింగ్ ఛార్జ్‌తో కూడిన 3 జతల యూనిఫారాలు, బెల్ట్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్స్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, వర్క్‌బుక్‌లు, 3 మాస్కుల సెట్‌తో సహా ఇంగ్లిష్ -తెలుగు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందిస్తారు. ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.2323.99 కోట్లు ఈ పథకం కింద ఖర్చు చేసింది. 47 లక్షల మంది పిల్లలకు లబ్ధి చేకూరింది.

టాయిలెట్ల నిర్వహణ పాఠశాలల నిర్వహణ



దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం పాఠశాలల, జూనియర్ కాలేజీల టాయిలెట్ల నిర్వహణ, పాఠశాలల నిర్వహణకోసం ప్రత్యేక నిధిని (ఎంటీఎఫ్, ఎస్ఎంఎఫ్) ఏర్పాటు చేయించింది. అమ్మ ఒడిని అందుకుంటున్న తల్లుల భాగస్వామ్యాన్ని పెంచేలా అమ్మ ఒడి కింద ఇచ్చే నిధుల్లో రూ.1000 చొప్పున దీనికి కేటాయించేలా చేసింది. ఇలా ఎంటీఎఫ్ కింద రూ.444.88 కోట్లు, ఎస్ఎంఎఫ్ కింద రూ.450 కోట్ల నిధి సమకూరింది. మరుగుదొడ్ల శుభ్రత కోసం 47వేల మంది ఆయాలను నియమించి వారికి నెలకు రూ.6వేల చొప్పున గౌరవభృతిని అందిస్తున్నారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.దశమి రా.8.51 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** శతభిషం రా.2.50 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** ఉ.10.55 నుండి 12.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.35 వరకు, తదుపరి ప.2.24 నుండి 3.10 వరకు, **అమృతఘడియలు:** రా.8.01 నుండి 9.30 వరకు. ; **రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం :** ఉ.6.00 నుండి 7.30 వరకు; **సూర్యోదయం** 6.03 ; **సూర్యాస్తమయం** 5.26.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 31 క్యూ కంపార్ట్‌మెంట్‌లు నిండాయి. సర్వ దర్శనానికి 15 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతోంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 72,176 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 25,549 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.12 కోట్లు వేశారు. తిరుమలలో బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసిన కారణంగా భక్తులు ఇబ్బందులు పడ్డారు.

'విశ్రాంత ఉద్యోగులకు' శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదం

తిరుపతి అలిపిరి: శ్రీవారి బ్రహ్మోత్సవాల అనంతరం టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ పింఛన్‌దార్లకు అందించే శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదాన్ని నవంబర్ 4 నుంచి 10 వరకు అందించనున్నట్లు టీటీడీ బుధవారం తెలిపింది. తిరుపతిలోని టీటీడీ క్యాంటీన్ వద్ద ఉన్న కొత్త జాబిలి భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించింది. పింఛన్‌దార్లకు ఒక పెద్ద లడ్డూ, ఒక వడ అందజేస్తారు. ఫ్యామిలీ పెన్షన్ నంబర్ల వారీగా ప్రసాదాల పంపిణీ జరుగుతుంది. 4న 99 నుంచి 3,395 వరకు, 5న 3,396 నుంచి 5,078 వరకు, 6న 5,079 నుంచి 6,522 వరకు, 7న 6,523 నుంచి 7,826 వరకు, 8 నుంచి 10వ తేదీ వరకు మిగిలిన పింఛన్‌దారులందరికీ ప్రసాదాలు అందజేయనున్నట్లు వివరించింది.

రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

- నేడు, రేపు కొనసాగే అవకాశం
- దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఎక్కువ ప్రభావం


తూపిలిపాళెం సముద్ర తీరంలో కురుస్తున్న భారీ వర్షం

సాక్షి, విశాఖపట్నం/వాకాడు (తిరుపతి): కోస్తా, తమిళనాడు, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. మరోవైపు ఉపరితల ఆవర్తనం నుంచి ఉత్తర అంతర్గత కర్ణాటక వరకు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి కూడా కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు ఉత్తర కోస్తాలో కొన్నిచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం రాత్రి నివేదికలో వెల్లడించింది. బుధవారం రాష్ట్రంలోని నెల్లూరు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరులో 4.3, తిరుపతి జిల్లా కోటలో 3.6, అనంతపురం జిల్లా గుంతకల్లులో 3.2 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

తీరంలో రెడ్ అలర్ట్

రెండు రోజులుగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాకాడు సముద్ర తీరంలో వర్షాలతోపాటు చలి గాలులు, అలల ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో తీరప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. చిల్లకూరు, కోట, వాకాడు, తడ, సూళ్లూరుపేట మండలాలకు చెందిన రెవెన్యూ, పోలీసు, మెరైన్ అధికారులు ఇప్పటికే తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులను అప్రమత్తం చేశారు. అలాగే లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మత్స్యకారులు తమ వేట నిలిపేసి సామాగ్రిని ఒడ్డున భద్రపరిచారు. మెరైన్ పోలీసులు తీరంలో నిఘా ఉంచారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు 10 శాతం ప్రీమియం ధర

టీటీడీతో సహా 11 ఆలయాలకు సరఫరాకు ఏర్పాట్లు

- ప్రస్తుత సీజన్ నుంచే 20 వేల టన్నుల సేకరణ లక్ష్యం
- సర్టిఫికేషన్ కోసం 3 సంస్థలతో రైతుసాధికార సంస్థ ఒప్పందం
- థర్డ్ పార్టీ ల్యాబ్‌లో రసాయన అవశేషాల నిర్ధారణ పరీక్షలు
- రసాయన రహిత ఉత్పత్తుల సేకరణ
- సాగు, సర్టిఫికేషన్‌పై రేపు ప్రకృతి వ్యవసాయ రైతులతో సమావేశం



సాక్షి, అమరావతి: లడ్డూ ప్రసాదం తయారీకోసం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)తో పాటు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు సరఫరాచేసే రైతులకు కనీస మద్దతు ధర కంటే 10 శాతం అదనంగా ప్రీమియం ధర దక్కేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఎంపికచేసిన 100 మంది రైతులతో శుక్రవారం (ఈ నెల 4వ తేదీ) తిరుమలలోని శ్వేతభవన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. లడ్డూ తయారీకి ఇప్పటికే ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న శనగలను టీటీడీకి సరఫరా చేస్తున్న రైతుసాధికార సంస్థ టీటీడీతో పాటు 11 ఆలయాలకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు సరఫరా చేయనుంది. ఇప్పటికే ఐదు ఆలయాలతో ఒప్పందం చేసుకుంది. నిత్యం శ్రీవారికి సమర్పించే 950 కిలోల పుష్పాలతో అగరబత్తీల తయారీ, దేశీ ఆవుల ప్రోత్సాహం, ఆయుర్వేద మందుల తయారీలో గో ఆధారిత ప్రకృతి ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న టీటీడీ.. శ్రీవారికి సమర్పించే నైవేద్యంతోపాటు స్వామి దర్శనానికి వచ్చే లక్షలాదిమంది భక్తులకు నాణ్యమైన, రసాయన రహిత ప్రసాదం, ఆహారం అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా శనగలతో పాటు 12 రకాల ఉత్పత్తులను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసే రైతుల నుంచి సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుని రైతుసాధికార సంస్థతో కలిసి అడుగులు వేస్తోంది. బియ్యం, కంది, మినుములు, మిరియాలు, పసుపు, ఆవాలు, బెల్లం, వేరుశనగ, శనగ, చింతపండు తదితర ఉత్పత్తులు కలిపి 20 వేల టన్నులను మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించి టీటీడీకి సరఫరా చేసేందుకు రైతుసాధికార సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు ఈ ఉత్పత్తులకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం కృషిచేస్తునారు. తొలివిడతగా టీటీడీకి 12 రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సరఫరా చేస్తున్న రైతులకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సీఎస్‌ఏ, ఎస్‌ఎస్ఐఎస్‌ఏటీ, ఏకలవ్య వంటి ఏజెన్సీలతో రైతుసాధికార సంస్థ ఒప్పందం చేసుకుంది. నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు లిమిటెడ్ (ఎన్‌ఏబీఎల్) గుర్తింపు పొందిన థర్డ్ పార్టీ ల్యాబ్‌లో పరీక్షించి రసాయన రహిత ఉత్పత్తులుగా నిర్ధారణ అయిన తర్వాతే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సంకల్పించింది. ఇలాంటి ఉత్పత్తులకు ఎమ్మెస్పీ కంటే 10 శాతం అదనపు ప్రీమియం ధర చెల్లించనుంది. శుక్రవారం జరిగే కీలక సమావేశంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల సాగులో మెళకువలతోపాటు సర్టిఫికేషన్ పొందేందుకు పాటించాల్సిన విధివిధానాలపై టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, మార్కెటింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి, మార్క్‌ఫెడ్ ఎండీ పీఎస్ ప్రద్యుమ్న, రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, సీఈవో బి.రామారావు తదితరులు దిశానిర్దేశం చేయనున్నారు.

యూకే, యూరప్‌ల్లో వైభవంగా శ్రీవారి కళ్యాణోత్సవాలు

ఏపీ ఎన్ఆర్టీఎస్ అధ్యక్షులు వెంకట్ ఎస్ మేడపాటి


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సాక్షి, అమరావతి: టీటీడీ ఆధ్వర్యంలో యూకే, యూరప్ దేశాల్లో స్థిరపడిన తెలుగు, భారతీయుల కోసం నిర్వహిస్తోన్న మలయప్ప స్వామి కళ్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నట్లు ఏపీ ఎన్ఆర్టీఎస్ అధ్యక్షులు వెంకట్ ఎస్ మేడపాటి తెలిపారు. అక్టోబర్ 15 నుంచి ప్రారంభమైన ఈ కళ్యాణోత్సవాలు నవంబర్ 13 వరకు జరగనున్నాయి. 11 నగరాల్లో శ్రీనివాస కళ్యాణములు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీటీడీ చైర్మన్ వైవీసుబ్బారెడ్డి సమన్వయ సూచనలతో ఇప్పటికే ఇంగ్లాండ్‌లోని బేసింగ్ స్టాక్ తెలుగు సంఘం, మాంచెస్టర్ - ఇంగ్లాండ్‌లో శ్రీ వైకుంఠం, బెల్ఫాస్ట్-నార్త్ ఐర్లాండ్‌లో నార్త్ ఐర్లాండ్ తెలుగు అసోసియేషన్, డబ్లిన్- ఐర్లాండ్, ఇండో-ఐరిష్ తెలుగు వెల్ఫేర్ అసోసియేషన్, జురిక్- స్విట్జర్లాండ్‌లో స్విస్ వేదిక్ భక్తి ఫౌండేషన్ అండ్ ఐండ్ హోవెన్-నెదర్లాండ్స్‌లో ఎస్‌వీకే, భారతీయ, తెలుగు సంస్థల సహకారంతో ఇప్పటివరకు 6 నగరాల్లో శ్రీ మలయప్ప స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించినట్లు వివరించారు. నిర్వాహకులు, స్థానిక ప్రజలు సీఎం వైఎస్ జగన్, వైవీ సుబ్బారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్‌లో మరో 5 నగరాల్లో శ్రీవారి కళ్యాణ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు వెంకట్ తెలిపారు.

గౌడ జాతి అభ్యున్నతికి ప్రభుత్వ చర్యలు అభినందనీయం

- ఏపీ గౌడ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చలపాటి
- 'థాంక్యూ సీఎం సార్' అంటూ మోకు మోస్తాదులతో గీత కార్మికుల కృతజ్ఞత ప్రదర్శన
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


ప్రదర్శన నిర్వహిస్తున్న కల్లుగీత కార్మికులు, ఏపీ గౌడ సంఘం నేత చలపాటి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో కల్లుగీత వృత్తికి ఊపిరి పోసేలా ప్రభుత్వ కొత్త గీత విధానం ఉందని, గీత వృత్తిదారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారని ఆంధ్రప్రదేశ్ గౌడ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కౌండిన్య సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలపాటి వెంకటేశ్వరరావు చెప్పారు. చలపాటి ఆధ్వర్యంలో విజయవాడ సమీపంలోని పాతపాడులో సీఎం వైఎస్ జగన్‌కు 'థాంక్యూ సీఎం సార్' అంటూ గీత కార్మికులు మోకు మోస్తాదులతో కృతజ్ఞత ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చెన్నకేశవస్వామి ఆలయం సెంటర్‌లో సీఎం జగన్, మంత్రి జోగి రమేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చలపాటి మాట్లాడుతూ కొత్తగా వైఎస్సార్ గీత కార్మిక భరోసా పథకాన్ని ప్రకటించడంతో పాటు.. ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికులకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గౌడ జాతి అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం విజయవాడ నగర అధ్యక్షుడు వీరంకి రామచంద్రరావు, నగర నాయకుడు మాదు సాంబశివరావు, పాతపాడు ఎంపీటీసీ సభ్యుడు మరీదు బాలకోటేశ్వరరావు, సంఘ నాయకులు బెజవాడ ఏడుకొండలు, పలగాని రాంబాయి, పామర్తి శ్రీనివాసరావు, ఆరేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో సీఎం జగనే స్ఫూర్తి : మంత్రి రోజా


తెనాలిలో హ్యాండ్‌బాల్ అకాడమీని ప్రారంభించి గోల్ వేస్తున్న మంత్రి రోజా

తెనాలి: ఎన్ని కష్టాలు ఎదురైనా పట్టుదలతో లక్ష్యం వైపు వెళితే విజయం సాధించవచ్చనే విషయం సీఎం జగన్‌ను చూస్తే తెలుస్తుందని రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసులు, క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. లక్ష్యం అంటూ లేకుండా ఉంటే ఎలా వెనక్కు వెళతాం అనేది పవన్ కళ్యాణ్‌ను చూస్తే తెలుస్తుందని ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో డబుల్ హార్స్ మినపగుళ్ల భాగస్వామ్యంతో 'శాప్' ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిగా ఏర్పాటైన హ్యాండ్‌బాల్ క్రీడా అకాడమీని బుధవారం ఆమె ప్రారంభించారు. స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడాస్టేడియంలో ఏర్పాటైన సభకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. సభలో క్రీడల ప్రాధాన్యతను మంత్రి రోజా వివరిస్తూ.. కష్టాలు, అవమానాలు ఎదుర్కొంటూనే మనమేంటో చూపాలని సలహానిచ్చారు. తామందరికీ స్ఫూర్తి సీఎం జగన్ అని చెబుతూ ఆయన జీవితాన్ని గమనిస్తే, ఆయన ఎదుర్కొన్న కష్టాలు, అవమానాలు మరెవరూ చూసి ఉండరని చెప్పారు. తండ్రి బాటలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని, ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్న లక్ష్యంతో సీఎం జగన్ ముందుకెళుతున్నారని చెప్పారు. క్రీడలు, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీమోహన్, 'శాప్' వైస్‌చైర్మన్, ఎండీ డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం



రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఎక్స్ గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ ఉత్తర్వులివ్వడంపై కల్లుగీత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ కార్యాలయానికి బుధవారం కల్లుగీత కార్మికులు పెద్ద సంఖ్యలో చేరుకుని పూలమాలలతో ఆయనను సత్కరించారు. తమకు ఇంత మేలు చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

– రాజమహేంద్రవరం రూరల్

వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి

చట్టివానిపాలెం పాఠశాల అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు టీడీపీ నేతల యత్నం

- గాజువాక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లపై గొడవకు దిగిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్


70వ వార్డు చట్టివానిపాలెం ప్రాథమిక పాఠశాలవద్ద గొడవ దృశ్యం

గాజువాక: విశాఖపట్నంలోని 70వ వార్డు (గాజువాక) చట్టివానిపాలెంలో ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనులకు బుధవారం గ్రామ టీడీపీ నాయకులు అడ్డు తగిలారు. స్థానికులను రెచ్చగొట్టి శంకుస్థాపనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గాజువాక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌పై గొడవకు దిగారు. దీన్ని అడ్డుకోబోయిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడిచేశారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా చట్టివానిపాలెం పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ఈ భవనాన్ని తమ గుప్పెట్లో పెట్టుకున్న టీడీపీ నాయకులు చాలా కాలం పాఠశాల భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించలేదు. ఈ విషయాన్ని కార్పొరేటర్ ఉరుకూటి చందు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సహకారంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు ఇటీవల ఆ భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ భవనాన్ని తమ గుప్పెట్లోనే ఉంచుకోవాలని టీడీపీ నాయకులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కొంతమంది స్థానిక నాయకులను, ఒక వర్గం వారిని రెచ్చగొట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ చందుపై గొడవకు దిగారు. దీంతో పరిస్థితి గందరగోళంగా మారింది. అక్కడికి చేరుకున్న ఒక టీడీపీ నాయకుడిని పోలీసులు అక్కడ్నుంచి పంపించేశారు. ఆయన మరికొంత మంది స్థానిక నాయకులను రెచ్చగొట్టడంతో గొడవ మొదలైంది. గందరగోళం మధ్యే ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అప్పటికీ ఎమ్మెల్యేతో గొడవకు దిగుతున్న వ్యక్తులను అడ్డగించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై వారు దాడిచేశారు. సర్వసిద్ధి పరదేశి, నీలాతి అచ్చిబాబు, నీలాతి రమణ, చట్టి అప్పలనాయుడుపై దౌర్జన్యం చేశారు. దీంతో పోలీసులు ఎమ్మెల్యేని, కార్పొరేటర్‌ను అక్కడినుంచి పంపించేశారు. స్థానికులను తరిమేశారు. ఈ సంఘటనపై కార్పొరేటర్ చందు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొడవకు దిగినవారిపైన, వారిని రెచ్చగొట్టినవారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.787.77 కోట్లతో అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ

సాక్షి, అమరావతి: ఆకస్మికంగా వచ్చిన వరదలతో గతేడాది నవంబర్ 19న తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును శాశ్వతంగా పునరుద్ధరించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పనులు చేపట్టడానికి రూ.787.77 కోట్లతో పరిపాలన అనుమతి ఇచ్చింది. రింగ్‌బండ్‌తోసహా పింఛా ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటర్ పునరుద్ధరణ పనులకు రూ.84.33 కోట్లతో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గతేడాది నవంబర్ 16, 17, 18, 19 తేదీలో నల్లమల, శేషాచలం, మాండవ్య, బహుదా, చెయ్యేరు పరివాహక ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. మాండవ్య, బహుదా ఉరకలెత్తడంతో పింఛా, చెయ్యేరు ఉప్పొంగాయి. ప్రాజెక్టు సామర్థ్యం కంటే అధికంగా వరద రావడంతో పింఛా ప్రాజెక్టు రింగ్ బండ్ తెగిపోయింది. కుడి ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటర్ పూర్తిగా దెబ్బతింది. ఆకస్మికంగా వచ్చిన భారీ వరదకు అన్నమయ్య ప్రాజెక్టు మట్టికట్ట తెగిపోయింది. ఈ రెండు ప్రాజెక్టులను శాశ్వతంగా పునరుద్ధరించాలని జలవనరుల శాఖ అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. అదనపు స్పిల్ వేతోపాటు నాన్ ఓవర్ ఫ్లో కాంక్రీట్ డ్యామ్ నిర్మించడం ద్వారా అన్నమయ్య ప్రాజెక్టును పునరుద్ధరించే పనులు చేపట్టడానికి రూ.801 కోట్ల తో కడప ప్రాజెక్ట్స్ సీఈ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని పరిశీలించిన ప్రభుత్వం ఆ పనులు చేపట్టడానికి రూ.787.77 కోట్లతో అనుమతి ఇస్తూ జీవో ఆర్టీ నం:2076 జారీచేసింది. పింఛా ప్రాజెక్టు పునరుద్ధరణ పనులకు రూ.84.33 కోట్లతో అనుమతి ఇస్తూ జీవో ఆర్టీ నం:2075 జారీచేసింది.

సీఎం జగన్‌కు కల్లుగీత కార్మికుల కృతజ్ఞత ర్యాలీ



కల్లు శిస్తు రద్దు, గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ కల్లుగీత సంఘాల నేతలు, కార్మికులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కల్లు గీత కార్మికుడి బల్ల కట్టుకుని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారంతా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ మునిసిపల్ కార్యాలయం వద్ద గల డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

– రామచంద్రపురం

- ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని అభూత కల్పనలు సృష్టించాలని చూస్తున్న కులవాదుల ఆగడాలకు కళ్లెం వేయాల్సిందేనని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో బహుజన పరిరక్షణ సమితి చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 766వ రోజుకు చేరాయి.

వాతావరణ సదస్సుకు హాజరవుతా: రిషి



లండన్ : ఈజిప్టులోని షెర్మెల్ షేక్‌లో వచ్చే వారం జరగనున్న పర్యావరణ సదస్సుకు హాజరవుతానని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ప్రకటించారు. దేశంలో ఆర్థిక సంక్షోభం, అంతర్గత సమస్యలపై దృష్టి పెట్టడానికి వీలుగా సదస్సుకు ఆయన దూరంగా ఉంటారని వార్తలు రావడంతో విమర్శలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో సదస్సుకి హాజరవుతానంటూ రిషి ట్వీట్ చేశారు. ''వాతావరణ మార్పులపై చర్యలు తీసుకోకపోతే దీర్ఘకాల శ్రేయస్సు సాధ్యం కాదు. పునరుత్పాదక వనరులపై ఖర్చు చేయకపోతే ఇంధన భద్రత కుదరదు. అందుకే సదస్సుకు హాజరవుతా. భద్రమైన భవిష్యత్ కోసం ఎలా మెలగాలో మాట్లాడతాను '' అన్నారు.

ఇక అమ్మకానికి ట్విట్టర్ 'బ్లూ టిక్'

నెలకు 8 డాలర్లు • కొత్త బాస్ మస్క్ ప్రకటన





న్యూయార్క్: ట్విట్టర్‌లో యూజర్ నేమ్ అధికారికమైనది, ప్రముఖమైనదని నిర్ధారించే వెరిఫికేషన్ బ్లూ టిక్ కోసం ఇక నెలకు 8 డాలర్లు చెల్లించాల్సిందే. సంస్థ కొత్త బాస్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ (51) తీసుకున్న ఈ మేరకు ప్రకటించారు. ''ప్రజలకు అధికారం! బ్లూ టిక్‌కు నెలకు 8 డాలర్లు'' అంటూ మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. ఈ చార్జీ కొనుగోలు శక్తి ప్రాతిపదికగా ఒక్కో దేశానికి ఒక్కోలా ఉంటుందని చెప్పుకొచ్చారు. ''బ్లూ టిక్ యూజర్లకు ఇకపై రిప్లైలు, మెన్షన్లు, సెర్చ్‌ల్లో జర్లకు మరింత ప్రయారిటీ దక్కుతుంది. స్పామ్‌లు, స్కామ్‌ల బెడద తగ్గడమే గాక పెద్ద వీడియోలు, ఆడియోలు పోస్ట్ చేసుకోవచ్చు. యాడ్లు సగానికి తగ్గుతాయి'' అంటూ తాను కల్పించబోయే సౌకర్యాలను ఏకరువు పెట్టారు. ఇకనుంచి రాజకీయ నాయకుల మాదిరిగా ఇతర ప్రముఖులకు కూడా పేరు కింద సెకండరీ ట్యాగ్ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. కానీ ఆయన తాజా నిర్ణయంపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది వ్యాపార ధోరణికి పరాకాష్ఠ అంటూ యూజర్లు దుమ్మెత్తిపోస్తున్నారు. ''బ్లూ టిక్ కొనసాగాలంటే ఇకపై నేను నెలకు 20 డాలర్లు చెల్లించాలా? ఏమన్నా అర్థముందా?'' అంటూ 70 లక్షల మంది ఫాలోవర్లున్న రచయిత స్టీఫెన్ కింగ్ అసంతృప్తి వెలిబుచ్చారు. నిజానికి ట్విట్టరే తనకు ఎదురు డబ్బులు చెల్లించాలంటూ ట్వీట్ చేశారు. బదులుగా మస్క్ కూడా, ''మేం కూడా బిల్లులు చెల్లించాలిగా! కేవలం ప్రకటనలపై ఆధారపడి సంస్థను నడపలేం'' అంటూ ట్వీట్ చేశారు. ''ఎవరైనా యూజర్ 8 డాలర్లు చెల్లించి తన డిస్‌ప్లే నేమ్‌ను ఎలాన్ మస్క్ అని మార్చుకుని నీ ప్రొఫైల్ పిక్‌నే పెట్టుకుని అచ్చం నీలా ట్వీట్లు చేయడం మొదలు పెడితే అప్పుడేం చేస్తావ్?'' అంటూ రుబియాన్ అనే యూజర్ మస్క్‌ను ప్రశ్నించాడు. కానీ మస్క్ మాత్రం తగ్గేదేలేదని కుండబద్దలు కొట్టారు. ''ఎవరెన్ని విమర్శలైనా చేయండి. నెలకు 8 డాలర్లు మాత్రం కట్టి తీరాల్సిందే'' అంటూ ట్వీట్ చేశారు. ట్విట్టర్ తన చేతుల్లోకి వస్తూనే సీఈఓ పరాగ్ అగర్వాల్, లీగల్ హెడ్ విజయ గద్దెతో పాటు మరో ఇద్దరు అత్యున్నతాధికారులను వివాదాస్పద రీతిలో మస్క్ ఇంటికి పంపడం తెలిసిందే. నకిలీ ఖాతాల బెడదను నివారించేందుకు ట్విట్టర్ సరైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శల నేపథ్యంలో 2009లో బ్లూ టిక్‌ను సంస్థ ప్రవేశపెట్టింది.

క్లుప్తంగా...

నేడు ఈడీ ముందుకు హేమంత్

న్యూఢిల్లీ: అక్రమ మైనింగ్ లీజుల కేసులో గురువారం మళ్లీ విచారణకు రావాలంటూ జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు ఈడీ బుధవారం సమన్లు జారీ చేసింది. ఈ కేసులో సోరెన్ ముఖ్య అనుచరుడు ఎమ్మెల్యే పంకజ్ మిశ్రా తదితరులు ఇప్పటికే అరెస్టవడం తెలిసిందే. మరోవైపు ఈ కేసులో సోరెన్‌పై అనర్హత వేటుకు సంబంధించి సస్పెన్స్ కొనసాగుతోంది. దానిపై సెకండ్ ఒపీనియన్ కోసం ఈసీకి పంపానని గవర్నర్ తాజాగా చెప్పారు!

అభివృద్ధే మాకు ముఖ్యం

మమతతో భేటీపై ఎంకే స్టాలిన్



చెన్నై/కోల్‌కతా: రాజకీయాల కంటే అభివృద్ధే ప్రధానమని డీఎంకే చీఫ్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. టీఎంసీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రితో బుధవారం తన నివాసంలో జరిగిన భేటీపై ఆయన ఈ మేరకు స్పందించారు. ఇద్దరు నేతలు 20 నిమిషాలు మాట్లాడుకున్నారు. అనంతరం స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ..ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ అన్నారు. మమత తనను కోల్‌కతా ఆహ్వానించారన్నారు. బుధవారం చెన్నై చేరుకున్న ఆమె స్టాలిన్‌ను ఆయన నివాసంలో కలిశారు. ప్రాంతీయ పార్టీలు 2024 ఎన్నికల్లో పాత్ర పోషించనున్నాయన్నారు.

యూపీలో ప్రైవేటు బస్సు బీభత్సం... ఐదుగురి దుర్మరణం


అలీగఢ్: ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ సమీపంలో మంగళవారం రాత్రి ప్రైవేట్ బస్సు అదుపుతప్పి డజను వాహనాలను ఢీకొంది. దాంతో ఐదుగురు మృతి చెందగా ఆరుగురు గాయాలపాలయ్యారు. డ్రైవర్ మత్తులో జోగడమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

ఆహారధాన్యాల రవాణా ఒప్పందంలోకి మళ్లీ రష్యా

కీవ్: ఐక్యరాజ్యసమితి, టర్కీల మధ్యవర్తిత్వంతో కుదిరిన ఆహార ధాన్యాల రవాణా ఒప్పందంలో తిరిగి చేరేందుకు రష్యా అంగీకరించింది. యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్ నుంచి నిలిచిన ఆహార ధాన్యాల రవాణా ఐరాస మధ్యవర్తిత్వంలో ఒప్పందం కుదరడం, క్రిమియాలోని తమ నౌకా స్థావరంపై ఉక్రెయిన్ దాడికి పాల్పడిందన్న రష్యా ఆరోపణలు మళ్లీ ఉద్రిక్తతకు దారి తీయడం తెలిసిందే. తమ బలగాలపై దాడికి నల్ల సముద్రం కారిడార్‌ను వాడనంటూ ఉక్రెయిన్ హామీ ఇవ్వడంతో రవాణాకు ఒప్పుకున్నట్టు రష్యా వెల్లడించింది.

కొరియాల క్షిపణి పరీక్షలు

సియోల్: కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు పెరిగిపోతున్నాయి. దక్షిణకొరియా, అమెరికాలు చేపట్టిన భారీ వైమానిక విన్యాసాలపై గుర్రుగా ఉన్న ఉత్తరకొరియా రెచ్చిపోయింది. బుధవారం ఒక్క రోజే 23 క్షిపణులను ప్రయోగించింది. ఇందులో ఒక క్షిపణి ఉభయ కొరియాల సరిహద్దులకు సమీపంలోకి దూసుకెళ్లింది. ఈ పరిణామంతో అప్రమత్తమైన దక్షిణ కొరియా రెడ్ అలెర్ట్ ప్రకటించి, ముందు జాగ్రత్తగా పౌరులను భూగర్భ షెల్టర్లలోకి తరలించింది. పలు క్షిపణులను సరిహద్దులకు సమీపంలోకి ప్రయోగించి దీటుగా స్పందించింది.



లద్దాఖ్‌లో హిమాలయ సానువుల పై నుంచి సొగసుగా కిందకు కదిలొస్తున్న హిమానీ నదం

ప్రపంచం ఆశలన్నీ భారత్‌పైనే

జీఐ సదస్సులో మోదీ వ్యాఖ్యలు

- పెట్టుబడులకు ఎర్రతివాచీ పరిచాం
- సంస్కరణలు, ప్రతిభను ప్రోత్సహించాం
- అన్ని రంగాల్లోనూ ప్రగతి పథంలో దేశం



లబ్ధిదారుకు తాళం చెవి ఇస్తున్న ప్రధాని మోదీ

బనశంకరి: ''మిగతా ప్రపంచమంతా నానా సంక్షోభాల్లో చిక్కిన వేళ భారత్ మాత్రమే అన్ని రంగాల్లోనూ దూసుకుపోతూ అతి పెద్ద ఆశాకిరణంగా కనిపిస్తోంది. ఆర్థికవేత్తలంతా ముక్త కంఠంతో చెబుతున్న విషయమిది. ఈ నేపథ్యంలో ప్రపంచమంతా మన దేశంపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంది'' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. విధాన స్థాయిలో విపరీతమైన అలసత్వం, నిర్ణయాల్లో అయోమయం వంటివాటికి బీజేపీ హయాంలో పూర్తిగా తెర దించి పెట్టుబడులకు ఎర్రతివాచీ పరచడం వల్లే ఇదంతా సాధ్యమైందని చెప్పారు. బుధవారం బెంగళూరులో మొదలైన మూడు రోజుల ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు, ఇన్వెస్ట్ కర్నాటక-2022ను ఉద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ''గతేడాది భారత్‌కు రికార్డు స్థాయిలో ఏకంగా 8,400 కోట్ల డాలర్ల మేరకు ఎఫ్‌డీఐలు వచ్చాయి. ప్రపంచాన్ని కమ్మేసిన కరోనా కల్లోలం, ఉక్రెయిన్ యుద్ధ భయాల వేళ ఇది చాలా పెద్ద ఘనత. ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లన్నీ ఒడిదొడుకులమయంగా సాగుతున్నాయి. కానీ భారత్ మాత్రం ఆర్థికంగా అద్భుతాలు చేసి చూపుతోంది. మన ఆర్థిక వ్యవస్థ పునాదులు అత్యంత పటిష్ఠంగా ఉండటమే ఇందుకు కారణమని ప్రపంచమంతా విశ్వసిస్తోంది. ఇటీవలి కాలంలో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు మన సన్నద్ధత స్థాయిని ప్రపంచానికి చాటిచెప్పాయి'' అన్నారు.

వహ్వా కర్నాటక!

పదేళ్ల క్రితం దాకా భారత్‌లో పరిస్థితి పూర్తి చాలా నిరాశాజనకంగా ఉండేదని మోదీ అన్నారు. ''మేమొచ్చాక యువతకు పూర్తిగా స్వేచ్ఛనిచ్చి ప్రోత్సహించాం. సాహసోపేతమైన సంస్కరణలు, భారీ మౌలిక వ్యవస్థలు, అత్యున్నత నైపుణ్యాల కలబోతగా నూతన భారత నిర్మాణం సాధ్యపడింది. సంప్రదాయేతర ఇంధన రంగంలో భారత విజయాలు ప్రపంచమంతటికీ ఉదాహరణగా నిలిచాయి. కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ ప్రభుత్వాలుండటం వల్ల కర్నాటకకూ డబుల్ ఇంజన్ సామర్థ్యం సమకూరింది. ఫలితంగా చాలా రంగాల్లో రాష్ట్రం అగ్రస్థానంలో దూసుకుపోతోంది. పరిశ్రమల నుంచి ఐటీ, బయోటెక్, స్టార్టప్‌లు, ఇంధన రంగాల దాకా రికార్డు స్థాయి ప్రగతి చరిత్రను లిఖిస్తూ తోటి రాష్ట్రాలకే గాక పలు ఇతర దేశాలకు కూడా సవాలు విసులుతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతిభ, టెక్నాలజీ గురించి ఎక్కడ ప్రస్తావన వచ్చినా మొట్ట మొదట గుర్తొచ్చేది 'బ్రాండ్ బెంగళూరు'' అని కొనియాడారు. 'బిల్డ్ ఫర్ ద వరల్డ్' నినాదంతో సదస్సును నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

..మేమెంత ప్రచారం చేసుకోవాలి!

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఎలా ఉండాలన్న అంచనాలన్నింటినీ అందుకునేలా అన్ని సదుపాయాలతో ఢిల్లీని తీర్చిదిద్దుతున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆర్థికంగా వెనకబడ్డ వర్గాల కోసం నిర్మించిన 3,024 కొత్త ఫ్లాట్లను మోదీ బుధవారం ప్రారంభించారు. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ చేసిందేమీ లేకపోయినా లేని గొప్పలను చెప్పుకుంటూ ప్రచారంపై భారీగా ఖర్చు పెడుతోందంటూ ఎద్దేవా చేశారు. ఆ లెక్కన ఇన్ని పనులు చేస్తున్న తాము ఇంకెంత ప్రచారం చేసుకోవాలని లబ్ధిదారులనుద్దేశించి ప్రశ్నించారు. ''మాది పేదల ప్రభుత్వం. ఢిల్లీ అభివృద్ధికి నిత్యం పాటుపడుతున్నాం. ఢిల్లీ మెట్రోను 190 కిలోమీటర్ల నుంచి 400 కిలోమీటర్లకు విస్తరించాం. చుట్టుపక్కల హైవేలను తీర్చిదిద్దాం. మరెన్నో మౌలిక సదుపాయాలు కల్పించాం'' అని చెప్పారు.

హక్కుల నేత ఇలా భట్ అస్తమయం



అహ్మదాబాద్: మహిళా హక్కుల ఉద్యమకారిణి, సెల్ఫ్ ఎంప్లాయిడ్ విమెన్స్ అసోసియేషన్ (సేవా) వ్యవస్థాపకురాలు ఇలా భట్ (89) బుధవారం అహ్మదాబాద్‌లో వయో సంబంధ సమస్యలతో కన్నుమూశారు. పద్మభూషణ్ గ్రహీత అయిన ఆమె మహిళా సాధికారికత సాధనకు ఎనలేని కృషి చేసి అంతర్జాతీయ గుర్తింపు పొందారు. అసంఘటిత రంగ మహిళా కార్మిక సంఘం సేవాలో ప్రస్తుతం 20 లక్షల మంది సభ్యులున్నారు. ఇలా భట్ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 1933లో జన్మించారు. కొద్ది కాలం పాటు టీచర్‌గా పనిచేశారు. అనంతరం అహ్మదాబాద్ వస్త్ర కార్మిక సంఘం న్యాయ విభాగంలో చేరారు. వస్త్ర రంగంలో పనిచేసే మహిళల కోసం 1972లో సేవాను నెలకొల్పారు. తర్వాత ఇతర రంగాలకూ విస్తరించింది. సేవా ఆధ్వర్యంలో సహకార బ్యాంకు స్థాపన, సూక్ష్మ రుణ ఉద్యమం మొదలయ్యాయి. ఉమెన్స్ వరల్డ్ బ్యాంకింగ్ వ్యవస్థాపకుల్లో ఈమె ఒకరు. గాంధీ సిద్ధాంతాలను ఆచరించే ఇలా భట్ మహాత్ముడు నెలకొల్పిన గుజరాత్ విద్యాపీఠ్‌కు చాన్స్‌లర్‌గా ఈ ఏడాది అక్టోబర్ వరకు కొనసాగారు. రాజ్యసభ సభ్యురాలిగా, ప్రణాళికా సంఘం సభ్యురాలిగాను ఆమె పనిచేశారు. రామన్ మెగసెసె, రైట్ లైవ్లీహుడ్, నివానో శాంతి బహుమతి, ఇందిరాగాంధీ అంతర్జాతీయ శాంతి బహుమతి అందుకున్నారు. ఆమెకు అమిమాయి, మిహిర్ అనే ఇద్దరు సంతానం ఉన్నారు. ఇలా భట్ మృతి పట్ల ప్రధాని మోదీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ సంతాపం ప్రకటించారు.

ఇథనాల్ ధర పెంపు

- వచ్చే ఏడాది నుంచి పెట్రోల్‌లో 12% ఇథనాల్ కలిపేలా చర్యలు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ ధరల్ని కేంద్రం పెంచింది. వచ్చే ఏడాది నుంచి పెట్రోల్‌లో 12 శాతం ఇథనాల్ కలిపేలా చర్యలు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) పలు నిర్ణయాలు తీసుకుంది. వివరాలను కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి మీడియాకు తెలిపారు. ''మూడు రకాల ఇథనాల్ ధరల్ని పెంచాం. చెరుకు రసం నుంచి తీసే ఇథనాల్ లీటర్‌కు రూ.63.45 నుంచి రూ.65.61కి సి-హెవీ మొలాసెస్ నుంచి తీసే ఇథనాల్ రూ.46.66 నుంచి రూ.49.41కు, బి-హెవీ రూట్ నుంచి వచ్చే ఇథనాల్ లీటర్ రూ.59.08 నుంచి రూ.60.73కు పెరుగుతాయి'' అన్నారు.

ఎరువులపై రూ.51,875 కోట్ల సబ్సిడీ

2022-23 ఆర్థిక సంవత్సరంలో రబీ సీజన్‌కు ఫాస్ఫాటిక్ పొటాసిక్ (పీ అండ్ కే) ఎరువులపై రూ.51,875 కోట్ల సబ్సిడీకి కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. నైట్రోజన్‌పై కేజీకి రూ.98.02, ఫాస్ఫరస్‌పై కేజీకి రూ.66.93, పొటాష్‌పై కేజీకి రూ.23.65, సల్ఫర్‌పై కేజీకి రూ.6.12 సబ్సిడీని ఇస్తూ నిర్ణయం తీసుకుంది. డెన్మార్క్‌తో నీటి వనరుల సంరక్షణ, నిర్వహణకు అవగాహనా ఒప్పందానికి కూడా కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.

ఢిల్లీ గాలి 'వెరీ పూర్'..!



దారుణంగా గాలి నాణ్యత

- పులిపై పుట్రలా పంజాబ్, హరియాణాల్లో పంట వ్యర్థాల కాల్చివేత
- హుటాహుటిన రంగంలోకి ప్రభుత్వం
- ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్ కల్పించాలని కంపెనీలకు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుతోంది. పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హరియాణా, యూపీ రైతులు పంట వ్యర్థాలను కాల్చేస్తుండటంతో ఆ పొగంతా ఢిల్లీని దట్టంగా కమ్మేస్తోంది. దీంతో గాలి నాణ్యత దారుణంగా పడిపోయింది. బుధవారం ఢిల్లీలో వాయు నాణ్యత సూచిక (ఏక్యూఐ) 354 (వెరీ పూర్)గా నమోదైంది. నోయిడాలో 406కి పడిపోయింది.

మంటలు రేపుతున్న కాలుష్యం...

పంజాబ్‌లో సెప్టెంబర్ 15-నవంబర్ 1 మధ్య గతేడాదిని మించి 17,846 వ్యవసాయ వ్యర్థాల కాల్చివేతలు జరిగాయి. బుధవారం సైతం పంజాబ్‌లో 1,880 చోట్ల పంట వ్యర్థాల కాల్చివేత సాగింది! వీటిని నియంత్రించాలని ఢిల్లీ ప్రభుత్వం పొరుగు కోరుతున్నా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్ మరియు నోయిడా వంటి ఢిల్లీకి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రాంతీయ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని యూపీ, హరియాణా ప్రభుత్వాలను ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్‌రాయ్ అభ్యర్థించారు. కాలుష్య సమస్య రాష్ట్ర సమస్య కాదని, అభివృద్ధి చెందుతున్న వాయు వ్యవస్థ కారణంగా ఇది జరుగుతోందని, దీని కట్టడికి ఉమ్మడి సహకారం అవసరమని రాయ్ పేర్కొన్నారు.

కార్మికులకు భృతి

వాయుకాలుష్యం తీవ్రరూపం దాల్చడంతో ఢిల్లీలో అన్ని నిర్మాణ, కూల్చివేత కార్యకలాపాలపై పూర్తి నిషేధం అమల్లోకి వచ్చింది. నిషేధ సమయంలో ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి నెలకు రూ.5 వేలు అందించాలని సీఎం అరవింద్ కేజ్రీవాల్ నిర్ణయించారు. ఇక కాలుష్యం తగ్గించేందుకు ఉద్యోగులు వీలునుబట్టి వర్క్ ఫ్రం హోమ్ పనిచేయాలని, ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గించాలని రాష్ట్ర మంత్రి గోపాల్‌రాయ్ ప్రజలను కోరారు.



పరమ నాసిరకంగా మోర్బీ మరమ్మతులు


అహ్మదాబాద్: మోర్బి వంతెన పునర్నిర్మాణ పనులపై గుజరాత్ పోలీసు శాఖ విచారణలో కళ్లు తిరిగే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ''ఎటువంటి అనుభవం లేని అజంతా- ఒరెవా సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. అది కేవలం వంతెన కేబుళ్లకు రంగులు, పాలిష్ వేసి హడావుడిగా ప్రారంభించేసింది. నాసిరకమైన బరువైన మెటీరియల్ వాడకం ఒక దుర్ఘటనకు కారణమైంది. పనులు చేసిన సిబ్బందికి వేలాడే వంతెనకు సంబంధించిన ఎలాంటి పరిజ్ఞానమూ లేదని తేలింది. పనులపై ఆడిట్ జరగలేదు. నిపుణుల పర్యవేక్షణా లేదు. తుప్పుపట్టిన పాత కేబుళ్ల స్థానంలో కొత్తవి వేయకపోవడం, సామర్థ్యానికి మించి జనాన్ని అనుమతించడం ఘోరానికి దారితీసింది.


వేలాడే వంతెనపైకి కారు

బెంగళూరు: ద్విచక్రవాహనాలు, పాదచారులు మాత్రమే వెళ్లగలిగే వేలాడే వంతెనపై ఓ ప్రబుద్ధుడు ఏకంగా కారే నడపబోయాడు! కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా శివపుర వంతెనపై బుధవారం జరిగిన ఈ ఘటన వైరల్‌గా మారింది. ఉళావికి చెందిన ముజాహిద్ సయ్యద్ (26) కారుతో వంతెనపైకి దూసుకెళ్లాడు. అది మధ్యలో ఇరుక్కోవడం, స్థానికులు ప్రతిఘటించడంతో కారును వెనక్కు తోసుకెళ్లాడు. పోలీసులు ముజాహిద్‌ను అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు.

గెహ్లాట్ VS సచిన్

- గెహ్లాట్‌పై మోదీ ప్రశంసల్ని తేలిగ్గా చూడొద్దన్న సచిన్ పైలట్
- ఆ ఎమ్మెల్యేలపై చర్యలేవని నిలదీత





జైపూర్: రాజస్తాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలెట్ మరోసారి సీఎం అశోక్ గెహ్లాట్‌పై దాడికి దిగారు. మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ఒక కార్యక్రమంలో గెహ్లాట్‌పై ప్రశంసలు కురిపించడాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్టానానికి సూచించారు. పైలట్ బుధవారం మీడియాతో మాట్లాడారు. ''గతంలో మోదీ పార్లమెంటులో గులాం నబీ ఆజాద్‌ను ప్రశంసించారు. తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలుసు. తాజాగా గెహ్లాట్‌ను ప్రశంసించారు'' అంటూ ఆజాద్ కాంగ్రెస్‌ను వీడటాన్ని ఉద్దేశించి అన్యాపదేశంగా గెహ్లాట్ కూడా అదే చేస్తారనే అర్థంలో నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు జరుగుతున్నాయన్నారు.

ఆ ఎమ్మెల్యేలపై చర్యలేవీ ?

గెహ్లాట్‌తో పాటుగా ఆయన వర్గం ఎమ్మెల్యేల విషయంలో కూడా పైలెట్ అధిష్టానాన్ని నిలదీశారు. సెప్టెంబర్‌లో జరిగిన సీఎల్పీ సమావేశానికి గైర్హాజరై గెహ్లాట్ మద్దతుగా బలప్రదర్శనకు వెళ్లిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాది మాత్రమే గడువుందని, క్రమ శిక్షణ తప్పిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని పార్టీకి కొత్తగా అధ్యక్షుడైన మల్లికార్జున్ ఖర్గేకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గెహ్లాట్ పోటీలోకి దిగుతారని ప్రచారం జరిగినప్పుడు, సచిన్ పైలెట్‌ను తదుపరి సీఎంను చేస్తారని వార్తలొచ్చాయి. దీంతో గెహ్లాట్‌కు మద్దతుగా ఆయన వర్గం ఎమ్మెల్యేలు బలప్రదర్శనకు దిగిన విషయం తెలిసిందే. సీఎల్పీ సమావేశానికి గైర్హాజరైన గెహ్లాట్‌కు అత్యంత సన్నిహితులైన ముగ్గురు ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారందరిపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పైలెట్ గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

ఎందుకు మళ్లీ గళం విప్పారు?

సచిన్ పైలట్ ఉన్నట్టుండి గెహ్లాట్‌నిలెందుకు టార్గెట్ చేశారంటూ చర్చ జరుగుతోంది. రెండు నెలలుగా రాజస్తాన్ రాజకీయాల్లో ఒక విధమైన స్తబ్దత నెలకొంది. నాయకులెవరూ పార్టీ అంతర్గత వ్యవహారాలపై బహిరంగ వ్యాఖ్యలు చేయకూడదన్న అధిష్టానం ఆదేశంతో గెహ్లాట్, పైలట్ వర్గీయులు మౌనం పాటిస్తున్నారు. కానీ ఇటీవల పైలట్‌పై గెహ్లాట్ పరోక్ష విసుర్లకు దిగారు. అధికారంలో కొనసాగడానికి అనుభవానికి మించినది మరేది లేదని, తమ వంతు వచ్చే వరకు సహనంతో వేచి చూడాలని చురకలంటించారు. వచ్చే ఎన్నికల్లో కూడా సీఎం అభ్యర్థిని తానేనంటూ అన్నింట్లోనూ తన ఫోటో బాగా కనిపించేలా చర్యలు చేపడుతున్నారు. రోడ్డు బ్యానర్లు, పత్రికల్లో ప్రకటనలు, బడ్జెట్‌కు సంబంధించిన ప్రతులు, బిల్లు బోర్డులపై గెహ్లాట్ చిత్రాలే దర్శనమిస్తున్నాయి. అటు హైకమాండ్ కూడా గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో బిజీగా ఉండడం, రాహుల్ జోడో యాత్రలో ఉండడంతో రాజస్థాన్ వ్యవహారాలను పట్టించుకునే తీరిక వారికి లేదు. ఈ నేపథ్యంలో గెహ్లాట్‌ను ప్రధాని మోదీ ఓ మాటన గానే సచిన్ తన రాజకీయ అస్త్రాలకు పదును పెట్టారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

చారిత్రక విజయం దిశగా నెతన్యాహు పార్టీ

జెరుసలేం: ఇజ్రాయెల్‌లో తాజా ఎన్నికల్లో మాజీ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు(73) సారథ్యంలోని సంకీర్ణ కూటమి చరిత్రాత్మక విజయం దిశగా సాగుతోంది. వామపక్ష మెరెట్జ్ పార్టీ గట్టి పోటీ ఇస్తున్నా 85 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికే 120 మంది సభ్యుల పార్లమెంట్‌లో 65 సీట్లు నెతన్యాహు కూటమికి దక్కేలా కనిపిస్తున్నాయి. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాక గత నాలుగేళ్లలో దేశంలో ఏకంగా ఐదుసార్లు ఎన్నికలు జరిగాయి. తాజా ఫలితాలతో రాజకీయ సందిగ్ధానికి తెరపడనుంది. నెతన్యాహు కూటమికి 65 వరకు సీట్లు దక్కుతాయని ఎగ్జిట్ పోల్స్‌లోనూ వెల్లడైంది. ఈ కూటమిలో నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ, యూదు మతవాద పార్టీలు ఉన్నాయి.



అమెరికాలోని ఉటాలో వెంటోవర్ సమీపంలోని బోన్‌విల్లే సాల్ట్ ఫ్లాట్స్ వద్ద ఓ సందర్శకురాలి పోజు

సాక్షి
శ్రీకాకుళం
గురువారం • 3 • నవంబర్ • 2022



సీబీఏ పరీక్షలు ప్రారంభం

పాఠశాలల్లో సీబీఏ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిసారిగా ఓఎంఆర్ షీట్ విధానంలో ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. - 8లో



కలవల పంట

మత్స్యకారుల పంట పండుతోంది. సముద్రంలో భారీగా కలవల చేపలు లభ్యమవుతుండటంతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది. - 8లో

డిగ్రీ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు బుధవారం విడుదల చేశారు. జూలైలో జరిగిన ఈ పరీక్షలకు సంబంధించి బీఏలో 958 మందికి గాను 501 మంది, బీఎస్సీలో 5224 మందికి 2422 మంది, బీకాం కంప్యూటర్స్‌లో 603 మందికి 346 మంది, బీకాం జనరల్‌లో 747 మందికి 442 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

న్యూస్‌రీల్

నేర నియంత్రణకు చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ. చిత్రంలో ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్: ప్రతిపోలీస్ స్టేషన్ పరిధిలో నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ అధికారులను ఆదేశించారు. బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా జిల్లా కేంద్రంలోని సబ్ డివిజనల్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వివరాలు, నేరాల నమోదు తదితర విషయాలను డీఎస్పీ మహేంద్ర మత్తేను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిష్కారం కాని గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు ముమ్మరం చేయాలని, మహిళల భద్రతకు ప్రాధాన్యమివ్వాని సూచించారు. గస్తీలను పెంచి నేరాలను ముందుగానే పసిగట్టాలని, ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నారు. గంజాయి, గుట్కా, మద్యం వంటివి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనచోదకులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జి.ఆర్.రాధిక, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


రేపటి నుంచి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సమాఖ్య సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 4 నుంచి 6 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి నాటిక పోటీలను విజయవంతంచేయాలని శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం సభ్యులు విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని కళాకారుల సమాఖ్య కార్యాలయంలో నాటక పరిషత్ బ్రోచర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చిట్టి వెంకటరావు మాట్లాడుతూ 23 ఏళ్లుగా ప్రతినెలా కళా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అక్షయం(నెల్లూరు), దేవుడు(కాకినాడ), నాన్న..నేనొచ్చేస్తా(చిలకలూరిపేట), కొత్త భూతం(ఒంగోలు), ప్రభంజనం(శ్రీకాకుళం), ప్రక్షాళన(కత్రపాడు) నాటికలు ప్రదర్శించనున్నామని వివరించారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు పన్నాల నర్సింహమూర్తి, ఎల్.రామలింగస్వామి, బి.రామచంద్రదేవ్, మోహనరావు, నిక్కు హరిసత్యనారాయణ, కల్యాణం రామమోహనరావు, పొట్నూరు వెంకటరావు, కంచరాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో దీక్షకు రజతం



పతకంతో దీక్షా బెహర

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి కేంద్రీయ విద్యాలయ క్రీడా పోటీల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన దీక్షా బెహరా పతకంతో మెరిసింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో బాలికల 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ కేటగిరీలో రజత పతకం సాధించి శభాష్ అనిపించింది. నగరానికి చెందిన ఈ యువ క్రీడాకారిణి శాంతినగర్‌కాలనీలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో అంతర్జాతీయ మాస్టర్ స్విమ్మర్ ఎస్.కాంతారావు పర్యవేక్షణలో శిక్షణ పొందుతోంది. దీక్షా బెహరా పతకం సాధించడం పట్ల జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ఎస్‌వీ ప్రసాద్, కార్యదర్శి ఎం.విష్ణుమూర్తి, పి.వరప్రసాద్, ఒలింపిక్ సంఘ జిల్లా కార్యదర్శి పి.సుందరరావు, డీఎస్‌ఏ అధికారులు బుధవారం హర్షం వ్యక్తంచేశారు.

మన విశాఖ భవిత



ఉత్తరాంధ్ర ముఖద్వారం విశాఖ. మన భవిష్యత్తు ఆ మహానగరంతోనే ముడిపడి ఉంది. అది రాజధాని అయితే యావత్తు ఉత్తరాంధ్రకు మహర్దశ పడుతుంది. వెనుకబాటుతనం పోతుంది. వలసలు ఆగిపోతాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి.. మన భవిష్యత్తు తరాల జీవనం ఉజ్వలంగా వెలిగిపోతుందని.. పలు రంగాల ప్రముఖులు, మేధావులు ఉద్ఘాటించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలంటే పాలనా వికేంద్రీకరణ, మూడు రాజధానుల ఏర్పాటు చేయాల్సిందేనని నినదించారు. ఈమేరకు నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఆమదాలవలసలో రౌండ్ టేబుల్ సమావేశం, నరసన్నపేట ఉత్తరాంధ్ర గర్జన పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాలు మన విశాఖ.. మన భవిష్యత్తు అన్న నినాదంతో హోరెత్తాయి. విశాఖను రాజధాని చేయాల్సిందేనని గర్జించాయి.

నినదించిన అన్ని వర్గాల ప్రతినిధులు

- వికేంద్రీకరణకు మద్దతుగా నరసన్నపేటలో ఉత్తరాంధ్ర గర్జన ర్యాలీ
- ఆమదాలవలసలో రౌండ్ టేబుల్ సమావేశం



ఆమదాలవలస రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



నరసన్నపేట ప్రధాన రహదారిపై వికేంద్రీకరణకు మద్దతుగా నిర్వహించిన భారీ ర్యాలీలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, లజపతిరాయ్ తదితరులు

విశాఖ రాజధాని చారిత్రక అవసరం

ఆమదాలవలస/ఆమదాలవలస రూరల్: వికేంద్రీకరణతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, అన్నింటికీ అనువుగా ఉన్న విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటు చేయడం సముచితమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆమదాలవలస పట్టణంలోని శారద కల్యాణ మండపంలో బుధవారం వికేంద్రీకరణకు మద్దతుగా విశాఖ రాజధాని కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. మూడు రాజధానుల కోసం అందరూ మద్దతు తెలపాలని, విమర్శలకు తావు లేకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలని మూకుమ్మడిగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, ఎస్‌టీయూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పేడాడ ప్రభాకరరావు, సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జె.జె.మోహన్‌రావు, పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వైస్ ఫ్లోర్‌లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సరుబుజ్జిలి మండల ప్రత్యేక ఆహ్వానితుడు కె.వి.జి.సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూన వెంకట సత్యనారాయణ, వైఎస్ఆర్ సీపీ నేతలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రానికే ఖ్యాతి



సుచరిత్ర కలిగి, అన్ని సౌకర్యాలు ఉన్న విశాఖలో రాజధాని ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్రానికే ఎంతో ఖ్యాతి వస్తుంది. ఉత్తరాంధ్ర జిల్లాలన్నీ అభివృద్ధి చెందుతాయి. విద్యార్థులకు ఎంతోమేలు కలుగుతుంది. విశాఖ రాజధాని సాధన కోసం ఉద్యోగులంతా అండగా ఉంటాం.

– పేడాడ ప్రభాకరరావు, ఎస్‌టీయూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ

అంతర్జాతీయ స్థాయి నగరంగా..



దేశంలో అత్యుత్తమ నగరాల్లో విశాఖ ఒకటి. ఇక్కడ పరిపాలనా రాజధాని ఏర్పాటు చేస్తే అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుంది. జిల్లాలో వలసలు నివారించవచ్చు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి, మూడు రాజధానులకు ఉద్యోగులంతా మద్దతు తెలుపుతున్నాం.

– హనుమంతు సాయిరాం, ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు

సంఘీభావం ప్రకటించాలి..

విశాఖ రాజధానిగా ఏర్పాటైతే తక్కువ ఖర్చుతో దేశంలోనే అత్యున్నత రాజధానిగా నిలుస్తుంది. మూడు రాజధానుల కోసం అందరూ మద్దతు తెలపాలి. విమర్శలకు తావు లేకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలి. ఉత్తరాంధ్రలో వలసల నివారణ, నిరక్షరాస్యత నిర్మూలన, నిరుద్యోగ నిర్మూలనకు విశాఖ రాజధాని కచ్చితంగా వచ్చి తీరాలి. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు, రైతులు స్వచ్ఛందంగా సంఘీభావం ప్రకటించాలి. విశాఖ రాజధానిని వ్యతిరేకించే వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారు.

– తమ్మినేని సీతారాం, శాసనసభ స్పీకర్



నరసన్నపేట ర్యాలీలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న విద్యార్థిని

మూడు రాజధానులతోనే ప్రగతి

నరసన్నపేట: విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం నరసన్నపేటలో ఉత్తరాంధ్ర గర్జన పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో మూడు రాజధానులకు మద్దతుగా జరిగిన ఈ భారీ ర్యాలీకి ముందుగానే వైఎస్సార్ సీపీ మద్దతు ప్రకటించింది. దీంతో భారీగా ప్రజాప్రతినిధులు, మేధావులు, విద్యార్థులు తరలివచ్చారు. పైడితల్లి ఆలయం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకూ జరిగిన ఈ ర్యాలీకి న్యాయవాదులు, మోటారు వర్కర్స్, కార్ స్టాండ్, విద్యా సంస్థల ప్రతినిధులు, జిల్లా కళింగ వైశ్యుల సంఘం ప్రతినిధులు, కళాశీలు మద్దతు ప్రకటించారు. వివిధ వర్గాల ప్రముఖులు మాట్లాడారు. సుమారు ఆరు వేలమంది హాజరైన ఈ కార్యక్రమంలో పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం నెరవేరే వరకు విశ్రమించం..



విశాఖలో రాజధాని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సుముఖంగా ఉంది. ఇంతకన్నా మంచి అవకాశం మళ్లీ రాదు. పాలనా రాజధాని ఏర్పాటయ్యే వరకూ విశ్రమించం. మరింత మందిని కూడగట్టి ఎలాగైనా పాలనా రాజధాని సాధించుకుంటాం.

– కనపల అరవింద్, నిరుద్యోగి, పోతయ్యవలస

సమన్యాయం జరుగుతుంది



మూడు రాజధానుల ఏర్పాటు వల్ల అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరుగుతుంది. పరిశ్రమలు ఏర్పాటైతే నిరుద్యోగాన్ని నిర్మూలించవచ్చు. రాజధాని కోసం చట్టపరంగా ముందుకు సాగుతూ ఉద్యమించాలి. భావితరాల భవిష్యత్ కోసం కృషి చేయాలి.

– బి.అడ్డయ్య, రిజిస్ట్రార్, బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, ఎచ్చెర్ల

వ్యతిరేకులంతా ఉత్తరాంధ్ర ద్రోహులే..



ఇప్పుడున్న పరిస్థితుల్లో అభివృద్ధి కోసం వికేంద్రీకరణ జరపాల్సిందే. విశాఖలో పాలనా రాజధాని ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి నిర్ణయం సరైనదే. గత ప్రభుత్వాలే ఈ నిర్ణయం తీసుకోవాల్సింది. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉత్తరాంధ్రులంతా స్వాగతిస్తున్నారు. విశాఖను వ్యతిరేకిస్తున్న వారందరూ ఉత్తరాంధ్రా ద్రోహులే.

– ఎంఆర్ జ్యోతీ ఫ్రెడరిక్, రిటైర్డ్ ప్రిన్సిపాల్, నరసన్నపేట

యువతకు లబ్ధి..



రాష్ట్రంలో పాలనను వికేంద్రీకరించడం ద్వారా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. విశాఖలో రాజధాని ఏర్పాటైతే అనేక పరిశ్రమలు వస్తాయి. మాలాంటి యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. వికేంద్రీకరణతోనే మాకు మంచి భవిష్యత్తు ఉంది.

– యశస్విని, ఇంటర్మీడియట్ సెకెండియర్, సంపత్ సాయి కళాశాల

టీడీపీ వ్యతిరేకించడం దారుణం..

విశాఖ రాజధాని వల్ల ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెనుకబాటుతనం పోతుంది. పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. హర్యానా, గుజరాత్ వంటి రాష్ట్రాలు వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి సాధించాయి. విశాఖలో పాలనా రాజధానిని టీడీపీ వ్యతిరేకించడం దారుణం. టీడీపీ వైఖరిని తీవ్రంగా ఖండించి విశాఖలో పాలనా రాజధాని సాధించుకుందాం.

– ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే, నరసన్నపేట

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

- రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ శ్రీకేశ్ బి.లాఠకర్‌తో కలిసి శ్రీకాకుళం ఆర్.టి.సి కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ ఆవరణలోని మరుగుదొడ్లు మరింత పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాన్ స్టాప్ బుకింగ్ కౌంటర్స్, ప్లాట్‌ఫాం, దుకాణాలను నిశితంగా పరిశీలించిన ఆయన అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం బస్‌స్టేషన్ నుంచి రోజుకు సుమారు 25వేల మంది ప్రయాణిస్తున్నందున అందుకు తగిన విధంగా వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం బస్సు ఎక్కి ప్రయాణికులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్యనిర్వాహక సంచాలకులు గిడుగు వెంకటేశ్వరరావు, ప్రాంతీయ మేనేజర్ ఎ.విజయకుమార్, ఆర్టీసీ డీఈ బమ్మిడి రవికుమార్, శ్రీకాకుళం 1, 2వ డిపోల మేనేజర్లు కె.మాధవ్, కె.ఎస్.ఆర్. శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

రోడ్డు పనుల తీరుపై మండిపాటు..

జలుమూరు: కళింగపట్నం నుంచి పాతపట్నం వరకు జరుగుతున్న జాతీయ రహదారి పనులపై ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చల్లవానిపేట సమీపంలో రోడ్డు పనులను పరిశీలించారు. రూ.352 కోట్లతో జరుగుతున్న ఈ పనులు నత్తనడక సాగుతుండటంపై అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ సీఈ రామచంద్ర, ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి, తహసీల్దార్లు ప్రవల్లికాప్రియ, సత్యం, ఆర్అండ్‌బీ ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

2 కేంద్రాలు.. 1,117 మంది అభ్యర్థులు

- నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు
- పకడ్బందీగా ఏర్పాట్లు: డీఆర్వో రాజేశ్వరి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజేశ్వరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి అధికారులను ఆదేశించారు. నవంబర్ 3 నుంచి 7 వరకు జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షలకు సంబంధించి మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3న డివిజనల్ అకౌంటెంట్ ఆఫీసర్స్, 4న సహాయ పౌర సంబంధాల అధికారి, సహాయ గణాంకాల అధికారి, 6న జిల్లా పౌర సంబంధాల అధికారి, 7న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గ్రేడ్ -1 పరీక్షలు జరుతాయని వివరించారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. శానిటైజర్, మాస్కులు ధరించడం మేలన్నారు. అభ్యర్థులకు సరిపడా బస్సులు నడపాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీపీఎస్సీ ఎస్ఓలు షణ్ముఖరావు, భారతి మాట్లాడుతూ ఉదయం 9 తర్వాత, మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఎవరినీ కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. 6న జరిగే జిల్లా పౌర సంబంధాల అధికారి పరీక్షకు సంబంధించి ఒక పేపర్ తప్ప మిగతా అన్ని పరీక్షలు ఆబ్జెక్టివ్ తరహాలో ఆన్‌లైన్‌లో విధానంలో జరుగుతాయని చెప్పారు. చిలకపాలెంలోని శివానీ ఇంజనీరింగ్ కళాశాల, ఎచ్చెర్లలోని వెంకటేశ్వర కళాశాల కేంద్రంగా జరిగే ఈ పరీక్షలకు 1117 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వివరించారు. సమావేశంలో పర్యవేక్షకులు పి.శేఖర్,ఎస్‌ఐ నారాయణరావు, ఏఈ మహేష్, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం నగరంలోని ఆర్‌సీఎం లయోలా చర్చి ఆవరణలో బుధవారం సాయంత్రం సమాధుల పండుగ నిర్వహించారు. సమాధుల వద్ద కుటుంబ సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



హంసవాహనం సిద్ధం

అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి తెప్పోత్సవానికి హంసవాహనం సిద్ధమైంది. ఈ నెల 5న కార్తీక శుద్ధ ద్వాదశి, క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా ఉషా పద్మిని ఛాయా సమేత సూర్యనారాయణ స్వామి వారి ఉత్సవ మూర్తులను ఇంద్ర పుష్కరిణిలో విహరింపజేసేందుకు ఈ వాహనాన్ని తయారు చేయించారు. ఆలయ ఈఓ వి.హరి సూర్య ప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో ఈ నెల 4న ట్రైల్ రన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తెప్పోత్సవానికి సుమారు 50 వేల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తుండగా క్యూలైన్లు, బారికేడ్లు, వీఐపీ, వీవీఐపీల ప్రత్యేక సందర్శనా స్థలాలను సిద్ధం చేశారు.

– అరసవల్లి



సముద్రుని ఇంట.. కలవల పంట





- శీతాకాలంలో విరివిగా దొరికే కలవలు
- తీరమంతా కలవలతో కళకళ

ఇచ్ఛాపురం రూరల్: చలి గాలులు మొదలయ్యాయంటే చాలు సముద్రంలో కలవలు(కవ్వళ్లు) ఎగిరిపడుతుంటాయి. వేటకు వెళ్లిన వారందరినీ ఇవే పలకరిస్తాయి. ఈ సీజన్‌లో గంగపుత్రులకు దొరికే మత్స్య సంపద ఈ కలవలే. వీటితో పాటు సంక్రాంతి సీజనల్‌గా కోనేం, నెత్తళ్ల వంటి చేపలు అధిక ధరలకు అమ్ముడుపోతాయి. ప్రస్తుతం సముద్ర తీర ప్రాంతంలో కలవలు కళకళలాడుతున్నాయి.

మూడు రకాలుగా ఏరివేత

ఈ కలవలు బాగా దొరుకుతాయన్న మాటే గానీ.. వీటి వల్ల మత్స్యకారులకు పెద్దగా వచ్చేదేం ఉండదు. కాకపోతే కోళ్లు, రొయ్యలు, చేపల ఆహారానికి ఉపయోగపడతాయి. ఈ చేపలను మత్స్యకారులు మూడు రకాలుగా విభజించి ఇతర ప్రాంతాలకు విక్రయిస్తారు. మొదటి రకంగా పెద్దగా ఉండే పచ్చి కలవ చేపలను ఆహారానికి ఉపయోగిస్తుంటారు. ఇవి కేజీ రూ.60 వరకు ధర పలుకుతుండగా, గంప చేపలు రూ.600 వరకు కొనుగోలు చేస్తారు. అయితే ఈ రకం చేపలు పెద్దగా అమ్మకాలు కాకపోవడంతో రెండో రకంగా సేకరించిన కలవ చేపల్ని ఉప్పులో ఊరబెట్టి సముద్ర తీరంలో ఎండబెడతారు. వీటి ధర కిలో రూ.30 నుంచి రూ.40 వర కు పలుకుతోంది. ఇందులో నల్లని కలువ చేపల్ని మిక్స్ చేసి కోళ్లు, రొయ్యలు, చేపలకు మేతకు ఉపయోగిస్తారు. ఇక మూడో రకంగా ఉప్పులో నానబెట్టకుండా ఎండబెట్టిన చప్పని చేపలు. ఇవి ఏడాది పాటు నిల్వ ఉంచుకొని ఆహారంగా ఉపయోగిస్తారు. వీటి ధర మార్కెట్‌లో రూ. 50 నుంచి రూ.60 వరకు పలుకుతోందని మత్స్యకారులు చెబుతున్నారు.

అమ్మకానికి సిద్ధం చేసిన ఎండు కవ్వళ్ల చేపలు

సముద్ర తీరంలో ఎండబెట్టిన కవ్వళ్ల చేపలు



పచ్చి చేపల్ని ఎండబెడుతున్న మత్స్యకార మహిళ

ఇతర ప్రాంతాలకూ ఎగుమతి..

జిల్లాలో లభించే ఉప్పు కవ్వళ్లను దళారులు లగేజీ వ్యాన్‌ల ద్వారా విశాఖపట్నం, ఒడిశా–పశ్చిమ బెంగాల్ మధ్య ఉన్న దిగా మార్కెట్, గంజాం ప్రాంతంలో ఉన్న ఉమా సంత. ముంబై, చెన్నై, కర్ణాటక, కోల్‌కత్తా వంటి ప్రాంతాలకు టన్నుల కొద్దీ తరలిస్తుంటారు.

ఆదాయం లేని పంట

"ఏటా శీతాకాలంలో సముద్రంలో అధికంగా దొరికే చేపలు కవ్వళ్లు. ఒక రకంగా చెప్పాలంటే పెద్దగా ఆదాయం లేని పంటగా చెప్పవచ్చు. తప్పని పరిస్థితుల్లో వలకు దొరికిన చేపల్ని విడిచి పెట్టలేక ఒడ్డుకు తెచ్చి కేజీల ధరల్లో విక్రయిస్తుంటాం. అధిక శ్రమతో వీటిని ఎండల్లో ఎండబెట్టి అమ్మకాలు జరుపుతాం. ఈ సీజన్‌లో అధికంగా వర్షాలు కురుస్తుండటంతో ఒక్కో సమయంలో ఒడ్డులోనే చేపల్ని వదిలేస్తుంటాం. దీంతో బారీగా నష్టపోతుంటారు."

– బైపల్లి హరికృష్ణ, మత్స్యకారుడు, డొంకూరు

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



రజనికి చెక్కు అందిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: మండలంలోని నందికొండ కాలనీకి చెందిన దివ్యాంగురాలు గురుగుబెల్లి రజనికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు మంజూరైంది. ఈ మేరకు స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం తన క్యాంపు కార్యాలయం వద్ద చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు బొడ్డేపల్లి హరి, అత్తులూరి రవికాంత్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు బొడ్డేపల్లి చామంతి, ఇల్లాకులు ప్రకాష్, శ్రీనివాసరావు, పెద్ది రాజేష్, బెండి సింహాచలం, బెండి పాపారావు, ముకుంద, మెట్ట అన్నాజీ పాల్గొన్నారు.

వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ సేవలపై ఆరా



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ ఫ్యామిలీ హెల్త్ క్లినిక్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. బుధవారం శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని చాపురం–1లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సంబంధించిన ఫ్యామిలీ క్లినిక్‌ను పరిశీలించారు. స్థానికంగా అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సక్రమంగా వైద్యసేవలందించాలని సిబ్బందికి సూచించారు.

బస్తా పడి విద్యార్థినికి గాయాలు



గాయపడిన యశోద

కాశీబుగ్గ: పలాస మండలం కొబ్బరిచూరు గ్రామానికి చెందిన విద్యార్థిని తామాడ యశోద బుధవారం పలాస ఆర్టీసీ కాంప్లెక్సులో బస్సు దిగి వస్తుండగా మరో బస్సు పైనుంచి 250 కిలోల బరువైన మూటపడింది. నడుముకు గాయం కావడంతో స్థానికులు 108 అంబులెన్సులో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. లగేజిల కోసం ప్రత్యేకమైన కౌంటర్ ఏర్పాటు చేయకుండా.. ప్రయాణికులు రాకపోకలు చేసే ప్రదేశంలోనే బరువులు దించుతుండటంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

దేహ దారుఢ్యంపై శ్రద్ధ అవసరం



జిమ్‌ను పరిశీలిస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు చదువుతో పాటు దేహ దారుఢ్యంపైనా శ్రద్ధ వహించాలని ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలోని ఇన్‌డోర్ జిమ్, వసతి గృహాలు, విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జిమ్‌లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిమ్‌లో పరికరాలు పాడైతే తక్షణం వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు ఫిట్‌నెస్, యోగా విభాగం సమన్వయకర్త డాక్టర్ కె.తారక రామారావు ఉన్నారు.

పాఠశాలల్లో సీబీఏ పరీక్షలు ప్రారంభం



ఇచ్ఛాపురం రూరల్: ఇన్నేశుపేటలో సీబీఏ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ/ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వం తీసుకొచ్చిన సరికొత్త విధానంలో పరీక్షలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. ఈ నెల 5 వరకు జరిగే ఈ పరీక్షల్లో 1 నుంచి 8వ తరగతి వరకు సరికొత్తగా క్లాస్‌రూం బేస్డ్ ఎసెస్మెంట్ (సీబీఏ) విధానంలో పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 3886 పాఠశాలల్లో 360970 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 99 శాతం మంది వరకు హాజరయ్యారు. ఎస్‌సీఈఆర్టీ రూపొందించిన ఈ ప్రశ్నపత్రంతో విద్యార్థులు తొలిసారిగా ఓఎంఆర్ షీట్‌లో జవాబులు రాశారు. ,10వ తరగతి విద్యార్థులు మాత్రం పాత విధానం(ఫార్మెటివ్)లోనే పరీక్షలు రాశారు. జిల్లా విద్యాఖాధికారి గార పగడాలమ్మ, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్, ఉప విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు పర్యవేక్షించారు. పలు పాఠశాలల్లో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

ఉపాధ్యాయ సంఘ నేతల హర్షం..

దేశ చరిత్రలోనే తొలిసారిగా 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్షలు నిర్వహించడం శుభపరిణామమని పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షలకు పునాదిగా రాష్ట్ర విద్యాశాఖ బుధవారం నుంచి ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్షలను ప్రారంభించింది. బబుల్ చేయడం వంటి పద్ధతులు భవిష్యత్తులో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెబుతున్నారు. మండల స్థాయిలో నిర్వహించిన పరీక్షను ఇచ్ఛాపురం ఎంఈఓ కురమాన అప్పారావు పర్యవేక్షించారు.

చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్ అందిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పోలీసు కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎస్పీ జి.ఆర్. రాధిక భరోసా ఇచ్చారు. పి.జోగారావు బారువ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆయన భార్య లక్ష్మికి విడో ఫండ్ కింద రూ.50 వేలు, ఫ్లాగ్ ఫండ్ కింద రూ.25వేలు చెక్‌లను శ్రీకాకుళం నగరంలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ వెంటనే వచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు.

13న కారా మాస్టారు జయంతి సభ

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ కథా రచయిత, కథా నిలయం వ్యవస్థాపకుడు దివంగత కాళీపట్నం రామారావు మాస్టారు(కారా మాస్టారు) 98వ జయంతి సభ ఈనెల 13న శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళ సాహితి సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బహుదా, కథ–1980 సంపుటి, కారా మాస్టారు స్మారక కథా సంకలనం, తెలుగు రచయితల కలం పేర్లు, దిగొచ్చిన దేవత–అర్నాద్ కథా సంపుటి పుస్తకాల ఆవిష్కరణలు, కారా సన్నిహితుల అభిభాషణలు ఉంటాయని పేర్కొన్నారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వే స్టేషన్ ఆవరణలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న వైద్యులు

టెక్కలి రూరల్: నౌపాడ ఆర్ఎస్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే ఏఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... చెన్నై నుంచి హౌరా వైపు వెళ్తున్న రైలు జనరల్ బోగిలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు గార్డుకు సమాచారం అందించారు. సదరు గార్డు ఆ వ్యక్తిని నౌపాడ ఆర్ఎస్ రైల్వే స్టేషన్‌లో విడిచిపెట్టి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సమీప రైల్వే ఆస్పత్రి వైద్యులకు సమాచారం అందించారు. వైద్యుడు సింహాచలం వచ్చి వైద్యపరీక్షలు నిర్వహించగా అప్పటికే వ్యక్తి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి వద్ద రైల్వే టికెట్ గానీ, ఆధార్ కార్డు గానీ లభ్యం కాలేదు. సుమారు 50 ఏళ్ల వయసు ఉంటుందని, గీతల చొక్క, ప్యాంట్ వేసి ఉన్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పలాస రైల్వే ఆస్పత్రికి తరలించారు.

సీహెచ్ కపాసుకుద్ధిలో విష జ్వరాల పంజా



జ్వరంతో బాధపడుతున్న శీలం డొంబురు

కవిటి: రాజపురం పీహెచ్‌సీ పరిధిలోని సీహెచ్ కపాసుకుద్ధిలో విష జ్వరాలు పంజా విసురుతున్నాయి. ఒక్కో ఇంట్లో ఇద్దరు నుంచి ముగ్గురు జ్వరం బారిన పడి ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కొన్ని నెలల కిందట మద్రి మోహనరావు అనే వ్యక్తి డెంగీతో మృతిచెందినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారిలో కొందరు కవిటి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు. మరికొందరు ఆర్ఎంపీ సాయంతో ఇంటి వద్దే వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా వైద్య సిబ్బంది స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మరోవైపు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడిందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



నౌపడ రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం అనుప్ శతపతి

టెక్కలి రూరల్: నౌపడ ఆర్ఎస్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం అనుప్ శతపతి అన్నారు. బుధవారం నౌపడ ఆర్ఎస్ రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో వాటిని అభివృద్ధిని చేస్తామన్నారు. అనంతరం రైల్వే ఆక్రమిత ప్రాంతాలపై ఆరా తీశారు. నౌపడ నుండి గుణ్‌పూర్ వైపు వెళ్లే రైల్వేలైన్‌ను పరిశీలించారు. ప్లాట్ ఫాం ఎత్తుచేయాలని, రాజ్‌రాణి ఎక్స్‌ప్రెస్ టెక్కలిలో ఆగేలా చూడాలని, పూర్తిస్థాయిలో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని పలువురు వినతిపత్రాలు అందించారు. ఈయనతో పాటు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రారంభం



కె.రవితేజ

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో ఎమర్జెన్సీ వైద్య విభాగం ప్రారంభమైంది. ఇప్పటివరకు ఈ వైద్య విభాగానికి నిపుణులు లేకపోవడంతో దీన్ని ప్రారంభించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రెండు రోజుల క్రితం వైద్యులను నియమించగా శ్రీకాకుళం రిమ్స్ కళాశాలకు కెతావత్ రవితేజను నియమించింది. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వెంటనే ఎమర్జెన్సీ వైద్య విభాగాన్ని కూడా ప్రారంభించారు. ప్రస్తుతం హౌస్ సర్జన్లు, పీజీలతో ఈ విభాగాన్ని కొనసాగిస్తున్నారు. జిల్లా వెంబడి 170 కిలోమీటర్లు పైబడి జాతీయ రహదారి ఉండటంతో ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర వైద్య విభాగం లేకపోవడంతో విశాఖపట్నం తరలిస్తున్నారు. ట్రామా కేర్ సెంటర్ ఉన్నప్పటికీ జనరల్ మెడిసిన్ వైద్యులు మాత్రమే వైద్య సేవలు అందిస్తూ అత్యవసర సమయంలో తప్పనిసరిగా విశాఖ తరలించాల్సి వస్తోంది. ఇప్పుడు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రారంభం కావడంతో విశాఖకు పెద్దగా కేసులు తరలించకుండా జిల్లాలోనే వైద్యం అందించేందుకు వీలు కలుగుతుంది.

సెమిస్టర్ పరీక్షలకు ప్రత్యేక పరిశీలకులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 1 నుంచి జరుగుతున్న డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల పరిశీలనకు ప్రత్యేక పరిశీలకులను నియమించినట్లు వైస్ చాన్సలర్ నిమ్మ వెంకటరావు బుధవారం చెప్పారు. జిల్లాలో 67 కేంద్రాల్లో పరీక్షలు జరగుతున్నట్లు వివరించారు. మాస్ కాపీయింగ్, పరీక్షల నిర్వహణలో సమస్యలు లేకుండా పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. పాతపట్నం, హిరమండలం ప్రాంతాలకు పాతపట్నం డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు, రాజాంకు రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్నహైందవి, పొందూరు, ఎచ్చెర్లకు పొందూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు, పలాస, కాశీబుగ్గ ప్రాంతాలకు పలాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి, టెక్కలి, నౌపాడ ప్రాంతాలకు టెక్కలి డిగ్రీకళాశాల వైస్ ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి ప్రాంతాలకు ఇచ్ఛాపురం అధ్యాపకుడు దుర్యోధన దలై, బారువ, హరిపురం, సోంపేట ప్రాంతాలకు బారువ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు బి.రాంబాబులను నియమించినట్లు వివరించారు. ఆయనతో పాటు ఎగ్జామినేషన్‌డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ ఉన్నారు.

సమ న్యాయమే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయ విద్యార్థులు వృత్తిలో నైపుణ్యం పెంచుకొని సమాజంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం అందేలా చూడాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బుధవారం శ్రీకాకుళం నగరంలోని ఎంపీఆర్ లా కాలేజీలో ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా న్యాయ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తితో సమాజానికి సేవ చేసే భాగ్యం కలుగుతుందన్నారు. అనంతరం పొన్నాడలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో సదస్సు నిర్వహించి మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆయా సదస్సుల్లో ప్రిన్సిపల్ మోషే, అధ్యాపకులు కిషోర్‌కుమార్ నాయుడు, చంద్రశేఖర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ సూర్యకళ తదితరులు పాల్గొన్నారు

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,380–00
బంగారం(22సి. 10గ్రా.)	46,460–00
వెండి (కిలో)	60,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 445.00
విజయనగరం	రూ. 449.00
శ్రీకాకుళం	రూ. 449.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹215	₹ 235

•ఆహ్వానం



జిల్లా కేంద్రంలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయ పాలక మండలి సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారం ఈనెల 3న జరగనుంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పాలక మండలి చైర్మన్ సుంకరి కృష్ణ బుధవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈయనతో పాటు సభ్యుడు నక్క రామరాజు ఉన్నారు. – శ్రీకాకుళం రూరల్

•ప్రారంభం



పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మేజరు పంచాయతీలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం భవనాన్ని మంత్రి ప్రారంభించారు. – మందస

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

జి.సిగడాం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం మండలంలో పర్యటిస్తారని ఎంపీపీ మీసాల సత్యవతి బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు తహసీల్దార్, ఎంపీడీవో కార్యలయాల్లో ఏర్పాటు చేసిన పట్టుభద్రల ఓట్ల నమోదు కార్యక్రమంపై అవగహన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై సమీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఓట్లు నమోదు ప్రక్రియపై ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం సమీక్ష నిర్వహించనున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం పదిన్నర గంటలకు అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష చేస్తారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు



రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

జి.సిగడాం: గ్రామాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు పున్నాన అక్క నాయుడు అన్నారు. పెంట గ్రామ సచివాలయం పరిధిలోని పెంట, నాగులవలస గ్రామాల్లో జెమ్స్ అస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి మందులను అందజేశారు.

ప్రమాణ స్వీకారం నేడు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారం గురువారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆలయ ఈవో వాకచర్ల రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాణ స్వీకారానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరవుతున్నారన్నారు.

సచివాలయాల పరిశీలన



చాపురంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

శ్రీకాకుళం రూరల్: మండలంలోని నైరా, పొన్నాం, చాపురం, కళ్లేపల్లి, కిల్లిపాలెం తదితర సచివాలయాలను తహసీల్దార్ ఎస్.వెంకట్రావు బుధవారం పరిశీలించారు. ప్రతీ సచివాలయం పరిధిలో పట్టభద్రుల ఓట్లు నమోదు విషయంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఆర్ఐ శంకర్ ఉన్నారు.

'ఓటుహక్కును నమోదు చేయించండి'



మాట్లాడుతున్న మామిడి శ్రీకాంత్

శ్రీకాకుళం రూరల్: అర్హులైన పట్టభద్రుల ఓటు హక్కును నమోదు చేయించాలని కాపు కార్పొరేషన్ చైర్మన్, ఉమ్మడి జిల్లా పట్టభద్రుల పరిశీలకుడు మామిడి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద పరిశీలన



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న దృశ్యం

జి.సిగడాం: కొత్తపెంట యూపీ పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దను ఎంఈవో అరసాడ రవి బుధవారం పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని పెట్టాలని వంట నిర్వాహకులకు సూచించారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి చెందారు. ప్రధానోపాధ్యాయుడు మజ్జి మదన్‌మోహన్, సిబ్బంది కోనా నారాయణప్పడు, చంద్రరావు, గొర్లె శేఖర్, బొల్లా శ్రీనివాసరావు, ధర్మారావు ఉన్నారు.

5న అయ్యప్పస్వామికి తెప్పోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: ఈనెల 5వ తేదీన క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా బలగ అయ్యప్పస్వామి దేవాలయంలోని మణిగంగ పుష్కరిణిలో తెప్పోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకులు శంకరనారాయణ శర్మ, కమిటీ అధ్యక్షుడు రెడ్డి చిరంజీవులు, కార్యదర్శి దానేటి రాజారావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఊరేగింపు నిర్వహించిన అనంతరం పుష్కరిణిలో స్వామివారు ఊరేగుతారని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

పట్టభద్రుల ఓటుహక్కు నమోదుపై ప్రత్యేక దృష్టి

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు దరఖాస్తు అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఓటు హక్కు నమోదుపై గ్రామాల వారీగా బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన ఓటు నమోదు దరఖాస్తును తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2019 అక్టోబర్ 31వ తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు ఓటును ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ పట్టా జిరాక్స్, రెండు ఫొటోలు, దరఖాస్తులను సమీపంలోని బూత్ లెవెల్ అధికారులకు, గ్రామ సచివాలయ అధికారులకు గాని అందజేయాలని సూచించారు. ఈ నెల 7వ తేదిలోపు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్, ఎంపీడీవో ధనుంజయరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, రెడ్డి విశ్వేశ్వరరావు, చినరామినాయుడు, కరిమజ్జి భాస్కరరావు, గొర్లె అప్పలనర్సునాయుడు, లంకలపల్లి ప్రసాద్, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఉన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదుపై సమీక్ష



లావేరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: పట్టభద్రుల ఓటుహక్కు నమోదు ప్రక్రియపై లావేరులోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పంచాయతీల వారీగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమీక్షించారు. పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి, డీటీ మూర్తి, ఇన్‌చార్జి ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, బూత్ కమిటీ మండల కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు ఎం.విజయలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సొంత భవనాలు



భూమి పూజ చేస్తున్న దృశ్యం

లావేరు: నాడు–నేడు పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేస్తున్నట్టు ఐసీడీఎస్ రణస్థలం ప్రాజెక్టు పీవో ఝాన్సీరాం, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు చెప్పారు. రావివలస గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి నాడు–నేడు పథకం ద్వారా నూతన భవనాలు మంజూరయ్యాయి. దీంతో నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భవనాల్లేని కేంద్రాలకు ప్రభుత్వం కొత్తవి మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ టి.లక్ష్మణరావు, అంగన్‌వాడీ కార్యకర్త డి.సంతోషికుమారి, వార్డు మెంబరు టి.లక్ష్మణరావు, వలంటీరు టి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పోతయ్యవలసలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని పోతయ్యవలస పంచాయతీ సర్పంచ్ కొంపెల్ల అప్పన్న అన్నారు. గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. లావేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ జోత్స్న రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. ఇంటివద్దకే వచ్చి వైద్యాన్ని అందించనున్నామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత, ఏఎన్ఎం ఎ.సుజాత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ



కొత్తూరు: మాట్లాడుతున్న సర్పంచ్ ధర్మారావు

ఎల్.ఎన్.పేట: తురకపేట గ్రామ సచివాలయంలో బుధవారం ఈ–క్రాప్ నమోదుకు సంబంధించి సర్పంచ్ మొదవలస యోగీశ్వరి అధ్యక్షతన సామాజిక తనిఖీ నిర్వహించారు. సచివాలయం పరిధిలోని దబ్బపాడు, తురకపేట, కృష్ణాపురం, సుమంతాపురం రెవెన్యూ గ్రామాల రైతుల ఈ–క్రాప్ నమోదు వివరాలను వీఆర్వో జోగినాయుడు, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు ఎన్.చాందిని రైతులకు చదివి వినిపించారు. ఆయా గ్రామాలకు సంబంధించిన ఈ–క్రాప్ నమోదు జాబితాలను సచివాలయం వద్ద నోటీసు బోర్డులో ప్రదర్శనగా ఉంచారు. నమోదు విషయంలో తప్పులు ఉన్న, ఇప్పటి వరకు నమోదు కాని రైతులు ఉన్నా వారి వివరాలను సరిచేసుకునేందుకు ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పల్లి సంజీవ్, చింతాడ అప్పలనాయుడు, కంచరాన సరోజిని పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: మండలంలోని 27 గ్రామ సచివాలయాల్లో ఈ–క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీలను ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులు, సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతుల పేర్లను చదివి వినిపించారు. జాబితాల్లో పేర్లు లేకపోతే తెలియజేయాలని అధికారులు సూచించారు. మెట్టూరు బిట్–2 సర్పంచ్ యర్లంకి ధర్మారావు, వ్యవసాయ సహాయకులు సుగ్గు శ్రీధర్, వీఆర్వో బాలకృష్ణ పాల్గొన్నారు.

బూర్జలో..

బూర్జ: ఈక్రాప్ నమోదుపై మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో వ్యవసాయశాఖాధికారి వి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. అప్పలపేట, కొల్లివలస, తోటవాడ, అల్లెన, కాలపర్తి, వైకుంఠపురం, చీడివలస పంచాయతీల పరిధిలో జరిగిన సభల్లో ముసాయిదా జాబితాలను సిబ్బంది చదివి వినిపించారు. చీడివలస రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ బూరి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో వీఏఏ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదుతో ప్రయోజనాలు

జలుమూరు: ఈ–క్రాప్ నమోదుతో రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ అన్నారు. అందవరం రైతు భరోసా కేంద్రం ఆవరణలో బుధవారం నిర్వహించిన ఈక్రాప్ సామాజిక తనిఖీ గ్రామ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సామాజిక తనిఖీ కోసం సచివాలయాలలో ప్రదర్శించిన జాబితాలలో పంట రకం, నీటి సదుపాయం, రైతు పేరు మార్పు తదితర సమస్యలుంటే గురువారం సాయంత్రంలోగా సవరించుకోవచ్చునన్నారు. వ్యవసాయశాఖ నరసన్నపేట ఏడీ రవీంద్ర భారతి, వ్యవసాయాధికారి సురేష్, రేగాన శ్యామ సుందరరావు, సవలాపురపు ఆదిబాబు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న శివానందమూర్తి

సరుబుజ్జిలి: ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని వైస్ ఎంపీపీ జీవీ శివానందమూర్తి అన్నారు. జాతీయ సమగ్ర అవగాహన కార్యక్రమంలో భాగంగా సింధువాడ సచివాలయం ఆవరణలో ఇండియన్ బ్యాంకు (షళంత్రి) ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు లావాదేవీల సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఆధార్, పిన్, ఖాతా నంబర్లు ఇవ్వవద్దని, సురక్షిత బ్యాంకింగ్ విధానం గురించి తెలుసుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచ్ గోవిందు కామేశ్వరి, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నివేదికలివ్వండి: ఆర్డీవో శాంతి



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శాంతి

పొందూరు: దళ్లిపేట గ్రామంలోని కొండపోరంబోకు స్థలంలో ఎంజాయ్‌మెంట్ పూర్తిచేసి త్వరగా నివేదికలను అందజేయాలని శ్రీకాకుళం ఆర్డీవో బి.శాంతి రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. సర్వేనంబర్–1లో ఆక్రమణలు జరిగాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు బడి రఘురాంరెడ్డి జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆర్డీవో కొండపోరంబోకు స్థలంలో విచారణ చేపట్టారు. ఎంతమంది రైతులకు పట్టాలు ఇచ్చారు, ఎవరెవరూ సాగులో ఉన్నారు, తదితర వివరాలను అందజేయాలని ఆదేశించారు. గొర్రెలు, మేకలు మేతకు రాకుండా అడ్డుకుంటే వారి కేసులు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణపతి, సర్వేయర్ పాత్రో, ఆర్ఐ ఈశ్వరరావు, వీఆర్వో సాయి ఉన్నారు.

బకాయిలు చెల్లించాలి



బకాయిదారులతో మాట్లాడుతున్న ఈవో రాధాకృష్ణ

శ్రీకాకళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో ఉన్న ఏకాంబరేశ్వర స్వామి దేవస్థానం స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినవారు వారం రోజుల్లోగా బకాయి అద్దెలు చెల్లించాలని హెచ్చరించినట్లు ఆలయ ఈవో వి.రాధాకృష్ణ బుధవారం తెలిపారు. చెల్లించకపోతే నిర్మాణాలు తొలగిస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్ర కార్యదర్శిగా రమణమూర్తి



నియామకపత్రం అందుకుంటున్న రమణమూర్తి

శ్రీకాకుళం అర్బన్: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శిగా పైడి రమణమూర్తి నియామకమయ్యారు. ఆయనకు జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాడాన దేవభూషణరావు నియామక పత్రాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ రవీంద్ర కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాడాన దేవభూషణరావులకు రమణమూర్తి ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి అంబులం పూజ



అంబులం పూజలో అయ్యప్పస్వాములు

జి.సిగడాం: దవళపేట గ్రామంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి అంబులం పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పేడాడ స్వాతినాయుడు దంపతుల ఆర్థిక సాయంతో సుమారు 300 మంది అయ్యప్పస్వాములు పూజల్లో పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై సమీక్ష

జలుమూరు: ఈ నెల ఏడో తేదీలోగా పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తహసీల్దార్ బి.సత్యం అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో పట్టుభద్రుల ఓటర్ల నమోదుపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో జీవీ రవికుమార్, మండల పంచాయతీ విస్తరణాధికారి ఈశ్వరరావు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: సంతసీతారాంపురం గ్రామంలో కింజరాపు ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులతో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం కొనసాగుతోంది. దీనిలో భాగంగా బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. వరిలో విత్తనం కట్టుకోవటం, కొబ్బరిలో కొమ్ముపురుగు, ఎర్రముక్కు పురుగు, తెల్లదోమ నివారణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమదాలవలస కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. వరిలో విత్తనం కట్టుకునే పద్ధతి, తడి,పొడి విత్తన శుద్ధి ప్రక్రియను వివరించారు. ఉద్యానశాఖ అధికారి అనూష.. కొబ్బరిలో తెల్లదోమ ఆశించడం ద్వారా కలుగు నష్టాలు, వాటిని నివారించే చర్యలను తెలియజేశారు. ప్రొఫెసర్ డాక్టర్ దేవికారాణి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతుల వినతి



అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జి.సిగడాం: తమకు న్యాయం చేయాలని సేతుభీమవరం గ్రామస్తులు, రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణలను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న సుమారు 650 ఎకరాల ఇనాం భూములను ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని.. వాటికి పూర్తిస్థాయిలో హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సేతుభీమవరం సర్పంచ్ తొత్తడి రామారావు, ఉప సర్పంచ్ నాగవరపు సాయి, పైల అదినారాయణ, రమణ, రాము, శ్రీనివాసరావు కోరారు. ఇనాం భూములపై ఆధారపడి సుమారు మూడు వందల కుటుంబాలు జీవిస్తున్నాయని వెల్లడించారు. అయితే భూములు సాగు చేసినా పాసు పుస్తకాల్లేక, ఆన్‌లైన్‌లో ఒన్–బి రాకపోవడంలో బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయడం లేదన్నారు. దీనిపై తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు మాట్లాడుతూ.. రైతులంతా ఐక్యమత్యంతో ఉంటే భూ సమస్యను పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాము, వీఆర్వో పొట్నూరు జగన్‌మోహన్, పంచాయతీ కార్యదర్శి హరిబాబు ఉన్నారు.

అందరికీ ఉపాధి కల్పించాలి



సభలో మాట్లాడుతున్న వెంకటరమణ

జి.సిగడాం: జాబ్‌కార్డు కలిగి ఉన్నవారందరికీ ఉపాధి పనులు కల్పించాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. వెలగాడ గ్రామంలో సర్పంచ్ బొల్లా లక్ష్మీభవాని అధ్యక్షతన బుధవారం ఉపాధిహామీ పథకం కార్యాచరణ ప్రణాళికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేతనదారులకు పని కల్పించడంతోపాటు వేతనం గిట్టుబాటయ్యేలా చూడాలన్నారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో చోళ్ల సత్యన్నారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, పంచాయతీ కార్యదర్శి చేబ్రోలు సురేష్‌కుమార్, ఉపసర్పంచ్ గొలుసుపూడి నారాయణరావు, నాయకులు బొల్లా జనార్దనరావు, రమణ, లక్ష్మణరావు, వెంకటరమణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాడిపశువుల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతూ జగన్నాథం

రణస్థలం: పాడిపశువుల అభివృద్ధిపై రైతులు దృష్టి సారించాలని, కృత్రిమ గర్భాధారణపై అవగాహన కలిగి ఉండాలని పశు సంవర్థకశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎం.జగన్నాథం అన్నారు. మండల కేంద్రంలోని పశుసంవర్థకశాఖ కార్యాలయంలో పశువులకు కృత్రిమ గర్భధారణలో భాగంగా ఆడదూడల సంతానోత్పత్తి పెంపుందించేందుకు రైతులు చేపట్టాల్సిన చర్యలపై లావేరు, రణస్థలం మండల పశుసంవర్థకశాఖ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెయ్య దూడల ఉత్పత్తి పథకంలో భాగంగా పాల దిగుబడి పెంచేందుకు పెయ్య దూడలు పుట్టించి రైతన్నకు ఆర్థికాభివృద్ధి కల్పించాలనే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఆడదూడల పుట్టించేందుకు లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా మేలు జాతి పెయ్య దూడలను ఎక్కువ ఉత్పత్తి చేయడం తద్వారా పాల దిగుబడి పెంపొందించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రణస్థలం ఏడీ బీహెచ్ దుర్గారావు, పాడి రైతులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ప్రవల్లిక తండ్రికి రూ.50 వేల నగదు అందిస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): లావేరు మండలం బెజ్జిపురం గ్రామానికి చెందిన రాపాకి ప్రవల్లిక కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. దీంతో ఆమె చికిత్స నిమిత్తం జిల్లా పద్మశాలి సంఘం నాయకులు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని ఆమె తండ్రికి బుధవారం అందించారు. నగరంలోని వర్జిన్‌రాక్స్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరింతమంది దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పసగాడ రామకృష్ణ, వై.శ్రీనివాసులు, కిరణకుమార్, ఇ.పద్మారావు, నారాయణరావు, కాపవరపు సీజు, జనార్దనరావు, శ్రీనివాస్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలరావు

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచివచ్చిన వినతలు తక్షణమే పరిష్కారం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపీడీవో ఎస్. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల పెంట సచివాలయం పరిధిలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నిర్వహించిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలువురు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారన్నారు. కాలువలపై ఆక్రమణలు తొలిగించాలని, ప్రతి వీధిలో సీసీ రోడ్డు వేయాలని గ్రామస్తుల నుంచి వినతలు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో పనులకు శ్రీకారం చేపట్టాలన్నారు. రైతులకు సకాలంలో ఆన్‌లైన్ ద్వారా భూ హక్కు పత్రాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఏఈఈలు శ్రీవల్లి, బగాది భాగ్యలక్ష్మి, సర్వేయర్లు కృష్ణారావు, ఈశ్వరరావు, సర్పంచ్ అక్కలనాయుడు, పంచాయతీ కార్యదర్శి పొట్నూరు సురేష్‌కుమార్, వీఆర్వో వేణుగోపాలరావు ఉన్నారు

విద్యుత్ సిబ్బంది తీరుపై సభ్యుల ఆగ్రహం

- మెళియాపుట్టి మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరమ్మ

మెళియాపుట్టి: విద్యుత్‌శాఖ సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని పలువురు సభ్యులు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు వివిధ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ స్థాయిలో జరిగే సమావేశాలకు సచివాలయ సిబ్బంది సక్రమంగా హాజరు కావడంలేదన్నారు. గత సమావేశంలో ఉన్న సమస్యలు కొలిక్కిరాకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. పట్టుపురం డీడీవో సచివాలయంలో అందుబాటులో ఉండటం లేదని శేఖరాపురం సర్పంచ్ గణేష్ ప్రధాన్ అన్నారు. చాపర సర్పంచ్ రామారావు మాట్లాడుతూ.. గ్రామంలో 250 స్తంభాలకు వీధిదీపాలు లేవని..ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. స్తంభం కూడా ఎక్కడం రానివారు విద్యుత్ శాఖలో పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపద్మాపురం గ్రామంలోని పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని చెప్పినా పట్టించుకోలేదని స్థానిక ప్రజాప్రతినిధి అన్నారు. దీనికి విద్యుత్ శాఖ ఏఈ అప్పలనాయుడు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, ఎంపీడీవో చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని, ఏవో దానకర్ణుడు, ఎంఈవో దేవేంద్రరావు మండల నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు భాస్కరదాస్, వైస్ ఎంపీపీలు, ఆదినాయుడు, ధనలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, పాల్గొన్నారు.

నల్లజర్ల స్టేషన్ రైటర్, ఏఎస్ఐ సస్పెన్షన్

కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల పోలీసుస్టేషన్‌లో ఓ పోక్సో కేసు విషయంలో లంచం తీసుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో స్టేషన్ రైటర్ (హెడ్ కానిస్టేబుల్) కె.శ్రీనివాస్, ఏఎస్ఐ ఎం.ఆదినారాయణ సస్పెండయ్యారు. ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్పీ బి.శ్రీనాథ తెలిపారు. కేసు మాఫీ చేస్తామని నిందితుడి సోదరుడి నుంచి స్టేషన్ రైటర్ రూ.5.50లక్షలు లంచం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. 'కేసు మాఫీ చేస్తామని లంచం తీసుకున్న రైటర్' శీర్షికతో సాక్షిలో ఇటీవల వార్త ప్రచురితమైంది. గత నెల 19న పోతవరం గ్రామానికి చెందిన కలిదిండి దేవి కుమార్ అనే వ్యక్తి మైనర్ గిరిజన యువతిని లోబరుచుకున్నట్లు కేసు నమోదైంది. అదే నెల 22న నిందితుడ్ని అరెస్ట్ చేశారు. ఈ కేసు మాఫీ చేయిస్తానని చెప్పి తన వద్ద నుంచి రూ.5.50 లక్షలు తీసుకున్నట్లు నిందితుడి సోదరుడు శ్రీను ఆరోపించారు. పైగా తన సోదరుడ్ని అరెస్ట్ చేసిన రోజు స్టేషన్ ఖర్చుల నిమిత్తం రూ.5వేలు, తాడేపల్లి గూడెంలో ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షల కోసం రూ.2వేలు తీసుకున్నట్లు ఆరోపించారు. అద్దెకారులో నిందితుడ్ని కోర్టుకు తరలించడం, భోజనం, టిఫెన్ వంటి ఖర్చులను నిందితుడి సోదరుడి నుంచి రాబట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై విచారణ నివేదిక తీసుకున్న ఉన్నతాధికారులు వారిని సస్పెండ్ చేశారు.

మృత్యుపాశం

▶ మొదటి పేజీ తరువాయి

బుధవారం ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, అధికారులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. దర్గా హొన్నూర్ గ్రామానికి చెందిన కమ్మూరి సుబ్బన్న అనే రైతు ఊరికి సమీపంలోని తన పొలంలో ఆముదం పంట సాగు చేశాడు. పంట దిగుబడిని తీసేందుకు బుధవారం ఉదయం 8.30 గంటలకు సొంత ట్రాక్టరులో గ్రామానికే చెందిన 14 మంది కూలీలను తీసుకుని వెళ్లాడు. వీరిలో ఎనిమిది మంది మహిళలు.. ఆరుగురు పురుషులు ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పని పూర్తయ్యింది. అదే సమయంలో వర్షం కూడా మొదలైంది. అయినా తిరుగు పయనమయ్యేందుకు సిద్ధమయ్యారు. కూలీలను ఎక్కించుకుని, ట్రాక్టర్‌ను రివర్స్ చేస్తుండగా.. పైనున్న 11 కేవీ విద్యుత్ తీగ షార్ట్‌సర్క్యూట్ కారణంగా తెగి ట్రాక్టరుపై పడింది. దీంతో వన్నక్క (52), రత్నమ్మ (40) అనే అత్తాకోడళ్లతో పాటు శంకరమ్మ (34), పార్వతి (48) అక్కడికక్కడే మృతి చెందారు. ముగ్గురు మహిళా, ఇద్దరు పురుష కూలీలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని విజయనగర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)కు తరలించారు. వీరిలో సుంకమ్మ అనే మహిళా కూలీ పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పారు. ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తున్న రైతు సుబ్బన్న, ఐదుగురు కూలీలు సురక్షితంగా బయటపడ్డారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప, కళ్యాణదుర్గం ఆర్డీఓ నిశాంత్ కుమార్ తదితరులు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి బళ్లారి ఆస్పత్రికి వెళ్లి మృతుల, క్షతగాత్రుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాద విషయాన్ని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

'కండక్టర్' తెగడం వల్లే ప్రమాదం

ఇన్సులేటర్ ఫ్లాష్ అవ్వడంతో కండక్టర్ తెగడం వల్లనే ఈ ప్రమాదం సంభవించినట్లు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) సీఎండీ కే సంతోషరావు తెలిపారు. ఈ సంఘటనకు బాధ్యులుగా భావిస్తూ నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఘటనపై విచారణకు ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి చీఫ్ జనరల్ మేనేజర్ (పి-ఎంఎం) డి.వి.చలపతి నేతృత్వంలో చీఫ్ జనరల్ మేనేజర్ (ఓ-యం) కె. గురవయ్య, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ (అనంతపురం) యం. విజయ భాస్కర్ రెడ్డిలతో కమిటీని నియమించామని చెప్పారు. ఈ కమిటీని హుటాహుటిన సంఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లాల్సిందిగా ఆదేశించామన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాథమిక సమాచారం ఆధారంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (కళ్యాణ దుర్గం) ఎస్.మల్లికార్జున రావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (బొమ్మనహాళ్) ఎం.కె. లక్ష్మీరెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ప్రొటెక్షన్) హెచ్. హమీదుల్లా బేగ్, లైన్‌మెన్ (దర్గా హొన్నూర్) కె.బసవ రాజులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశామని సీఎండీ తెలిపారు. అనంతపురం ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.నాగరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్స్/రాయదుర్గం) శేషాద్రి శేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (యం-పి/అనంతపురం) కె. రమేష్‌ల నుంచి వివరణ కోరుతూ మెమో జారీ చేశామన్నారు.

సీఎం జగన్ దిగ్భ్రాంతి

దర్గా హొన్నూరులో విద్యుదాఘాతం ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యుదాఘాతంతో మృతి చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. (విద్యుత్ శాఖ ద్వారా రూ.5 లక్షలు, సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.5 లక్షలు) బాధిత కుటుంబాలకు తోడుగా నిలవాలని అధికారులను ఆదేశించారు. కాగా, మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అనంతపురం జిల్లా కలెక్టర్‌కు, ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఆదేశాలిచ్చామన్నారు.

మునుగోడు రె'ఢీ'!

- నేడే ఉప ఎన్నిక
- బరిలో మొత్తం 47 మంది అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న మునుగోడు ఉప ఎన్నికకు అంతా రె'ఢీ' అయ్యింది. ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సిబ్బంది పోలింగ్ సామాగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. 298 పోలింగ్ కేంద్రాల్లో 2,41,855 మంది ఓటర్లు ఉన్నారు. మూడు ప్రధాన పార్టీలు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవడంతో రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన ఉప ఎన్నికల కంటే మునుగోడు ఉప ఎన్నిక అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాన పార్టీలతోపాటు గుర్తింపుపొందిన పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు కలిపి మొత్తం 47 మంది ఉప ఎన్నిక బరిలో ఉన్నారు. ప్రధానంగా టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీజేపీ, టీఆర్ఎస్ ప్రచారంలో పోటాపోటీగా తలపడగా, కాంగ్రెస్ కూడా తామేం తక్కువ కాదన్నట్లుగా నిర్వహించింది. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామంటూ టీఆర్ఎస్, ప్రభుత్వం నియోజకవర్గం పట్ల వివక్ష చూపుతోందని బీజేపీ, రెండు పార్టీలదీ మోసపూరిత వైఖరేనని కాంగ్రెస్ పెద్ద ఎత్తున ప్రచారాన్ని కొనసాగించాయి. మూడు పార్టీల నేతలు నియోజకవర్గంలోనే మకాం వేసి మరీ ప్రచారం నిర్వహించారు. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు తమ ప్రణాళికలు అమలు చేశారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీ.. కార్పొరేషన్ల చైర్మన్లు నియోజకవర్గంలో మకాం వేశారు. బీజేపీ తరఫున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు తదితరులు నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిం చారు. కాంగ్రెస్ పార్టీ తరఫున టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాసనసభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, సీతక్క, శ్రీధర్‌బాబు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. బీఎస్పీ ఇతర గుర్తింపు పొందిన పార్టీలు కూడా ప్రచారం చేశాయి. ఈ ఎన్నికలపై రాష్ట్రంలో పెద్దమొత్తంలో బెట్టింగ్‌లు కాస్తుండటం గమనార్హం.

కేసీఆర్, మోదీ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు

రాహుల్ ధ్వజం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి లూటీ చేసిన ప్రజాధనాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇద్దరు ముగ్గురు కార్పొరేట్ మిత్రులకు కట్టబెడితే, తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులపై వస్తున్న కమీషన్లను సీఎం కేసీఆర్ తన కుటుంబసభ్యులకు పంచుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. కేంద్రంలో మోదీ ఎలా వ్యవహరిస్తున్నారో చూసి.. రాష్ట్రంలో కేసీఆర్ కూడా అదే తీరుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భారత్‌జోడో యాత్ర బుధవారం హైదరాబాద్ మహానగరంలో 27 కిలోమీటర్ల పాటు సాగింది. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లాలోని ముత్తంగి వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో రాహుల్ ప్రసంగిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అవినీతి సొమ్ముతో ఇద్దరు నేతలూ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాలలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చివేశారని విమర్శించారు. సీఎం కేసీఆర్ రాత్రి కాగానే ధరణి పోర్టల్ తెరచి భూములు ఎవరు అమ్మారు.. ఎవరు కొన్నారో చూస్తుంటారని రాహుల్ ఎద్దేవా చేశారు. ఉదయం లేవగానే ఏ ప్రాజెక్టు రీడిజైనింగ్ చేస్తే ఎక్కువ కమీషన్ వస్తుందోనని కేసీఆర్ లెక్కిస్తుంటారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పలు బిల్లులకు కేసీఆర్ మద్దతు ఇచ్చారని ఆయన విమర్శించారు.

11న విశాఖకు ప్రధాని మోదీ రాక

- రెండు రోజులపాటు పర్యటన
- అభివృద్ధి పనులకు శ్రీకారం.. బహిరంగ సభలో ప్రసంగం
- ఏర్పాట్లను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి


మాట్లాడుతున్న వి.విజయసాయిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట (విశాఖ దక్షిణ): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖలో పర్యటించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి చెప్పారు. ప్రధాని బహిరంగసభ కోసం ఎంపిక చేసిన ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌ను కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీసు కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, వీసీ ప్రసాదరెడ్డితో కలిసి విజయసాయిరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని కార్యక్రమాలన్నీ పీఎంవో ఖరారు చేసిందని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. ఇది రాజకీయ పార్టీలకు సంబంధించిన కార్యక్రమం కాదని స్పష్టం చేశారు. ప్రధాని 11న విశాఖ చేరుకుని రాత్రి ఇక్కడే బస చేస్తారని, 12న ఉదయం బహిరంగ సభలో మాట్లాడతారని తెలిపారు. రైల్వే జోన్‌పై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఎంపీ బదులిస్తూ.. దానిపై ఇప్పటికే రైల్వే మంత్రి స్పష్టమైన సమాచారం ఇచ్చారని గుర్తు చేశారు.

రాజకీయ విమర్శలొద్దు

ప్రధాని మోదీ రాకపై రాజకీయ విమర్శలు వద్దని.. పార్టీలకు అతీతంగా ఘనంగా స్వాగతం పలకాలని కోరారు. ప్రధాని పర్యటన పార్టీలు, రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న కార్యక్రమమని చెప్పారు. ఈ సందర్భంగా రూ.12 వేల కోట్ల విలువైన కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం అంతా సంతోషించాల్సిన విషయమన్నారు. ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనతో పాటు పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాస్, మరికొందరితో కమిటీని నియమించారని తెలిపారు. బహిరంగసభ వేదికపై ఎవరెవరు ఉంటారన్న విషయాన్ని పీఎంవో, ఎస్పీజీ అధికారులే నిర్ణయిస్తాయని చెప్పారు. ఎస్పీజీ అనుమతిస్తే ప్రధాని వచ్చేమార్గంలో విద్యార్థినీ, విద్యార్థులు జాతీయ జెండాలతో అభివాదం చేస్తూ స్వాగతం పలుకుతారని చెప్పారు. విశాఖ కార్యనిర్వాహక రాజధాని కావడం తథ్యమని, దానిని ఎవరూ ఆపలేరని ఆయన పునరుద్ఘాటించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు తమ పార్టీ పూర్తి వ్యతిరేకమన్నారు. వైఎస్సార్‌సీపీకి రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమన్నారు. బీజేపీ అగ్రనాయకత్వానికి వైఎస్సార్‌సీపీ సన్నిహితంగా ఉందని తెలియజెప్పడానికే విశాఖలో ప్రధాని పర్యటనను ఖరారుచేశారన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కోర్టు తీర్పు అనంతరం భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన జరుగుతుందని వెల్లడించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస్, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు పాల్గొన్నారు.

రూ.10,472 కోట్ల పనులకు శ్రీకారం

ఈ నెల 12న రూ.10,472 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ, రాయపూర్-విశాఖపట్నం 6 లేన్ల రహదారి, కాన్వెంట్ జంక్షన్-షీలానగర్ పోర్టు రోడ్డు అభివృద్ధి, విశాఖ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, గెయిల్‌కు సంబంధించి శ్రీకాకుళం-అంగుళ్ పైప్‌లైన్ ఏర్పాటు, నరసన్నపేట-ఇచ్ఛాపురం రోడ్డు అభివృద్ధి, ఓఎన్‌జీసీ ఆఫ్‌షోర్ కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని చెప్పారు.

మిశ్రధాతువులపై దృష్టిపెట్టాలి

రక్షణమంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రక్షణ, వైమానిక రంగాల్లో కీలకంగా మారుతున్న మిశ్రధాతువులపై శాస్త్రవేత్తలు తమ దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరముందని రక్షణమంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి స్పష్టం చేశారు. క్షిపణి, వైమానిక వ్యవస్థల్లో బరువును తగ్గించడం కీలకమైన విషయం కాబట్టి.. ఆ పని చేయగల మిశ్రధాతువులను అభివృద్ధి చేసేందుకు పరిశోధన సంస్థలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మిశ్రధాతువుల తయారీ, పరిశోధనల రంగాల్లోని తాజా పరిణామాలను చర్చించే లక్ష్యంతో మంగళవారం మొదలైన 'ఇన్‌కామ్ -17' సదస్సు ముఖ్యఅతిథిగా వీడియో ద్వారా సతీశ్ రెడ్డి మాట్లాడుతూ...రక్షణవ్యవస్థ శక్తి సామర్థ్యాల విషయంలో రాజీ పడకుండానే కొత్త మిశ్రధాతువుల అభివృద్ధి చేయాలని కోరారు. కొత్త మిశ్రధాతువులు పర్యావరణ అనుకూలంగానూ ఉండేలా చూసుకోవాలని సూచించారు.

అందరికీ ముఖ ఆధారిత హాజరు

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి చేరిన పరికరాలు
- 222 మందికి వర్తింపు
- మెరుగుపడనున్న వైద్యసేవలు


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి సరఫరా అయిన ఫేషియల్ బయోమెట్రిక్ పరికరం

విజయనగరం ఫోర్ట్: అన్నిరంగాల్లోనూ పారదర్శకతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం... వైద్య సిబ్బంది సమయానికి హాజరై రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఉద్యోగులందరికీ బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేసింది. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రితో పాటు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వేలిముద్ర ఆధారిత బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తున్నారు. అయితే, కొందరు వైద్య ఉద్యోగులు రబ్బరుతో తయారు చేసిన వేలితో బయోమెట్రిక్ వేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఈ విధానాన్ని మార్పు చేసి ఫేషియల్ (ముఖ ఆధారిత) బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఫేషియల్ బయోమెట్రిక్ పరికరాలను ఆస్పత్రులకు ప్రభుత్వం సరఫరా చేసింది. ముందుగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి మూడు ఫేషియల్ బయోమెట్రిక్ పరికరాలను సమకూర్చింది. వీటిని నాలుగైదు రోజుల్లో ఇన్‌స్టాల్ చేస్తామని, ఆస్పత్రిలో పనిచేస్తున్న 222 మంది వైద్య సిబ్బంది ముఖ ఆధారిత బయోమెట్రిక్ వేయాల్సిందేనని సర్వజన ఆస్పత్రి ఆర్ఎమ్ఓ డాక్టర్ భారతి తెలిపారు. త్వరలో పీహెచ్‌సీలు, బోధనాస్పత్రిలో ఈ విధానాన్ని అమలుచేస్తామని చెప్పారు.

పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు


విజయనగరంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ఆరోగ్యశ్రీ సేవలు ఇలా...

సంవత్సరం	శస్త్రచికిత్సలు	వెచ్చించిన నిధులు
2019	31,357	రూ.73.06 కోట్లు
2020	35,776	రూ. 84.69 కోట్లు
2021	62,508	రూ.123.59 కోట్లు
2022	19,556	రూ. 39.81 కోట్లు

- ప్రస్తుతం ఉన్న వ్యాధులతో పాటు మరిన్ని వ్యాధులకు ఉచిత వైద్యం
- మొత్తం 3,255 వ్యాధులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపు
- జిల్లాలో 7 లక్షల కుటుంబాలకు లబ్ధి

విజయనగరం ఫోర్ట్:

పేదలకు మరింత ఆరోగ్య భరోసా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం 3,255 వ్యాధులకు వైఎస్సార్ ఆరోగ్య పథకం కింద వైద్యసేవలు అందనున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం 1000 వ్యాధులకు మాత్రమే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స లభించేది. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత ఆ సంఖ్యను 2,446కు పెంచారు. తాజాగా 3,255 వ్యాధులను దీని పరిధిలోకి తెచ్చారు. మరోవైపు వైద్యం ఖర్చు వెయ్యి దాటితే చాలు ఆరోగ్యశ్రీని వర్తింపజేస్తున్నారు.

ప్రయోజనం ఇలా..

జిల్లాలో 33 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. ఇందులో ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు 18, ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రులు 15 ఉన్నాయి. ఆరోగ్యశ్రీ పథకం కింద ఏడు లక్షల కుటుంబాలకు ఆరోగ్య భరోసా కలగనుంది. జిల్లాలో అధికశాతం మంది పేద, మధ్య తరగతి ప్రజలే. వీరందరికీ ఆరోగ్యశ్రీ కార్డు ఉండడం వల్ల ఉచితంగా సేవలు అందనున్నాయి. మరోవైపు ఆరోగ్య ఆసరా కింద చికిత్స అనంతర ప్రభుత్వం భృతి అందిస్తోంది. కోలుకునేవరకు అండగా నిలుస్తోంది.

మరింత మేలు



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి కొత్తగా వ్యాధులు చేర్చడంవల్ల పేదలకు మరింత మేలు జరగనుంది. ఆరోగ్యశ్రీ పథకం వల్ల నిరుపేద, మధ్య తరగతి ప్రజలు ఉచితంగా వైద్యసేవలు పొందగలుగుతున్నారు. ఆరోగ్యశ్రీ ఒక మంచి పథకం.

– డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

ఉచిత వైద్యం



రోడ్డు ప్రమాదంలో నా ఎడమ కాలు విరిగింది. విజయనగరంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో చేరాను. ఆరోగ్యశ్రీ పథకం కింద ఆస్పత్రిలో చేరిన రెండు రోజుల్లో శస్త్రచికిత్స చేశారు. ఒక్క పైసా ఖర్చుకాకుండా ఆపరేషన్ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం నాలాంటి ఎంతో మందికి సంజీవనిలా మారింది.

– కె.నారాయణప్పుడు, ఎస్.ఎస్.ఆర్.పేట, గుర్ల మండలం

అమ్మలైపోతున్న అమ్మాయిలు



- బాల్య వివాహాలే కారణం
- ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌లోగా రిజిస్టర్ అయిన గర్భిణులు 14,827మంది
- 20 శాతం మంది టీనేజ్‌లో బాలింతలు

టీనేజ్‌లో తల్లులవడంతో సమస్యలు

- పిల్లలు బలహీనంగా పుడతారు
- మానసిక, శారీరక ఎదుగుదల ఉండదు
- వ్యాధినిరోధక శక్తి తగ్గిపోయి వ్యాధులు బారిన పడే ప్రమాదం
- బిడ్డ బరువు తక్కువగా పుడతాడు
- శిశువులు ఆకస్మాత్తుగా చనిపోయే ప్రమాదం
- పిల్లలను దక్కని సరైన సంరక్షణ

విజయనగరం ఫోర్ట్:

టీనేజ్ (యుక్తవయస్సు)లోనే యువతులు తల్లుల వుతున్నారు. తోటి పిల్లలతో ఆడిపాడాల్సిన వయస్సులో పిల్లలను సంరక్షించే బాధ్యత తీసుకుంటున్నారు. చదువుకోవాల్సిన వయస్సులో భర్త, పిల్లలకు సపర్యలు చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. అమ్మాయిలకు 18 ఏళ్లు నిండిన తర్వాత వివాహం జరగాల్సి ఉండగా ఆ వయస్సు వచ్చేనాటికే పిల్లల తల్లులువుతున్నారు. తక్కువ వయస్సులో తల్లులవడం వల్ల రక్తహీనత, నడుంనొప్పి, నీరసం, పనిపట్ల ఆసక్తి చూపించలేకపోవడం తదితర సమస్యల బారిన పడుతున్నారు. జిల్లాలో ఈఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు నాటికి గర్భిణులు 14,827 మంది రిజిస్టరయ్యారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు నాటికి 13,713 మంది ప్రసవించారు. వారిలో తొలికాన్పులో 9 వేల మంది ప్రసవించగా టీనేజ్ వారు 15నుంచి 20 శాతం వరకు ఉన్నారు. బాల్య వివాహం వల్ల చిరుప్రాయంలో గర్భం దాలుస్తున్న వారిలో కొంతమంది ప్రసవ సమయంలో ఇబ్బంది పడుతున్నారు. మరి కొంతమంది ప్రసవానంతరం కూడా ఇబ్బంది పడుతున్నారు.

వైద్య సిబ్బందితో అవగాహన

యుక్త వయస్సులో తల్లులవుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. దీనికోసం వైద్య సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఐసీడీఎస్, మెప్మా సహకారంతో ఆయా శాఖల్లో జరిగే సమావేశాలు, సదస్సుల్లో చిరుప్రాయంలో తల్లులైతే కలిగే అనర్థాల గురించి వివరిస్తున్నాం.

– డాక్టర్ ఎస్వీ. రమణకుమారి, డీఎంహెచ్ఓ


విశాఖ వెళ్లి పింఛన్ అందజేత


అప్పారావుకు పింఛన్ డబ్బులు అందజేస్తున్న వలంటీర్ గణపతి


నారాయణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కృష్ణవేణి

జామి/వేపాడ/కొత్తవలసరూరల్: ప్రతీ నెల 5వ తేదీలోగా లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆశయాన్ని వలంటీర్లు నెరవేర్చుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేస్తున్నారు. విశాఖపట్నంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న జామి మండలం జన్నివలస గ్రామానికి చెందిన దరిమిరెడ్డి అప్పారావుకు వలంటీర్ డోల గణపతి, వేపాడ మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన బందిల నారాయణమ్మకు వలంటీర్ ఇ.కృష్ణవేణి, కొత్తవలస మండలం దేవాడ గ్రామానికి చెందిన ముద్దియోగినికి వలంటీర్ గంతకోరు కృష్ణ బుధవారం పింఛన్లు అందజేశారు.

పంటల నిల్వకు 13 గొడౌన్ల నిర్మాణం



అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ అప్పారావు

వంగర: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను అనుసంధానం చేస్తూ సరుకుల నిల్వలకు సంబంధించి 13 గొడౌన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చీపురుపల్లి ఆర్డీఓ ఎం.అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, పీఏసీఎస్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. మల్టీపర్పస్ సెంటర్ల పేరుతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేస్తోందన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం, మినుము, పెసర, మొక్కజొన్న వంటి పంటలను నిల్వ చేసేందుకు వీలుగా వీటిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ గొడౌన్ నిర్మాణానికి 0.50 సెంట్లు భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు. పట్టభద్రుల ఓటు నమోదు, భూముల రీసర్వే, ఇతర అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, డీటీ బూరాడ సుందరరావు, పీఏసీఎస్ సీఈఓ పి.రాంబాబు, ఆర్ఐలు జామి మురళీ, రుంకాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేంద్రాల పనితీరు మెరుగుపడాలి

గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడాలని ఆర్డీఓ ఎం.అప్పారావు అన్నారు. వంగర అంగన్‌వాడీ-2 కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు.పౌష్టికాహార పంపిణీ వివరాలను కార్యకర్త వెంకటరత్నంను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందించాలని ఆదేశించారు.

రూ.3 కోట్లతో ఉపాధి పనుల ప్రణాళిక


గడిముడిదాం గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీఓ సాయిరాం

రాజాం సిటీ: ఉపాధిహామి పనుల్లో భాగంగా గ్రామాల్లో గుర్తించిన పనుల ప్రాప్తికి అంచనాలు తయారు చేశామని ఏపీఓ కె.సాయిరాం అన్నారు. మండలంలోని గడిముడిదాం, అంతకాపల్లి గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆయా గ్రామాల్లో రూ.3 కోట్లతో అంచనాలు పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందినట్లు చెప్పారు. వేతనదారులందరికీ పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.

స్లీప్ టూరిజమ్



నిద్రకు ప్రయాణం కట్టండి

తీర్థయాత్రలు తెలుసు. సరదా టూర్లు తెలుసు. స్నేహితులతో విహారాలు తెలుసు. కాని నిద్ర కోసమే టూరిజమ్ చేయడం నేటి ట్రెండ్. ఎక్కడికైనా వెళ్లి హాయిగా రెండు రోజులు నిద్ర పోవాలి అనుకునేవారు చేసేదే 'స్లీప్ టూరిజమ్'. అంతే కాదు ఇంట్లో నిద్ర పట్టని వారు నిద్ర లేమితో బాధ పడేవారుతమ రిసార్ట్‌లకు వచ్చి హాయిగా నిద్ర పోయేలా యోగా, ఆహారం, మసాజ్ వంటివి కూడా ఏర్పాటు చేస్తున్నారు నిర్వాహకులు. ఇండియాలో ఇప్పుడు ఇదే ట్రెండ్. మీకూ నిద్ర కావాలా? ప్రయాణం కట్టండి.

రచయిత్రి అబ్బూరి ఛాయా దేవి కథ ఒకటి ఉంటుంది. దాని పేరు 'సుఖాంతం'. అందులో 60 ఏళ్లకు చేరుకున్న ఒక గృహిణి తన బాల్యం నుంచి కంటి నిండా నిద్ర పోనివ్వని ఇంటి పనులు ఎన్ని చేసిందో, భార్యగా కోడలిగా తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ నిద్రకు ఎలా ముఖం వాచిందో తలుచుకుంటూ ఆఖరుకు మంచి నిద్ర కోసం గుప్పెడు నిద్ర మాత్రలు మింగుతుంది. ఆ కథకు చాలా పేరు వచ్చింది.

స్త్రీల నిద్రను ఇల్లు పట్టించుకోదు. వాళ్లు తెల్లారే లేవాలి. రాత్రి అందరూ నిద్ర పోయాక వంట గది సర్ది నిద్రకు ఉపక్రమించాలి. పగలు కాసేపు కునుకు తీద్దామన్నా పని మనిషి, పాలవాడు, పేపర్‌వాడు, అమేజాన్ నుంచి... స్విగ్గీనుంచి... అంటూ ఎవరో ఒకరు తలుపు కొడుతూనే ఉంటారు. స్త్రీలకు కంటి నిండా నిద్ర పోయే హక్కు లేదా?

అయితే కోవిడ్ వచ్చాక ప్రపంచ వ్యాప్తంతో పాటు భారతదేశంలో కూడా నిద్ర కరువు పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగాలలో భీతి, తెలియని ఆందోళన, పరుగు ఇవన్నీ చాలామందిని నిద్రకు దూరం చేశాయి. నీల్సన్ సంస్థ మన దేశంలోని 25 నగరాల్లో 5,600 మందిని సర్వే చేస్తే 93 శాతం మంది నిద్ర లేమితో బాధ పడుతున్నట్టు తెలిసింది. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు, ఇంటి సమస్యలు, భార్యాభర్తల్లో అనురాగం తగ్గిపోవడం, సౌకర్యమైన బెడ్‌రూమ్ లేకపోవడం, గుర్‌గుర్‌మంటూ తిరిగే ఫ్యాను, లేదా భార్యా/భర్త తీసే గురక, రోడ్డు మీద ట్రాఫిక్ సౌండు, అన్నీ బాగున్నా కొందరిలో వచ్చే 'నిద్రలేమి' సమస్య... ఇవన్నీ నిద్రకు దూరం చేస్తాయి. ఆ సమయంలో ఎక్కడికైనా పారిపోయి హాయిగా నిద్ర పోతేనో అనే ఆలోచన వస్తుంది. ఆ ఆలోచన ప్రపంచమంతా ఒకేసారి వచ్చింది. అందుకే ఇప్పుడు 'స్లీప్ టూరిజమ్' ట్రెండ్‌గా మారింది.

లండన్‌లో తొలి 'స్లీప్ హోటల్'... 2000 సంవత్సరంలో లండన్‌లో జెడ్‌వెల్ అనే హోటల్ 'సౌండ్‌ప్రూఫ్' గదులతో తనను తాను 'స్లీప్ హోటల్'గా ప్రమోట్ చేసుకుంది. ఆ తర్వాత పోర్చుగీసులో తొలి 'స్లీప్ స్పా హోటల్' అవిర్భవించింది. ఇప్పుడు అమెరికాలో హోటళ్లలో 'స్లీప్ స్వీట్‌రూమ్స్' ఏర్పాటవుతున్నాయి. ఇవన్నీ కేవలం నిద్ర కోసమే. గతంలో విహారాలు బాగా తిరిగి ఆ మూల ఈ మూల చూసి రావడానికి ఉద్దేశింపబడేవి. స్లీప్ ట్రావెల్స్ మాత్రం కేవలం ఒక చోటుకు వెళ్లి హాయిగా నిద్ర పోవడమే పనిగా పెట్టుకునేది. రిసార్టులు, హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు వీటి కోసం ఎలాగూ ఉన్నా భారతదేశంలో తమకు నచ్చిన చోటుకు వెళ్లి నిద్ర పోవడానికి 'క్యారవాన్'లు అద్దెకు దొరుకుతున్నాయి. అంటే వాటిని బుక్ చేసుకొని అలా విహారానికి వెళుతూ ఏ చెరువు ఒడ్డునో అడవి మధ్యనో ఆదమరిచి నిద్రపోవచ్చన్నమాట.

మంచి పరుపులు, మసాజ్‌లు... మన దేశంలో ముఖ్యమైన ఫైవ్‌స్టార్ హోటళ్లు, ఖరీదైన రిసార్టులు అన్నీ ఇప్పుడు స్లీప్ టూరిజమ్‌కు ఏర్పాట్లు చేశాయి. కొన్ని హోటళ్లు 'స్లీప్ డాక్టర్ల'తో సెషన్స్ కూడా నిర్వహిస్తున్నాయి. వాళ్లు గెస్ట్‌లతో మాట్లాడి వారి నిద్ర బాధకు విరుగుడు చెబుతారు. ఆయుర్వేద మసాజ్‌లు, గదిలో ఉండాల్సిన సువాసనలు, నిద్ర వచ్చేందుకు చేసే స్నానాలు, శాస్త్రీయమైన మంచి పరుపులు, అంతరాయం కలిగించని గదులు, నిద్రను కలిగించే ఆహారం... ఇవన్నీ ప్యాకేజ్‌లో భాగంగా ఇస్తున్నారు. ఇవాళ ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేస్తే ఎన్నో హోటళ్లు స్లీప్ ట్రావెల్ కోసం ఆహ్వానం పలుకుతున్నాయి.

మనిషికి కావలసింది ఆ రెండే

ఏ మనిషికైనా కావలసింది రెండు అవసరాలు. ఒకటి మంచి విశ్రాంతి. రెండు మంచి నిద్ర. ఆరోగ్యమే మహా భాగ్యం అన్నారు. మంచి నిద్ర వల్లే మంచి ఆరోగ్యం ఉంటుంది. నిద్ర పట్టకపోవడం కంటి నిండా నిద్ర లేదనే బాధ ఉండటం మంచిది కాదు. స్థలం మారిస్తే ఆరోగ్యం బాగుపడినట్టు స్థలం మారిస్తే మంచి నిద్ర పట్టొచ్చు. అంతే కాదు పోటీ ప్రపంచానికి దూరంగా ఒత్తిడి లేకుండా విశ్రాంతి కూడా తీసుకోవచ్చు.

కాబట్టి ఈ కొత్త ట్రెండ్‌కు స్వాగతం చెప్పండి. మీకు నిద్ర లేమి బాధ ఉంటే గనుక వెంటనే బ్యాగ్ సర్దుకోండి.

సైబర్ టాక్



5జీ మోసాలు

టెక్నాలజీ అభివృద్ధిలో భాగంగా కొన్నాళ్లుగా మనం దరం అధికంగా వింటున్న పేరు 5జీ. అంతే స్థాయిలో 5జీ పేరుతో మోసాలూ జరుగుతున్నాయి. టెక్నాలజీని అర్థం చేసుకోవడం, ఈ తరహా మోసాల బారిన పడకుండా ఉండటానికి మనం ఎంత అలెర్ట్‌గా ఉంటే, అంత సురక్షితంగా ఉండగలం.

5జీ నెట్‌వర్క్ ముందుగా ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నైలలో విడుదలవుతుంది. ఆ తర్వాత ఇతర నగరాల్లోనూ అందుబాటులో ఉంటుంది. నాన్ స్టాండ్‌అలోన్ నెట్‌వర్క్‌లను ఉపయోగించి ప్రారంభించడానికి అంటే, ఇప్పటికే ఉన్న 4జీ సాంకేతికతను ఉపయోగించి, ఆపై క్రమంగా స్టాండ్‌అలోన్ నెట్‌వర్క్ (5జీ) వైపు వెళతారు.

మెరుగైన కవరేజ్..

5జీలో తక్కువ ఫ్రీక్వెన్సీ, మెరుగైన కవరేజీ, లో స్పీడ్.. ఉంటుంది. ఇప్పటికే 5జీ ఫోన్లు ఉండి, 4జీ సిమ్ కార్డ్ ఉన్న సబ్‌స్క్రైబర్లు కొత్త 5జీ సిమ్ కార్డ్‌ల కోసం వెతకనవసరం లేదు, ఎందుకంటే టెక్నాలజీ ఆపరేటర్లు 4జీ నెట్‌వర్క్‌నే ఉపయోగిస్తున్నారు. అయితే టెలికాం ప్రొవైడర్లు స్టాండ్‌అలోన్ నెట్‌వర్క్‌కి అప్‌గ్రేడ్ చేసిన తర్వాత, ఆపై కస్టమర్లు కొత్త 5జీ సిమ్ కార్డ్‌లను తీసుకోవాల్సి ఉంటుంది.

మోసాలు జరిగే విధానం..

- 5జీ పేరుతో జరిగే వాటిలో సిమ్ స్వాప్ మోసాలు ప్రధానమైనవి. ఆన్‌లైన్ మోసగాళ్ళు తమను తాము ఈ నెట్‌వర్క్‌కి ఫోన్‌కంపెనీల పేర్లు చెప్పి, వాటికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పరిచయం చేసుకుంటున్నారు.
- సిమ్ కార్డ్‌లను 4జీ నుండి 5జీకి అప్‌డేట్ చేస్తామని చెబుతున్నారు. ఆ తర్వాత, వారు పంపిన మెసేజ్‌ల్లోని చిన్న లింక్‌పై క్లిక్ చేస్తే వచ్చిన ఓటీపీని సెండ్ చేయమని అడగవచ్చు. ధ్రువీకరణ తర్వాత, ఆపరేటర్ నిజమైన బాధితుడి సిమ్‌ను డియాక్టివేట్ చేస్తాడు. దీనికి బదులుగా కొత్త సిమ్ కార్డ్‌ను జారీ చేస్తాడు.
- టెలికాం వినియోగదారులను సిమ్ అప్‌గ్రేడ్ సాకుతో తమని తాము పరిచయం చేసుకుంటారు. సిమ్‌కార్డ్ మార్పిడి, ఆఫర్లతో వల వేయడం, పోర్టబిలిటీకి సంబంధించి ఓటీపీలు రాబట్టేలా చేస్తారు. మన వివరాలను అందించిన తర్వాత సిమ్ అప్‌గ్రేడ్‌కు బదులుగా బ్యాంక్ ఖాతా నుంచి నగదును మోసగాడు తన ఖాతాకు డెబిట్ అయ్యేలా చేస్తాడు. అందుకే, ఇలాంటివేవీ నమ్మకూడదు.

నెట్‌వర్క్ సామర్థ్యాలు

- 5జీ గరిష్ఠ డేటా 10 జీబీపీఎస్‌కి చేరుకుంటుంది. ఇండోర్, అవుట్‌డోర్ పరిసరాలలో ఈ రీచ్ ఎక్కువ ఉంటుంది.
- డేటా కనీసం 10 ఎమ్‌బీపీఎస్ ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో విస్తృత ఏరియా కవరేజ్ కోసం 100 ఎమ్‌బిపిఎస్, ఇండోర్‌లో 1 జీబీపీఎస్ వరకు ఉంటుంది.
- 5జీ ఉన్న కస్టమర్లు కార్లు, రైలులో ప్రయాణిస్తున్నప్పుడు వారి ఫోన్‌లలో 4జీ వీడియోను ఆటంకం లేకుండా చూడవచ్చు.
- కంప్యూటర్ గేమ్స్ (VR), ఆగ్మెంటెడ్ రియాలిటీ (AR) వంటివి మరింతగా అందుబాటులోకి వచ్చేస్తాయి. ఈ సాంకేతికత ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య, విపత్తుల సమయంలో సహాయం.. వంటి వాటితో సహా వివిధ రకాల పరిశ్రమలపైనా ప్రభావాన్ని చూపుతుంది.
- 5జీ అప్లికేషన్లతో విపత్తు ప్రభావిత ప్రాంతాలపై రిమోట్ నియంత్రణ, బహిరంగ ప్రదేశాల్లో ఇన్‌స్టాల్ చేయబడిన హెచ్‌డి కెమెరాల నుండి ప్రత్యక్ష 4k ఫీడ్... వంటివి సులభం అవుతాయి.. ఈ టెక్నాలజీ ప్రతి పనిలో మనుషుల పాత్రను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

భద్రత కోసం చిట్కాలు


- ఇప్పటికే ఉన్న 5జీ సేవలను ఉపయోగించడానికి మీ ప్రస్తుత 4జీ సిమ్ కార్డ్‌ని అప్‌డేట్ చేయాల్సిన అవసరం లేదు.
- ఫోన్ కాల్‌లో ఉన్నప్పుడు ఎటువంటి లావాదేవీలు చేయవద్దు.
- యాప్‌లను డౌన్‌లోడ్ చేయమని లేదా యాప్‌లు / ఖాతాలను అప్‌డేట్ చేయమని మిమ్మల్ని అభ్యర్థించే ఎలాంటి అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలను అందించవద్దు.
- ఎప్పుడూ, ఓటీపీని ఎవరితోనూ షేర్ చేయవద్దు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయవద్దు. అలా చేస్తే మన బ్యాంక్ ఖాతాల నుండి డబ్బు డెబిట్ అవుతుంది.
- చిన్న లింక్స్, సందేశాలను ధ్రువీకరించకుండా వాటిపై క్లిక్ చేయవద్దు.
- 5జీ పేరుతో ఎవరైనా మిమ్మల్ని మోసగిస్తే వెంటనే మీ స్థానిక సైబర్ క్రైమ్ పోలీసు అధికారులకు స్కామ్‌ను నివేదించండి.

httpr://www.cybercrime.gov.inలో ఫిర్యాదును నమోదు చేయండి లేదా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి డయల్ చేయండి.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

సినిమా



ఇప్పటికీ.. ఎప్పటికీ...

హన్సిక కల్యాణం ఖరారైంది. వ్యాపారవేత్త సోహైల్ కతురియాతో ఈ బ్యూటీ పెళ్లి కుదిరిందని వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అవి నిజమేనని బుధవారం హన్సిక షేర్ చేసిన ఫొటోలు స్పష్టం చేశాయి. ఈఫిల్ టవర్ సాక్షిగా 'మ్యారీ మీ' అంటూ సోహైల్ ప్రపోజ్ చేసిన ఫొటోలను షేర్ చేసి, 'ఇప్పటికీ.. ఎప్పటికీ' అని పేర్కొన్నారు హన్సిక. డిసెంబర్ 4న జైపూర్‌లో వీరి పెళ్లి జరగనుందని, 2 నుంచే మెహందీ, సంగీత్ తదితర పెళ్లి వేడుకలు ఆరంభమవుతాయని సమాచారం.

ప్రతి పదిహేను నిమిషాలకో మలుపు!

- మేర్లపాక గాంధీ



''లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' కథ హిలేరియస్‌గా ఉంటుంది. ట్రావెల్ బ్లాగర్స్ అయిన హీరో, హీరోయిన్ ట్రావెల్ వీడియోల చిత్రీకరణ సమయంలో ఎలాంటి ప్రమాదం ఎదుర్కొన్నారు? అనేది ఆసక్తిగా ఉంటుంది. మొదటి ఫ్రేమ్ నుంచి చివరి ఫ్రేమ్ వరకూ ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు'' అని మేర్లపాక గాంధీ అన్నారు. సంతోష్ శోభన్, ఫరియా అబ్దుల్లా జంటగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్'. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేర్లపాక గాంధీ మాట్లాడుతూ– ''ఒక యూట్యూబర్ కథ చేస్తే బావుంటుందనే ఆలోచన నుంచే 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' ఐడియా వచ్చింది. ట్రావెల్ బ్లాగర్ కష్టాలు, ప్రమాదాలు, సవాళ్లను ఈ సినిమాలో చూపించాం. ఈ కథలో ప్రతి పదిహేను నిమిషాలకు ఒక చేంజ్ ఓవర్, మలుపు ఉంటుంది. సిట్యువేషనల్ కామెడీ ప్రధాన ఆకర్షణగా ఉంటుంది. సంతోష్ శోభన్, ఫరియా అబ్దుల్లా ఆయా పాత్రలకు పర్ఫెక్ట్‌గా సరిపోయారు. 'వాల్తేరు వీరయ్య' టీజర్‌లో చిరంజీవిగారు చెప్పిన 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' డైలాగ్ మా సినిమాకి బాగా హైప్ తీసుకొచ్చింది'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''మా నాన్నగారు మేర్లపాక మురళిగారి కథతో ఓ సినిమా చేయాలనుంది. 'జవాన్' నిర్మాత కృష్ణగారు, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, యూవీ క్రియేషన్స్, నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్‌లో నా తర్వాతి చిత్రాలు ఉంటాయి'' అని చెప్పారు.



● అమలా పాల్

మెర్క్యురీ సూరి




● సత్యదేవ్

సత్యదేవ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఫుల్ బాటిల్'. ఈ చిత్రంలో మెర్క్యురీ సూరి పాత్రలో స్టయిలిష్‌గా కనిపించనున్నారు సత్యదేవ్. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఎస్‌డీ కంపెనీ, రామాంజనేయులు జవ్వాజి నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ విడుదలైంది. వినోద ప్రధానంగా సాగే ఈ చిత్రం షూటింగ్ ఇటీవల పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్న ఈ చిత్రానికి కెమెరా: సుజాత సిద్ధార్థ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నవీన్ రెడ్డి.

బాలీవుడ్‌కి స్పెషల్‌గా...

కథానాయిక అయిన పదేళ్లకు అమలా పాల్ ఇప్పుడు హిందీ తెరకు పరిచయం కానున్నారు. అది కూడా స్పెషల్‌గా... అంటే స్పెషల్ రోల్‌లో అన్నమాట. అజయ్ దేవగన్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న 'భోలా'లోనే ఆమె ప్రత్యేక పాత్ర చేయనున్నారు. కార్తీ హీరోగా నటించిన హిట్ తమిళ మూవీ 'ఖైదీ'కి 'భోలా' హిందీ రీమేక్. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రను టబు చేస్తున్నారు. తాజాగా అమలా పాల్‌ని ఎంపిక చేసిన విషయాన్ని చిత్రబృందం బుధవారం ప్రకటించింది. ఇప్పటికే కొంత భాగం చిత్రీకరణ పూర్తయింది. డిసెంబర్‌లో ఆరంభం కానున్న ఈ చిత్రం కొత్త షెడ్యూల్‌లో అమలా పాల్ పాల్గొంటారు.

మూడు కథలు... తగ్గేదే లే



● దివ్య పిళ్లై, నవీన్ చంద్ర, అనన్య రాజ్

''తగ్గేదే లే' చిత్రంలో మూడు స్టోరీలను అద్భుతంగా సెట్ చేశారు. లవ్, యాక్షన్, ప్రతీకారం.. ఇలా అన్నీ ఉన్న ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అని హీరో నవీన్ చంద్ర అన్నారు. 'దండు పాళ్యం' ఫేమ్ శ్రీనివాస్ రాజు దర్శకత్వంలో నవీన్ చంద్ర హీరోగా నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'తగ్గేదే లే'. మకరంద్ దేశ్ పాండే, పూజా గాంధీ, దివ్య పిళ్లై, అనన్య రాజ్ కీలక పాత్రల్లో నటించారు. ప్రేమ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకలో శ్రీనివాస్ రాజ్ మాట్లాడుతూ–''కరోనా రెండో వేవ్‌లో నా తండ్రిని కోల్పోయాను. ఆ దశలోనూ నాకు సపోర్ట్‌గా నిలిచిన యూనిట్‌కి థ్యాంక్స్'' అన్నారు. 'వాస్తవ ఘటనలతో ఈ సినిమా తెరకెక్కించాం'' అన్నారు ప్రేమ్ కుమార్. ''ప్రేమ్, అఖిల్, సుబ్బారెడ్డిగారు మంచి చిత్రాలు తీద్దామని వచ్చారు. 'తగ్గేదే లే' ఆడితే ఈ బ్యానర్ ద్వారా అందరికీ పని దొరుకుతుంది'' అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, నటుడు రాజా రవీంద్ర.

అది సవాల్ అనిపించింది - జయతీర్థ



''బనారస్' కేవలం టైమ్ ట్రావెల్ సినిమా కాదు. ప్రేమకథ, థ్రిల్లర్, పునర్జన్మ అంశాలు కూడా ఉంటాయి. స్క్రీన్‌ప్లే చాలా వైవిధ్యంగా ఉంటుంది'' అని డైరెక్టర్ జయతీర్థ ('బెల్ బాటమ్' ఫేమ్) అన్నారు. జైద్ ఖాన్, సోనాల్ మోంటెరో జంటగా నటించిన చిత్రం 'బనారస్'. తిలకరాజ్ బల్లాల్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న రిలీజవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో 'నాంది' సతీష్ వర్మ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా జయతీర్థ మాట్లాడుతూ– ''నేను ఇప్పటివరకూ ఏడు సినిమాలు చేస్తే నాలుగు కొత్తవారితోనే చేశాను. నేను యాక్టింగ్ టీచర్‌ని. ఇప్పటివరకూ నేను శిక్షణ ఇచ్చి, లాంచ్ చేసిన నటీనటులు మంచి స్థాయిలో ఉన్నారు. జైద్ ఖాన్ కూడా గొప్ప స్థాయికి వెళ్తాడు. ఈ చిత్రం 90 శాతం షూటింగ్ బనారస్‌లోనే చేశాం. 2, 3 డిగ్రీల ఉష్ణోగ్రతలో షూట్ చేయడం సవాల్‌గా అనిపించింది. ప్రస్తుతం 'కైవ'అనే సినిమా చేస్తున్నాను.. జనవరిలో 'బెల్ బాటమ్ 2' మొదలవుతుంది'' అన్నారు.


త్వరలో ఆ అవకాశం ఉంది

- జాన్వీ కపూర్



''దక్షిణాది ప్రేక్షకులు మా అమ్మకి (శ్రీదేవి), నాన్నకి (బోనీ కపూర్) ఎంత ప్రేమను ఇచ్చారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. నేను సౌత్‌లో సినిమా చేయాలనుకుంటున్నాను.. త్వరలోనే చేసే అవకాశం ఉంది'' అని జాన్వీ కపూర్ అన్నారు. మాతుకుట్టి గ్జేవియర్ దర్శకత్వంలో జాన్వీ కపూర్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'మిలి'. బోనీ కపూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జాన్వీ కపూర్ మాట్లాడుతూ– ''గ్జేవియర్‌గారు ఈ కథ చెప్పినప్పుడు నటిగా నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకునే అవకాశం ఉందనిపించింది. మా నాన్నగారితో నేను చేసిన తొలి సినిమా ఇది.. ఈ చిత్రం చూసి ఆయన చాలా ఎగ్జయిట్ అయ్యారు. మైనస్ 18 డిగ్రీల టెంపరేచర్‌లో నటించడం అనేది ఛాలెంజింగ్‌గా అనిపించింది'' అన్నారు. బోనీ కపూర్ మాట్లాడుతూ– ''తెలుగులో నా సతీమణి శ్రీదేవికి లభించినట్లుగానే నా కుమార్తె జాన్వీకి కూడా అదే తరహా ప్రేమాభిమానాలు దక్కుతాయని ఆశిస్తున్నాను'' అన్నారు.

గ్రామీణ నేపథ్యంలో..



● విష్ణు విశాల్

విష్ణు విశాల్, ఐశ్వర్య లక్ష్మి జంటగా చెల్లా అయ్యావు దర్శకత్వం వహించిన చిత్రం 'మట్టి కుస్తీ'. ఆర్‌టీ టీమ్ వర్క్స్, విష్ణు విశాల్ స్టూడియోస్‌పై హీరోలు రవితేజ, విష్ణు విశాల్ నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని రవితేజ రిలీజ్ చేశారు.''స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిన చిత్రమిది. గ్రామీణ నేపథ్యంలో సాగుతుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. డిసెంబర్‌లో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, కెమెరా: రిచర్డ్ ఎం. నాథన్.



● వరుణ్, కృతీ సనన్

లవ్.. హారర్.. కామెడీ

ఇటీవల హిట్ చిత్రం కన్నడ 'కాంతార'ని తెలుగులో విడుదల చేసిన అల్లు అరవింద్ గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ త్వరలో హిందీ చిత్రం 'భేదియా'ని విడుదల చేయనుంది. ఈ లవ్–హారర్–కామెడీ మూవీ తెలుగు విడుదల హక్కులను దక్కించుకున్న విషయాన్ని బుధవారం ప్రకటించింది. అమర్ కౌశిక్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం హిందీ, తమిళ, తెలుగులో ఈ నెల 25న విడుదల కానుంది. వరుణ్ ధావన్, కృతీ సనన్ జంటగా నటించారు. కాగా ఈ చిత్రంలో తోడేలు కాటుకు గురైన యువకుడు భాస్కర్ పాత్రలో వరుణ్, డాక్టర్ అనిక పాత్రలో కృతి కనిపిస్తారు. ''మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను విడుదల చేయాలనే ఆలోచనతో తెలుగు రాష్ట్రాల్లో 'కాంతార' తెలుగు వెర్షన్‌ను విడుదల చేశాం. 'భేదియా' కంటెంట్ కూడా బాగుంటుంది'' అని నిర్మాత బన్నీ వాసు పేర్కొన్నారు.

తొలి రౌండ్‌లోనే సైనా ఓటమి

హైలో ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్‌కు తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైంది. జర్మనీలో బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సైనా 15–21, 8–21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ 19–21, 21–19, 21–16తో లీ యాంగ్–లు చెన్ (చైనీస్ తైపీ) ద్వయంపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.



పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శిఖర్ ధావన్

వచ్చే ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నీలో పంజాబ్ కింగ్స్ జట్టు కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో బరిలోకి దిగనుంది. ఈ ఏడాది మయాంక్ అగర్వాల్ కెప్టెన్సీలో పంజాబ్ కింగ్స్ జట్టు ఆశించినస్థాయిలో రాణించలేకపోయింది. ప్లే ఆఫ్ దశకు కూడా అర్హత పొందలేకపోయింది. దాంతో పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ బుధవారం జరిగిన బోర్డు మీటింగ్‌లో కెప్టెన్సీ మార్పు నిర్ణయాన్ని తీసుకుంది. మయాంక్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించి శిఖర్ ధావన్‌ను కొత్త సారథిగా నియమించింది.



బంగ్లాదేశ్ భయపెట్టినా...

ఉత్కంఠ పోరులో గట్టెక్కిన భారత్ • 5 పరుగులతో టీమిండియా విజయం • బంగ్లాదేశ్‌కు తీవ్ర నిరాశ

కోహ్లి, రాహుల్ అర్ధసెంచరీలు • లిటన్ దాస్ పోరాటం వృథా • ఆదివారం జింబాబ్వేతో భారత్ చివరి మ్యాచ్

పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో చివరి బంతి వరకు నరాలు తెగే ఉత్కంఠను ఎదుర్కొన్న భారత ఆటగాళ్లు, అభిమానులకు ఈసారి బంగ్లాదేశ్ జట్టు దాదాపు అలాంటి అనుభవాన్నే ఇచ్చింది. ఒకదశలో మన జట్టు ఓటమి దిశగా వెళుతున్నట్లు అనిపించింది కూడా. అయితే చివరకు టీమిండియా సరైన సమయంలో పంచ్ విసిరి ఆటను మలుపు తిప్పింది. కీలక దశలో వరుణదేవుడు కాస్త అడ్డుగా నిలిచి బంగ్లాదేశ్ జోరుకు బ్రేకులు వేయగా... ఆట మొదలైన తర్వాత రోహిత్ సేన ఆ అవకాశాన్ని సమర్థంగా వాడుకుంది. ఫలితంగా ప్రపంచకప్‌లో సంచలనానికి అవకాశం లేకుండా చేసింది. బంగ్లాదేశ్ లక్ష్యం 185 పరుగులు... 7 ఓవర్లలో 66/0...లిటన్ దాస్ చెలరేగిపోతున్నాడు. అయితే వర్షం రావడంతో డక్‌వర్త్–లూయిస్ సీన్‌లోకి వచ్చేసింది. ఆ సమయానికి బంగ్లా 17 పరుగులు ముందంజలో ఉంది. వాన కొనసాగి ఇంకా ఆట సాధ్యంకాకపోయుంటే భారత్ ఓడిపోయేదే! కానీ వాన ఆగి ఆట మళ్లీ మొదలైంది. బంగ్లాదేశ్ లక్ష్యం 16 ఓవర్లలో 151 పరుగులుగా మారింది... అంటే మిగిలిన 54 బంతుల్లో 85 పరుగులు, చేతిలో 10 వికెట్లు... ఎలా చూసినా బంగ్లాదే పైచేయి. కానీ రెండో బంతికే లిటన్ దాస్‌ను అద్భుతంగా రనౌట్ చేసిన టీమిండియా మ్యాచ్‌ను చేతుల్లోకి తెచ్చుకుంది. చక్కటి బౌలింగ్‌తో ప్రత్యర్థిని పడగొట్టి సెమీస్‌లో స్థానం దాదాపు ఖాయం చేసుకుంది.

అడిలైడ్: టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు సెమీ ఫైనల్‌కు మరింత చేరువైంది. నాలుగు మ్యాచ్‌లలో మూడో విజయంతో గ్రూప్–2లో అగ్రస్థానానికి చేరుకుంది. బుధవారం ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 5 పరుగుల తేడాతో (డక్‌వర్త్–లూయిస్ ప్రకారం) బంగ్లాదేశ్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (44 బంతుల్లో 64 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్), కేఎల్ రాహుల్ (32 బంతుల్లో 50; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించగా, సూర్యకుమార్ యాదవ్ (16 బంతుల్లో 30; 4 ఫోర్లు) రాణించాడు. హసన్ మహమూద్‌కు 3 వికెట్లు లభించాయి. అనంతరం మ్యాచ్‌కు వాన అంతరాయం కలిగించడంతో బంగ్లాదేశ్ లక్ష్యాన్ని 16 ఓవర్లలో 151 పరుగులుగా నిర్దేశించారు. బంగ్లా 16 ఓవర్లలో 6 వికెట్లకు 145 పరుగులే చేయగలిగింది. లిటన్ దాస్ (27 బంతుల్లో 60; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం వృథా అయింది. హార్దిక్, అర్ష్‌దీప్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఆదివారం జింబాబ్వేతో తలపడుతుంది.


రాహుల్

రాహుల్ దూకుడు...

ఎట్టకేలకు కోచ్ రాహుల్ ద్రవిడ్ నమ్మకాన్ని ఓపెనర్ కేఎల్ రాహుల్ నిలబెట్టుకున్నాడు. మూడు వరుస వైఫల్యాల తర్వాత దూకుడైన బ్యాటింగ్‌తో అతను ఆకట్టుకున్నాడు. 1 పరుగు వద్ద హసన్ సునాయాస క్యాచ్ వదిలేసినా దానిని వాడుకోలేక రోహిత్ శర్మ (2) విఫలమయ్యాడు. అయితే హసన్ ఓవర్లో వరుసగా 4, 6తో రాహుల్ జోరు పెంచగా, మరో ఎండ్‌లో కోహ్లి జత కలిశాడు. పవర్‌ప్లేలో భారత్ 37 పరుగులు చేసింది. షరీఫుల్ వేసిన ఓవర్లో రాహుల్ చెలరేగాడు. అతను 2 సిక్స్‌లు, ఫోర్ బాదగా, అదే ఓవర్లో కోహ్లి మరో ఫోర్ కొట్టడంతో మొత్తం 24 పరుగులు వచ్చాయి. 31 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న రాహుల్ తర్వాతి బంతికే వెనుదిరిగాడు. హసన్ ఓవర్లో 3 ఫోర్లతో సూర్య కూడా ధాటిని ప్రదర్శించాడు. సూర్య అవుటైన తర్వాత కోహ్లి వేగం పెంచాడు. 14వ ఓవర్ ముగిసేసరికి 28 బంతుల్లో 32 పరుగులు చేసిన కోహ్లి, మరో 16 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 32 పరుగులు జోడించడం విశేషం. 37 బంతుల్లో అతను హాఫ్ సెంచరీని అందుకున్నాడు. హార్దిక్ (5), దినేశ్ కార్తీక్ (7), అక్షర్ పటేల్ (7) విఫలమైనా, కోహ్లి క్రీజ్‌లో ఉండటంతో భారత్ మెరుగైన స్కోరు సాధించగలిగింది. చివరి ఓవర్లో అశ్విన్ (13 నాటౌట్) ఒక సిక్స్, ఫోర్ కొట్టాడు.

చెలరేగిన బౌలర్లు...

వర్షం కారణంగా దాదాపు 45 నిమిషాల పాటు ఆట ఆగిపోగా, ఆ తర్వాత ఆట మళ్లీ మొదలయ్యాక బంగ్లా రాత మారిపోయింది. రెండో బంతికే దాస్ రనౌట్ కావడంతో పరిస్థితి తలకిందులైంది. ఇతర బ్యాటర్లలో ఎవరూ నిలబడలేకపోగా, భారత జట్టు చక్కటి ఫీల్డింగ్‌తో బంగ్లాను నిలువరించేసింది. ఫలితంగా 33 బంతుల వ్యవధిలో 40 పరుగులు మాత్రమే చేసిన బంగ్లా 6 వికెట్లు (దాస్ వికెట్‌తో సహా) చేజార్చుకుంది. అర్ష్‌దీప్ ఒకే ఓవర్లో రెండు వికెట్లతో దెబ్బ కొట్టాడు. సూర్య, దీపక్ హుడా సూపర్ క్యాచ్‌లతో బంగ్లా బ్యాటర్లను వెనక్కి పంపారు. ఆ తర్వాత ఒకే ఓవర్లో మరో రెండు వికెట్లతో హార్దిక్ కూడా చెలరేగాడు. ఏడో వికెట్‌కు నూరుల్ హసన్ (14 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), తస్కీన్ (12 నాటౌట్) కలిసి 19 బంతుల్లోనే 37 పరుగులు జోడించి గెలిపించే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది.


అర్ష్‌దీప్

చివరి ఓవర్లో...

బంగ్లా విజయానికి ఆఖరి ఓవర్లో 20 పరుగులు అవసరం కాగా, అర్ష్‌దీప్ యార్కర్లతో కట్టడి చేయగలిగాడు. తొలి బంతికి సింగిల్ వచ్చాక 5 బంతుల్లో 19 పరుగులు చేయాల్సిన సమయంలో నూరుల్ పోరాడాడు. రెండో బంతికి భారీ సిక్స్ కొట్టిన అతను మూడో బంతికి సింగిల్ అవకాశం ఉన్నా స్ట్రయికింగ్ కోల్పోకుండా ఉండేందుకు పరుగు తీయలేదు. తర్వాతి రెండు బంతుల్లో 2, 4 కొట్టిన అతను ఉత్కంఠను పెంచాడు. చివరి బంతికి సిక్స్ కొడితే స్కోరు సమమయ్యే స్థితిలో భారీ షాట్‌కు ప్రయత్నించిన నూరుల్‌కు సింగిల్ మాత్రమే దక్కింది. దాంతో బంగ్లా అభిమానుల గుండె పగలగా, రోహిత్ సేన హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకుంది.

మెరుపు ఇన్నింగ్స్...

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో లిటన్ దాస్ ఆటనే హైలైట్‌గా నిలిచింది. లక్ష్య ఛేదనలో ఆరంభం నుంచి అతను విరుచుకుపడ్డాడు. అర్ష్‌దీప్ తొలి ఓవర్లో 3 ఫోర్లు కొట్టిన అతను, భువనేశ్వర్ వేసిన తర్వాతి ఓవర్లో వరుసగా 6, 4, 4 బాదాడు. 27 పరుగుల వద్ద దాస్ ఇచ్చిన కష్టసాధ్యమైన క్యాచ్‌ను దినేశ్ కార్తీక్ అందుకోలేకపోయాడు. షమీ ఓవర్లోనూ 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన దాస్ 21 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కవర్‌డ్రైవ్, పుల్, వికెట్ల వెనక స్కూప్‌లతో అన్ని రకాల షాట్లు ఆడిన దాస్‌ను నిలువరించేందుకు రోహిత్ ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. దాస్ జోరుతో పవర్‌ప్లేలో 60 పరుగులు చేసిన బంగ్లా 7 ఓవర్లు ముగిసేసరికి 66/0తో పటిష్ట స్థితిలో నిలిచింది.


టర్నింగ్ పాయింట్: లిటన్ దాస్ రనౌట్

ఆ రనౌట్‌తో...

రాహుల్‌కు బుధవారం కలిసొచ్చింది. విమర్శలకు సమాధానమిస్తూ బ్యాటింగ్‌లో అర్ధ సెంచరీ చేసిన అతను ఫీల్డింగ్‌లో అద్భుత త్రో విసిరి ఆట దిశను మార్చాడు. వాన ఆగిన తర్వాత వేసిన రెండో బంతికి లిటన్ దాస్ రనౌట్ కావడం బంగ్లా పతనానికి దారి తీసింది. అశ్విన్ బౌలింగ్‌లో నజ్ముల్ డీప్ మిడ్ వికెట్ దిశగా ఆడగా సింగిల్ సులువుగా పూర్తయింది. అయితే బ్యాటర్లు రెండో పరుగు తీస్తుండగా, వేగంగా దూసుకొచ్చిన రాహుల్ డైరెక్ట్ త్రో నాన్ స్ట్రయికింగ్ ఎండ్‌లో వికెట్లను పడగొట్టడంతో దాస్ నిరాశగా వెనుదిరిగాడు. అంతకుముందు బంతికే సింగిల్ తీస్తూ జారిపడి నొప్పికి చికిత్స తీసుకొన్న దాస్ ఈసారి రెండో పరుగు తీసే సాహసం చేశాడు. చివరకు అదే బంగ్లా ఓటమికి బాటలు వేసింది.

"భారత్‌తో మళ్లీ మాది పాత కథే. గెలుపునకు బాగా దగ్గరగా రావడం, ఆపై ఓడిపోవడం. ఇలాంటి ఉత్కంఠభరిత మ్యాచ్‌లు మేం ఎక్కువగా ఆడలేదు. అందుకే అలాంటి సమయంలో ఎలా గెలవాలో తెలీదు. అనుభవం లేకపోవడం కూడా ఒక కారణం. 185 అయినా 151 అయినా సాధించదగ్గ లక్ష్యమే. కానీ దురదృష్టవశాత్తూ మేం గెలవలేకపోయాం. చివరి 2 ఓవర్లలో 30 కూడా సాధ్యమే కానీ అది జరగలేదు. వాన ఆగిన తర్వాత మైదానం తడిగా ఉంది కాబట్టి కాస్త ఆలస్యంగా ఆటను ప్రారంభించమని అంపైర్లను అడిగే స్థాయి నాకు లేదు. వర్షంతో మా జోరుకు అడ్డుకట్ట పడిందనేది వాస్తవం. అయితే సాధారణంగా మైదానం, బంతి తడిగా ఉన్నప్పుడు బౌలింగ్ జట్టుకే సమస్య. బ్యాటింగ్‌లో పరుగులు చేయడం సులువే కాబట్టి దానిని ఓటమికి సాకుగా చెప్పను. –షకీబ్ అల్ హసన్, బంగ్లాదేశ్ కెప్టెన్



1 భారత్‌తో మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసిన బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా సౌతీ (న్యూజిలాండ్; 127 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు.

నేను ఒకే సమయంలో అటు ప్రశాంతంగా, ఇటు ఒత్తిడిలోనూ ఉన్నా. అయితే ఫలితం సాధించాలంటే జట్టు మొత్తం ప్రశాంతంగా ఉండటం ముఖ్యం. కుదించిన మ్యాచ్‌లలో ఫలితం ఎటైనా మొగ్గవచ్చు. అయితే కీలక సమయాల్లో ఒత్తిడిని అధిగమించాం కాబట్టి గెలవగలిగాం. డెత్ ఓవర్లలో బౌలింగ్ చేయాల్సి ఉంటుందని అర్ష్‌దీప్‌కు మొదటి నుంచే చెబుతున్నాం. అది అంత సులువైన విషయం కాదు. అసలు సమయంలో అద్భుత క్యాచ్‌లు అందుకున్న మా ఫీల్డర్లను అభినందించకుండా ఉండలేను. –రోహిత్ శర్మ, భారత కెప్టెన్"





7 టి20 ప్రపంచకప్ చరిత్రలో కోహ్లికి లభించిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డుల సంఖ్య.

3350 ఆస్ట్రేలియా గడ్డపై అన్ని ఫార్మాట్‌లలో కలిపి విరాట్ కోహ్లి చేసిన పరుగులు. విదేశీ గడ్డపై అత్యధిక పరుగులు చేసిన భారత క్రికెటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ టెండూల్కర్ (ఆస్ట్రేలియాలో 3,300 పరుగులు) పేరిట ఉన్న రికార్డును కోహ్లి అధిగమించాడు.

3 టి20 ప్రపంచకప్ టోర్నీలలో మూడు లేదా అంతకంటే ఎక్కువ అర్ధ సెంచరీలు చేయడం కోహ్లికిది మూడోసారి. తాజా ప్రపంచకప్‌తోపాటు 2014, 2016 ప్రపంచకప్ టోర్నీల్లోనూ కోహ్లి ఈ ఘనత సాధించాడు. గతంలో ఏ క్రికెటర్ కూడా ఇలా చేయలేదు.

కోహ్లి రికార్డు

బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా భారత స్టార్ విరాట్ కోహ్లి టి20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా అవతరించాడు. కోహ్లి వ్యక్తిగత స్కోరు 16 పరుగులు దాటగానే ఇప్పటి వరకు శ్రీలంక క్రికెటర్ మహేల జయవర్ధనే (31 మ్యాచ్‌ల్లో 1,016 పరుగులు) పేరిట ఉన్న ఈ రికార్డు కోహ్లి ఖాతాలోకి చేరింది. కెరీర్‌లో ఐదో టి20 ప్రపంచకప్ ఆడుతున్న కోహ్లి ఇప్పటివరకు 25 మ్యాచ్‌లు ఆడి 23 ఇన్నింగ్స్‌లలో మొత్తం 1,065 పరుగులు సాధించాడు. అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్ల జాబితాలోనూ కోహ్లి టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు కోహ్లి 113 టి20 మ్యాచ్‌లు ఆడి 3,932 పరుగులు చేశాడు. రోహిత్ శర్మ (146 మ్యాచ్‌ల్లో 3,811 పరుగులు) రెండో స్థానంలో ఉన్నాడు.

'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) ముస్తఫిజుర్ (బి) షకీబ్ 50; రోహిత్ (సి) యాసిర్ అలీ (బి) హసన్ 2; కోహ్లి (నాటౌట్) 64; సూర్యకుమార్ (బి) షకీబ్ 30; హార్దిక్ (సి) యాసిర్ అలీ (బి) హసన్ 5; కార్తీక్ (రనౌట్) 7; అక్షర్ (సి) షకీబ్ (బి) హసన్ 7; అశ్విన్ (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 184. వికెట్ల పతనం: 1–11, 2–78, 3–116, 4–130, 5–150, 6–157. బౌలింగ్: తస్కీన్ 4–0–15–0, షరీఫుల్ 4–0–57–0, హసన్ 4–0–47–3, ముస్తఫిజుర్ 4–0–31–0, షకీబ్ 4–0–33–2.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: నజ్ముల్ (సి) సూర్యకుమార్ (బి) షమీ 21; లిటన్ దాస్ (రనౌట్) 60; షకీబ్ (సి) (సబ్) దీపక్ హుడా (బి) అర్ష్‌దీప్ 13; అఫీఫ్ (సి) సూర్యకుమార్ (బి) అర్ష్‌దీప్ 3; యాసిర్ అలీ (సి) అర్ష్‌దీప్ (బి) హార్దిక్ 1; నూరుల్ (నాటౌట్) 25; మొసద్దిక్ (బి) హార్దిక్ 6; తస్కీన్ అహ్మద్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (16 ఓవర్లలో 6 వికెట్లకు) 145. వికెట్ల పతనం: 1–68, 2–84, 3–99, 4–100, 5–102, 6–108. బౌలింగ్: భువనేశ్వర్ 3–0–27–0, అర్ష్‌దీప్ 4–0–38–2, షమీ 3–0–25–1, అక్షర్ పటేల్ 1–0–6–0, అశ్విన్ 2–0–19–0, హార్దిక్ 3–0–28–2.

నెదర్లాండ్స్‌కు తొలి విజయం

రాణించిన ఓడౌడ్, మీకెరెన్ • జింబాబ్వేకు రెండో పరాజయం

అడిలైడ్: టి20 ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్ జట్టు 'సూపర్–12'లో బోణీ కొట్టింది. గ్రూప్–2లో బుధవారం జరిగిన పోరులో ఆరెంజ్ టీమ్ 5 వికెట్ల తేడాతో జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన జింబాబ్వే 19.2 ఓవర్లలో 117 పరుగులకే ఆలౌటైంది. సికందర్ రజా (24 బంతుల్లో 40; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచేశాడు. నెదర్లాండ్స్ బౌలర్లు మీకెరెన్ (3/29), బస్ డి లీడే (2/14), వాన్ బీక్ (2/17), గ్లోవెర్ (2/29) సమష్టిగా దెబ్బతీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఆరెంజ్ జట్టు 18 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మ్యాక్స్ ఒడౌడ్ (47 బంతుల్లో 52; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఓవరాల్‌గా ఈ మెగా ఈవెంట్‌లో డచ్ జట్టుకిది మూడో గెలుపు. తొలి రౌండ్‌లో యూఏఈ, నమీబియాలను ఓడించి సూపర్–12కు అర్హత సాధించింది.

పవర్‌ప్లేలోనే జింబాబ్వే టాపార్డర్‌ను కోల్పోయింది. వెస్లీ మదెవెర్ (2)ను మీకెరెన్, కెప్టెన్ ఇర్విన్ (3), చకబ్వా (5)లను బ్రాండన్ గ్లోవెర్ అవుట్ చేయడంతో జింబాబ్వే 6 ఓవర్లలో 20/3 స్కోరు చేసింది. ఈ దశలో సీన్ విలియమ్స్ (23 బంతుల్లో 28; 3 ఫోర్లు), సికందర్ ఇన్నింగ్స్‌ను కుదుటపరిచారు. అయితే జట్టుస్కోరు 68 వద్ద మీకెరెన్ ఆ జోడీని విడగొట్టి మళ్లీ కష్టాలపాలు చేశాడు. వరుస విరామాల్లో వాన్ బీక్, డి లీడే జింబాబ్వే వికెట్లను పడగొట్టారు. మరోవైపు సికందర్ రజా భారీ సిక్సర్లతో జట్టు స్కోరు పెంచే ప్రయత్నం చేశాడు. కానీ సహచరులు మిల్టన్ (2), రియాన్ బర్ల్ (2), జాంగ్వే (6), ఎన్‌గరవ (9), ముజరబని (1) ఎవరూ పది పరుగులైనా చేయలేకపోయారు.

తర్వాత సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన నెదర్లాండ్స్ ఆరంభంలోనే ఓపెనర్ స్టీఫన్ మిబర్గ్ (8) వికెట్‌ను కోల్పోయింది. కానీ మరో ఓపెనర్ మ్యాక్స్ ఒడౌడ్, వన్‌డౌన్‌లో వచ్చిన టామ్ కూపర్ (29 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్) మూడో వికెట్‌కు 73 పరుగులు జోడించడంతో నెదర్లాండ్స్ గెలుపుబాట పట్టింది. మిడిలార్డర్ బ్యాటర్స్ అకెర్‌మన్ (1), కెప్టెన్ ఎడ్వర్డ్స్ (5) విఫలమైనా ఇబ్బంది లేకుండా బస్ డి లీడే (12 నాటౌట్; 2 ఫోర్లు) మ్యాచ్‌ను 18 ఓవర్లలోనే ముగించాడు. జింబాబ్వే బౌలర్లలో ఎన్‌గరవ, ముజరబాని రెండు వికెట్లు చొప్పున తీశారు.


ఒడౌడ్

టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

గ్రూప్–1

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
న్యూజిలాండ్	4	2	1	1	5	2.233
ఇంగ్లండ్	4	2	1	1	5	0.547
ఆస్ట్రేలియా	4	2	1	1	5	-0.304
శ్రీలంక	4	2	2	0	4	-0.457
ఐర్లాండ్	4	1	2	1	3	-1.544
అఫ్గానిస్తాన్	4	0	2	2	2	-0.718

గ్రూప్–2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
భారత్	4	3	1	0	6	0.730
దక్షిణాఫ్రికా	3	2	0	1	5	2.772
బంగ్లాదేశ్	4	2	2	0	4	-1.276
జింబాబ్వే	4	1	2	1	3	-0.313
పాకిస్తాన్	3	1	2	0	2	0.765
నెదర్లాండ్స్	4	1	3	0	2	-1.233

నోట్: మ్యా–మ్యాచ్‌లు, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, పా–పాయింట్లు, నె.ర–నెట్ రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ X దక్షిణాఫ్రికా (మ.గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

వయాకామ్‌లో సఫారీ లీగ్ ప్రసారం

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో వచ్చే ఏడాది మొదలవుతున్న 'ఎస్‌ఏ20' టోర్నీ మ్యాచ్‌ల్ని భారత్‌లో 'వయాకామ్ 18' సంస్థ ప్రసారం చేయనుంది. ఈ మేరకు దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డుతో 'వయాకామ్ 18' పదేళ్ల కాలానికి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మొత్తం 6 ఫ్రాంచైజీ జట్ల మధ్య వచ్చే జనవరి 10 నుంచి 'ఎస్‌ఏ20' లీగ్ జరుగుతుంది.

సూర్య 'నంబర్‌వన్'

• ఐసీసీ టి20 ర్యాంకుల్లో అగ్రస్థానం
• కోహ్లి తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారత క్రికెటర్

దుబాయ్: టి20 ఫార్మాట్‌లో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా చెలరేగుతున్న సూర్యకుమార్ యాదవ్ ర్యాంకింగ్స్‌లోనూ అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ సూర్యకుమార్ నంబర్‌వన్ ర్యాంక్‌కు ఎగబాకాడు. ఈ ఏడాది ప్రత్యేకించి టి20 ఫార్మాట్‌లో ఇంటా బయటా విశేషంగా రాణిస్తోన్న సూర్య... పాకిస్తాన్ ఓపెనర్ మొహమ్మద్ రిజ్వాన్ (842 పాయింట్లు)ను వెనక్కినెట్టాడు. నిలకడగా మెరుపులు మెరిపిస్తున్న యాదవ్ ఖాతాలో 863 రేటింగ్ పాయింట్లున్నాయి. కోహ్లి (897; సెప్టెంబర్ 2014లో) తర్వాత రెండో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లను సూర్యకుమార్ నమోదు చేశాడు. గతేడాది మార్చిలో మొదలైన అతని టి20 ప్రయాణంలో అచిరకాలంలోనే ఒక సెంచరీ, 11 అర్ధసెంచరీలు ఉండటం గొప్ప విశేషం. టి20ల్లో టాప్ ర్యాంక్‌కు చేరిన రెండో భారత బ్యాటర్ సూర్యకుమార్. ఈ ఫార్మాట్‌లో కేవలం 'రన్ మెషిన్' కోహ్లి మాత్రమే నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. భారత స్టార్ 2014 నుంచి 2017 డిసెంబర్ మధ్య కాలంలో 1013 రోజులు టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు. తాజా ర్యాంకుల్లో కోహ్లి 638 పాయింట్లతో పదో ర్యాంకులో ఉన్నాడు. బౌలింగ్ జాబితాలో అఫ్గానిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (700) తొలి ర్యాంక్‌లో నిలువగా, శ్రీలంక స్పిన్నర్ హసరంగ (697) రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. గత ప్రపంచకప్ సమయంలో శ్రీలంక బౌలర్ టాప్ ర్యాంకులో ఉన్నాడు. మళ్లీ అగ్రస్థానంపై కన్నేసిన అతనికి రషీద్‌కు మధ్య కేవలం 3 పాయింట్లే తేడా! భారత బౌలర్లెవరూ టాప్–10లో లేరు. అశ్విన్ మూడు స్థానాల్ని మెరుగుపర్చుకొని 18వ స్థానంలో ఉన్నాడు.




రెండో స్థానంలో హర్ష

న్యూఢిల్లీ: ఆసియా కాంటినెంటల్ చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి వరుసగా మూడో 'డ్రా' నమోదు చేశాడు. ఉజ్బెకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్ వాఖిదోవ్‌తో జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌ను హర్ష 30 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఎనిమిదో రౌండ్ తర్వాత హర్ష ఆరు పాయింట్లతో మరో నలుగురితో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నూతక్కి ప్రియాంక ఎనిమిదో రౌండ్ తర్వాత 5.5 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.



క్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా ఎలైట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన 57 కేజీల విభాగం ప్రిక్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్ 3–2తో మునార్‌బెక్ (కిర్గిస్తాన్)పై గెలుపొందాడు. ఇటీవల బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన హుసాముద్దీన్ క్వార్టర్ ఫైనల్లో పాకిస్తాన్ బాక్సర్ ఇలియాస్ హుస్సేన్‌తో తలపడతాడు. క్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్ గెలిస్తే కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంటాడు. మరోవైపు 80 కేజీల విభాగంలో భారత్‌కే చెందిన లక్ష్య చహర్ కూడా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య చహర్ 5–0తో షబ్బోస్ నెగ్మత్ (తజికిస్తాన్)పై గెలుపొందాడు. మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో స్పర్శ్ కుమార్ (51 కేజీలు) 1–4తో ప్రపంచ చాంపియన్ సాకెన్ బిబోసినోవ్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. ఈ మెగా టోర్నీలో 27 దేశాల నుంచి 267 మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.



సాక్షి బిజినెస్
గురువారం
3-11-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
215	63
60,906	18,083

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 10.00 ముగింపు)			
నాస్‌డాక్	10,786	▽	104
డోజోన్స్	32,600	▽	53
ఎఫ్‌టీఎస్ఈ 100	7,154	▽	32
డాక్స్	13,286	▽	52
హాంగ్‌సెంగ్	3,003	△	34
నికాయ్	27,679	▽	16


•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	50,824	△ 133
బంగారం (99.5 స్వచ్ఛత)	50,448	△ 132
వెండి (కిలో)	58,627	△ 421

ఆర్థిక వ్యవస్థ పతనాన్ని అడ్డుకున్నాం

- రేట్లను ముందే కట్టడి చేస్తే మరోలా ఉండేది
- ఆ పరిస్థితిని ఆర్‌బీఐ నివారించింది
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



ముంబై: ద్రవ్యోల్బణాన్ని లక్ష్యిత స్థాయికి కట్టడి చేయడంలో విఫలమైందంటూ వస్తున్న విమర్శలకు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ తగిన బదులిచ్చారు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడమన్న ప్రాథమిక లక్ష్యంలో వెనుకబడినట్టు అంగీకరిస్తూనే.. ఆర్‌బీఐ అనుసరించిన విధానాన్ని ఆయన సమర్థించుకున్నారు. ముంబైలో జరిగిన ఎఫ్ఐబీఏసీ సమావేశంలో భాగంగా శక్తికాంతదాస్ తన అభిప్రాయాలను వెల్లడించారు. ఒకవేళ ఆర్‌బీఐ ముందుగానే రేట్లను కట్టడి చేసి ఉంటే ఆర్థిక వ్యవస్థ అధోముఖం పాలయ్యేదన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను బలమైన, సుస్థిర, ఆశావాదంగా ప్రపంచం చూస్తున్నట్టు చెప్పారు. ద్రవ్యోల్బణం ఇప్పుడిక మోస్తరు స్థాయికి దిగొస్తుందన్నారు. ద్రవ్యోల్బణం విషయంలో విరుద్ధమైన అంశాలను కూడా చూడాల్సి ఉంటుందని, ముందస్తుగానే రేట్లను కట్టడి చేయడం వృద్ధికి విఘాతాన్ని కలిగిస్తుందన్న వాస్తవాన్ని గుర్తించాలని దాస్ సూచించారు. ''అలా చేస్తే ఆర్థిక వ్యవస్థ, దేశ పౌరులకు భారంగా మారి ఉండేది. భారీ మూల్యమే చెల్లించాల్సి వచ్చేది''అని దాస్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక వ్యవస్థను సురక్షిత స్థానానికి చేర్చాల్సి ఉందంటూ, అటువంటి తరుణంలో కోలుకుంటున్న ఆర్థిక వ్యవస్థకు అవరోధం కలిగించరాదన్నారు. ''కరోనా సమయంలో ద్రవ్యోల్బణం నిర్దేశిత లక్ష్యం 2–6 శాతం పరిధిలో కొంచెం పెరిగినా పర్వాలేదనే విధంగా ఆర్‌బీఐ సులభతర మానిటరీ పాలసీ చర్యలను అనుసరించింది. ఆర్థిక వృద్ధికి మద్దతుగా ఇలా చేసింది. దీంతో 2021-22, 2022-23లో ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకుంది'' అని వివరించారు. భారత ఆర్థిక వృద్ధి రికవరీ విస్తత స్థాయిలో ఉందంటూ.. సకాలంలో, సరైన లక్ష్యిత ద్రవ్య, మానిటరీ, నియంత్రణపరమైన విధానాల ఫలితమే ఇదన్నారు.

ఈ-రూపాయిపై పరీక్షలు మొదలు

టోకు (హోల్‌సేల్) మాదిరే రిటైల్ విభాగంలో ఈ-రూపాయిపై ప్రయోగాత్మక పరీక్షలు ఈ నెల చివరిలోపు మొదలవుతాయని శక్తికాంత దాస్ ప్రకటించారు. కొన్ని బ్యాంకుల ద్వారా హోల్‌సేల్ విభాగంలో ఈ-రూపాయి వినియోగంపై పరీక్షలు మంగళవారమే మొదలు కావడం గమనార్హం. సెంట్రల్ బ్యాంకు డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ/ఈ-రూపాయి)ని విడుదల చేయడం దేశ కరెన్సీ చరిత్రలోనే మైలురాయిగా నిలిచిపోతుందని దాస్ పేర్కొన్నారు. వ్యాపార నిర్వహణ విధానాన్ని పూర్తిగా మార్చేస్తుందన్నారు. రూపాయి విలువ క్షీణతను భావోద్వేగాల కోణం నుంచి బయటకి వచ్చి చూడాలన్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుంచి రూపాయి క్రమపద్ధతిలోనే చలించిందని చెప్పారు. తద్వారా దీనిపైపై విమర్శలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఇతర పెద్ద కరెన్సీలతో పోలిస్తే రూపాయి విలువ క్షీణత తక్కువగా ఉన్నట్టు చెప్పారు. యూఎస్ డాలర్ మినహా మిగిలిన కరెన్సీలతో బలపడినట్టు గుర్తు చేశారు.

ప్రభుత్వానికి నివేదిక

ఆర్‌బీఐ ఎంపీసీ గురువారం (ఈ నెల 3న) నాటి సమావేశం ఎజెండాను శక్తికాంతదాస్ వెల్లడించారు. ద్రవ్యోల్బణం కట్టడి లక్ష్యంలో ఎందుకు విఫలమైందనే, కారణాలపై చర్చించి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు చెప్పారు. వరుసగా తొమ్మిది నెలల పాటు ద్రవ్యోల్బణం 6 శాతానికి పైనే కొనసాగడానికి దారితీసిన కారణాలను వివరించనున్నట్టు తెలిపారు. వ్యవసాయ రంగ రుణాల ప్రయోగాత్మక డిజిటైజేషన్‌పై దాస్ స్పందిస్తూ.. చిన్న వ్యాపార రుణాలకు సైతం 2023 నుంచి ఇదే విధానాన్ని అనుసరించాలని అనుకుంటున్నట్టు చెప్పారు.

'అర్జునుడు–చేప కన్ను' ప్రస్తావన...

ఇప్పుడు ద్రవ్యోల్బణం కట్టడిపైనే దృష్టినంతా కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ భావిస్తోందని శక్తికాంతదాస్ స్పష్టం చేశారు. మహాభారత ఇతిహాసంలో పైన తిరిగే చేప కంటిని గురి చూసి కొట్టడంపై అర్జునుడు దృష్టి సారించిన దృష్టాంతాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేయడం గమనార్హం. ''అర్జునుడి పరాక్రమానికి ఎవరూ సాటిలేరు. అలాగే ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడమే మా నిరంతర ప్రయత్నం'' అని ఆర్‌బీఐ గవర్నర్ వ్యాఖ్యానించారు.

నెల రోజుల్లోనే 10 లక్షల 5జీ యూజర్లు: ఎయిర్‌టెల్




న్యూఢిల్లీ: వేగవంతమైన 5జీ టెలికం సర్వీసులను ప్రారంభించిన నెల రోజుల వ్యవధిలోనే 10 లక్షల మంది పైగా కస్టమర్ల మైలురాయిని దాటినట్లు భారతి ఎయిర్‌టెల్ వెల్లడించింది. నెట్‌వర్క్‌ను నిర్మించుకునే ప్రయత్నాలు ఇంకా కొనసాగిస్తుండగానే ఇది సాధించగలిగామని సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ రణ్‌దీప్ సెఖోన్ తెలిపారు. యాపిల్ ఐఫోన్‌లు మినహా 5జీ ఆధారిత స్మార్ట్‌ఫోన్లు అన్నీ ఈ నెల మధ్య నాటికి తమ సేవలను అందుకోగలవని ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్ ఇప్పటికే తెలిపారు. ఐఫోన్‌ల కోసం యాపిల్ నవంబర్ తొలినాళ్లలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లను విడుదల చేస్తుందని, డిసెంబర్ మధ్య నుంచి అవి కూడా 5జీని సపోర్ట్ చేయవచ్చని ఆయన చెప్పారు. ప్రస్తుతానికి 4జీ రేట్లకే 5జీ సేవలు అందిస్తున్నామని, వచ్చే 6-9 నెలల్లో ధరలపై నిర్ణయం తీసుకుంటామని వివరించారు. 2024 మార్చి ఆఖరు నాటికి కీలకమైన గ్రామీణ ప్రాంతాలతో పాటు దేశవ్యాప్తంగా అన్ని పట్టణాల్లోనూ 5జీ సేవలు అందుబాటులోకి తేగలమని పేర్కొన్నారు. భారతి ఎయిర్‌టెల్ ప్రస్తుతం దశలవారీగా హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు తదితర నగరాల్లో 5జీ సర్వీసులను విస్తరిస్తోంది.

ఆరోసారి ఫెడ్ వడ్డీ పెంపు

తాజాగా 0.75 శాతం అప్

న్యూయార్క్: ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లపై ప్రభావం చూపగల యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్ల పెంపును చేపట్టింది. రెండు రోజులపాటు సమావేశమైన ఫెడరల్ రిజర్వ్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌ఓఎంసీ) ద్రవ్యోల్బణ కట్టడే ప్రధాన ఎజెండాగా వరుసగా ఆరోసారి ఫండ్స్ రేట్లను పెంచింది. తాజాగా 0.75 పెంపును ప్రకటించింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 3.75-4 శాతానికి చేరాయి. దీంతో వరుసగా నాలుగోసారి 0.75 శాతం చొప్పున రేట్లను పెంచినట్లయ్యింది. ఈ ఏడాది(2022) ఇప్పటివరకూ ఎఫ్‌ఓఎంసీ వడ్డీ రేట్లను 3.75 శాతం హెచ్చించింది. ద్రవ్యోల్బణం గత 40 ఏళ్లలోలేని విధంగా 8 శాతాన్ని అధిగమించడంతో ఫెడ్ ధరల కట్టడికి అత్యంత కీలకమైన వడ్డీ రేట్ల పెంపు మార్గాన్ని ఎంచుకుంది. తాజాగా సెప్టెంబర్‌లోనూ వినియోగ ధరల ఇండెక్స్ 8.2 శాతాన్ని తాకింది.



కర్ణాటక బ్యాంక్ లాభం రికార్డ్

- క్యూ2లో రూ. 411 కోట్లు
- షేరు 20 శాతం హైజంప్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ కర్ణాటక బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 228 శాతం దూసుకెళ్లి రూ. 411 కోట్లను అధిగమించింది. ఇది ఒక క్వార్టర్‌లో బ్యాంక్ చరిత్రలోనే అత్యధికంకాగా.. గతేడాది(2021-22) ఇదే కాలంలో కేవలం రూ. 125 కోట్లు ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం సైతం 26 శాతం ఎగసి రూ. 803 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.03 శాతం నుంచి 3.36 శాతానికి, నికర ఎన్‌పీఏలు 2.16 % నుంచి 1.72 శాతానికి దిగివచ్చాయి.

ఫలితాల నేపథ్యంలో కర్ణాటక బ్యాంక్ షేరు బీఎస్ఈలో 20 % దూసుకెళ్లి రూ. 113 వద్ద ముగిసింది.


డీసీఎక్స్ సిస్టమ్స్ ఐపీవో దూకుడు

70 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్

న్యూఢిల్లీ: కేబుళ్లు, వైర్ హార్నెస్ అసెంబ్లీల తయారీ కంపెనీ డీసీఎక్స్ సిస్టమ్స్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. ఇష్యూ చివరి రోజు బుధవారానికల్లా దాదాపు 70 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. ఇష్యూలో భాగంగా 1.45 కోట్ల షేర్లను ఆఫర్ చేయగా.. 101.27 కోట్ల షేర్లకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. వెరసి షేరుకి రూ.197-207 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ.500 కోట్లు సమీకరించింది. రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 61.8 రెట్లు అధిక స్పందన లభించింది.

మార్కెట్లో 'ఫెడ్' అప్రమత్తత

- నాలుగు రోజుల లాభాలకు బ్రేక్
- ఫారెక్స్ మార్కెట్ నుంచి ప్రతికూలతలు
- సెన్సెక్స్ 215 పాయింట్లు మైనస్
- 18,100 స్థాయి దిగువకు నిఫ్టీ
- ఐటీ, బ్యాంకింగ్, ఆటో షేర్లలో అమ్మకాలు



ముంబై: ఫెడ్ రిజర్వ్ పాలసీ ప్రకటనకు ముందు అప్రమత్తత చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీల నాలుగురోజుల ర్యాలీకి బ్రేక్ పడింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి క్షీణత మరింత ఒత్తిడిని పెంచింది. ఆటో, ఐటీ, బ్యాంకింగ్, టెలికాం, రియల్టీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. సెన్సెక్స్ ఉదయం 36 పాయింట్ల స్వల్ప లాభంతో 61,157 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 61,210 - 60,794 మధ్య కదలాడింది. చివరికి 215 పాయింట్లు నష్టపోయి 60,906 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 33 పాయింట్లు పెరిగి 18,178 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 18,049 వద్ద కనిష్టాన్ని, 18,179 వద్ద గరిష్టాన్ని తాకింది. మార్కెట్ ముగిసే సరికి నిఫ్టీ 63 పాయింట్లు పతనమై 18,083 వద్ద నిలిచింది. మెటల్, ఫార్మా, మీడియా షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. చిన్న, మధ్య తరహా షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు అరశాతానికి పైగా క్షీణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1436 కోట్ల షేర్లను కొన్నారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.1378 కోట్ల షేర్లను అమ్మేశారు. ఎఫ్ఎంసీ ద్రవ్య విధాన వైఖరి వెల్లడి(బుధవారం రాత్రి)కి ముందుకు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- క్యూ2 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో భారతీ ఎయిర్‌టెల్ షేరులో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్ఈలో మూడుశాతం నష్టపోయి రూ.810 వద్ద నిలిచింది.
- మార్కెట్ అనిశ్చితుల్లోనూ ఐటీసీ షేరు రాణించింది. ఇంట్రాడేలో 2% పెరిగి రూ.356 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. ట్రేడింగ్ ముగిసే సరికి ఒకటిన్నర శాతం నష్టపోయి రూ.354 వద్ద నిలిచింది.
- క్యూ2 నికరలాభం క్షీణించడంతో అదానీ పోర్ట్స్ షేరు ఒకశాతం నష్టపోయి రూ.3308 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 2% క్షీణించి రూ.3283 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-11-2022	
విశాఖ	512-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	512-00
విజయవాడ	512-00
రిటైల్ ధర (డజను)	78.00
2-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	499-00
వరంగల్	501-00
రిటైల్ ధర	5.60

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

డీఈఆర్ఎల్, హైదరాబాద్‌లో 101 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్-డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)కు చెందిన డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ ల్యాబొరేటరీ..ట్రేడ్/టెక్నీషియన్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 101
- **ట్రేడులు:** సీవోపీఏ, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, కార్పెంటర్, షీట్ మెటల్, వెల్డర్, ఎలక్ట్రోప్లేటింగ్, ప్లాస్టింగ్ ప్రాసెసింగ్, డ్రాఫ్ట్స్‌మెన్(మెకానికల్), డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్), సెక్రటేరియల్ ట్రెనింగ్ అండ్ మేనేజ్‌మెంట్, డీజిల్ మెకానిక్, ఫైర్‌మ్యాన్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, బుక్ బైండింగ్, ఏఎస్ఎం.
- **అర్హత:** ఐటీఐ, డిప్లొమా, ఏఎస్ఎం ఉత్తీర్ణులవ్వాలి.
- **స్టైపెండ్:** నెలకు రూ.7700 నుంచి రూ.8050 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేయాలి.
- **వెబ్‌సైట్:** www.apprenticeshipindia.org

ఈఎస్ఐసీ, కోల్‌కతాలో 41 ఫ్యాకల్టీ పోస్టులు

కోల్‌కతాలోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ).. ఒప్పంద ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 41
- **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్లు-03, అసోసియేట్ ప్రొఫెసర్లు-18, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-20.
- **విభాగాలు:** అనాటమీ, సైకియాట్రీ, పాథాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, రేడియాలజీ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎండీ /ఎంఎస్ /డీఎన్‌బీ /ఎంఎస్సీ /పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 8ఏళ్ల పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 69ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** ప్రొఫెసర్లకు నెలకు రూ. 2,28,942; అసోసియేట్ ప్రొఫెసర్లకు నెలకు రూ. 1,52,241; అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నెలకు రూ. 1,30,797 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఇంటర్వ్యూ తేది:** 14.11.2022 నుంచి 16.11.2022 వరకు జరుగుతాయి.
- **ఇంటర్వ్యూ వేదిక:** డీన్ ఆఫీస్, అకడమిక్ బ్లాక్, సెకండ్ ఫ్లోర్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్, జోకా, డైమండ్ హార్బర్ రోడ్, కోల్‌కతా-700104.
- **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 9 గంటల నుంచి
- **వెబ్‌సైట్:** www.esic.nic.in

ఐజీసీఏఆర్, కల్పక్కంలో 60 జేఆర్ఎఫ్‌లు

కల్పాక్కంలోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్(ఐజీసీఏఆర్)..జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 60
- **విభాగాలు:** ఫిజికల్ సైన్స్, కెమికల్ సైన్స్, ఇంజనీరింగ్ సైన్స్.
- **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఎస్/బీఈ/బీటెక్/బీఎస్సీ /ఎంఎస్/ఎంఎస్సీ/ఎంటెక్/ఎంఈ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్(ఆర్), రిక్రూట్‌మెంట్ సెక్షన్, ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్, కాంచీపురం జిల్లా, కల్పక్కం-603102, తమిళనాడు చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 12.11.2022
- **వెబ్‌సైట్:** www.igcar.gov.in

ఐహెచ్‌ఎం, ముంబైలో 21 పోస్టులు

ముంబైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషన్(ఐహెచ్‌ఎం), క్యాటరింగ్ టెక్నాలజీ-అప్లైడ్ న్యూట్రిషన్ (సీటీఏఎన్) వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 21
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ లెక్చరర్-కమ్-అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్-08, లోయర్ డివిజన్ క్లర్క్-07, టీచింగ్ అసోసియేట్-06.
- **అర్హత:** పోస్టును అనుసరించి 10+2 /డిగ్రీ/డిప్లొమా/పీజీ(హాస్పిటాలిటీ /టూరిజం) /ఎంబీఏ ఉత్తీర్ణులవ్వాలి.ఎన్‌హెచ్‌టీఈటీ అర్హత సాధించాలి. **వయసు:** 28 నుంచి 35 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.19,900 నుంచి రూ. 1,12,400 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** స్కిల్ టెస్ట్, రాతపరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపల్,ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీ-అప్లైడ్ న్యూట్రిషన్, వీర్ సావర్కర్ మార్గ్, దాదర్, ముంబై-400028 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 28.11.2022
- **వెబ్‌సైట్:** www.ihmctan.edu

బడి నుంచే భద్రతా దళాల్లో చేరేలా..!

» దేశవ్యాప్తంగా సైనిక్ స్కూల్స్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్
» జాతీయ స్థాయి ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» ప్రవేశం ఖరారైతే.. భవిష్యత్తులో త్రివిధ దళాల్లో చేరే సన్నద్ధత
» ఏఐఎస్ఎస్ఈఈ-2023 ప్రక్రియ ప్రారంభం



ఏఐఎస్ఎస్ఈఈ-2023

స్కూల్ స్థాయి నుంచే సైన్యంలో చేరేలా సన్నద్ధం చేసే వేదికలు.. సైనిక్ స్కూల్స్! భావి భారత పౌరులు భద్రతా దళాల్లో అడుగుపెట్టి.. దేశ సేవ చేసేలా బడిలోనే శిక్షణ ఇస్తాయి.. సైనిక పాఠశాలలు! అందుకే సైనిక్ స్కూల్స్‌లో తమ పిల్లలను చేర్పించాలని ఎంతో మంది తల్లిదండ్రులు ఆశిస్తుంటారు! 2023-24 విద్యా సంవత్సరానికి దేశ వ్యాప్తంగా ఉన్న సైనిక్ స్కూల్స్‌లో..ఆరు, తొమ్మిదో తరగతిల్లో ప్రవేశాల కోసం ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఏఐఎస్ఎస్ఈఈ-2023) నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో..సైనిక్ స్కూల్స్ ప్రాధాన్యత, ప్రవేశ పరీక్ష విధానం, మంచి మార్కుల సాధనకు ప్రిపరేషన్ తదితర వివరాలతో ప్రత్యేక కథనం...

సైనిక్ స్కూల్స్.. దాదాపు అయిదు దశాబ్దాల క్రితం ఏర్పాటైన విద్యా సంస్థలు. వీటి పర్యవేక్షణకు..రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సైనిక్ స్కూల్ సొసైటీని నెలకొల్పారు. ఈ స్కూల్స్ ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యా బోధన సాగిస్తున్నాయి. చదువుతోపాటు విద్యార్థులకు ధైర్య సాహసాలు నూరిపోస్తూ.. త్రివిధ దళాల్లో వారు చేరేలా శిక్షణ ఇస్తున్నాయి.

దేశవ్యాప్తంగా 33 స్కూళ్లు

- ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణలో 33 సైనిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఆరో తరగతిలో 2,894 సీట్లు, తొమ్మిదో తరగతిలో 379 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు 2023-24 విద్యా సంవత్సరం నుంచి పీపీపీ విధానంలో కొత్తగా మరో 18 సైనిక్ స్కూల్స్ ప్రారంభిస్తున్నారు. వీటిలో 1,590 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- అదే విధంగా 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఆరో తరగతిలో అమ్మాయిలకు కూడా ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించారు. ప్రతి సైనిక్ స్కూల్‌లో 10 సీట్లను విద్యార్థినులకు కేటాయించారు. తొమ్మిదో తరగతికి మాత్రం పురుష అభ్యర్థులనే అర్హులుగా పేర్కొన్నారు.
- ఆంధ్రప్రదేశ్‌లో కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో 68 సీట్లు, తొమ్మిదో తరగతిలో 22 సీట్లు, కలికిరిలో ఆరో తరగతిలో 70 సీట్లు, తొమ్మిదో తరగతిలో 30 సీట్లు ఉన్నాయి.
- పీపీపీ విధానంలో.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నంలో అదానీ వరల్డ్ స్కూల్ అందుబాటులోకి రానుంది. ఇందులో మొత్తం 50 సీట్లు ఉన్నాయి.
- ఏపీలోని సైనిక్ స్కూల్స్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు పోటీ పడొచ్చు.

అర్హతలు

- ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం ఏదైనా పాఠశాలలో ఐదో తరగతి చదువుతుండాలి. మార్చి 31, 2023 నాటికి 10 నుంచి 12ఏళ్ల మధ్య ఉండాలి.
- తొమ్మిదో తరగతిలో చేరాలనుకుంటున్న విద్యార్థులు ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతుండాలి. మార్చి 31, 2023 నాటికి 13 నుంచి 15 ఏళ్ల మధ్యలో ఉండాలి.

రాత పరీక్ష

- ప్రభుత్వ సైనిక్ స్కూల్స్‌తోపాటు, పీపీపీ విధానంలోని సైనిక పాఠశాలల్లో ఆరు, తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు సీట్లు ఖరారు చేస్తారు.
- ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు. ఈ పరీక్ష ఆరు, తొమ్మిది తరగతులకు వేర్వేరుగా ఉంటుంది.
- ఏఐఎస్ఎస్ఈఈలో సాధించిన ప్రతిభ, విద్యార్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న పాఠశాలల ప్రాధమ్యాల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి ప్రవేశం ఖరారు చేస్తారు.

ఆరో తరగతి పరీక్ష

సైనిక్ స్కూల్స్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో 125 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. లాంగ్వేజ్ 25 ప్రశ్నలు-50 మార్కులు, మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు-150 మార్కులు, ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు-50 మార్కులు, జనరల్ నాలెడ్జ్ 25 ప్రశ్నలు-50 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది. మ్యాథమెటిక్స్ విభాగంలో ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు, మిగతా విభాగాల్లో ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు.

తొమ్మిదో తరగతి పరీక్ష

- తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షను మొత్తం నాలుగు వందల మార్కులకు అయిదు విభాగాల్లో నిర్వహిస్తారు. ఇందులో 150 ప్రశ్నలు అడుగుతారు. మ్యాథమెటిక్స్ 50 ప్రశ్నలు-200 మార్కులకు, ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు-50 మార్కులకు, ఇంగ్లిష్ 25 ప్రశ్నలు-50 మార్కులకు, జనరల్ సైన్స్ 25 ప్రశ్నలు-50 మార్కులకు, సోషల్ సైన్స్ 25 ప్రశ్నలు-50 మార్కులకు ప్రశ్న పత్రం ఉంటుంది.
- మ్యాథమెటిక్స్ విభాగంలో ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు, మిగతా విభాగాల్లో ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష

- ఈ రెండు పరీక్షలు ఆఫ్‌లైన్ విధానంలోనే జరుగుతాయి.
- అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది.
- ఆరో తరగతి ప్రవేశ పరీక్షను ఇంగ్లిష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాలం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు తమకు నచ్చిన భాషలో పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు తెలుగు, ఉర్దూ మీడియంలను ప్రాంతీయ భాషలుగా పేర్కొని పరీక్ష రాసే అవకాశం ఉంది.
- తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షను మాత్రం ఇంగ్లిష్ మాధ్యమంలోనే నిర్వహిస్తారు.

హోంస్టేట్ కోటా విధానం

- సైనిక్ స్కూల్స్ ప్రవేశాల్లో హోంస్టేట్ కోటా విధానాన్ని అమలు చేస్తున్నారు.
- సదరు సైనిక్ స్కూల్ ఏర్పాటైన రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు ఆ పాఠశాలలో ఉన్న మొత్తం సీట్లలో 67 శాతం సీట్లను సొంత రాష్ట్రానికి చెందిన వారికి కేటాయిస్తారు. మిగతా 33 శాతం సీట్లను అదర్ స్టేట్ కోటా పేరుతో అన్ని రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తారు.
- హోంస్టేట్, అదర్ స్టేట్ కోటాల్లో అందుబాటులో ఉండే సీట్లలో 25 శాతం సీట్లను త్రివిధ దళాల్లో విధులు నిర్వహిస్తున్న వారి పిల్లలకు కేటాయిస్తారు.

మంచి మార్కులు సాధించాలంటే

- విద్యార్థులు ముందుగా తాము దరఖాస్తు చేసుకుంటున్న తరగతి ఆధారంగా అంతకుముందు తరగతులకు సంబంధించి అకాడమీ పుస్తకాలు, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేయాలి.
- ఆరో తరగతి ప్రవేశ పరీక్ష అభ్యర్థులు ప్రధానంగా నాలుగు, అయిదు తరగతుల మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ పుస్తకాలను చదవాలి.
- తొమ్మిదో తరగతి అభ్యర్థులు అయిదు నుంచి ఎనిమిది తరగతుల పుస్తకాలను ముఖ్యంగా మ్యాథమెటిక్స్, జనరల్ సైన్స్ అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు సంబంధించి గ్రామర్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఆర్టికల్స్, ప్రిపొజిషన్స్, వెర్బ్స్‌పై దృష్టి పెట్టాలి.
- జనరల్ సైన్స్‌కు సంబంధించి సైన్స్‌లోని ప్రాథమిక అంశాలు, మొక్కలు, బ్యాక్టీరియాలు, వ్యాధులు-కారకాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి.
- సోషల్ సైన్స్‌లో పర్యావరణం, హిస్టరీ, జాగ్రఫీ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా సివిక్స్‌కు సంబంధించిన ప్రాథమిక భావనలు తెలుసుకోవాలి.
- ఎకనామిక్స్‌లో జనాభా, జన గణన గణాంకాలు, పంటలు-ఉత్పత్తులు, అవి ఎక్కువగా పండే ప్రదేశాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- జనరల్ నాలెడ్జ్‌లో ముఖ్యమైన వ్యక్తులు,అవార్డులు-విజేతలు,ముఖ్యమైన ప్రదేశాలు,క్రీడలు-విజేతలు, ప్రధానమంత్రులు, రాష్ట్రపతి వంటి పదవులు చేపట్టిన వ్యక్తుల గురించి తెలుసుకోవాలి.
- అకడమిక్ పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ అంశాలను చదువుతూ ప్రిపరేషన్ సాగిస్తే.. పరీక్షలో మంచి మార్కులు సాధించి సీటు పొందే అవకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

భద్రతా దళాల్లో.. సైనిక్ స్కూల్స్ విద్యార్థులు

సైనిక్ స్కూల్స్ అందించే శిక్షణ ఫలితంగా.. ఈ పాఠశాలల నుంచి త్రివిధ దళాల్లో చేరే వారి సంఖ్య కొంత ఎక్కువగా ఉంటోందని చెప్పొచ్చు. ఎన్‌డీఏ పరీక్ష ద్వారా ప్రతి ఏటా ఎంపికయ్యే వారిలో 30 శాతం వరకు సైనిక్ స్కూళ్ల విద్యార్థులే ఉంటున్నారు. స్కూల్ స్థాయి నుంచే శిక్షణనివ్వడం, ఎన్‌సీసీ, ఇతర ఫిజికల్ ట్రైనింగ్ యాక్టివిటీస్ ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** నవంబర్ 30, 2022
- **ఏఐఎస్ఎస్ఈఈ పరీక్ష తేదీ:** జనవరి 8, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, గుంటూరు, కడప, కర్నూలు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్
- **వెబ్‌సైట్:** https://aissee.nta.nic.in, www.nta.ac.in

ఇంటింటా ఆనందం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటివద్ద ప్రజలు ఆనందంతో స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ బుధవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజాప్రతినిధులతో ప్రజలు చెప్పారు.


తూర్పుగోదావరి జిల్లా వేళ్లచింతలగూడెంలో మహిళకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


నంద్యాల జిల్లా పెద్దబోదనంలో ఓ కుటుంబంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి


ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట విద్యానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ఉదయభాను


గుంటూరు జిల్లా మున్నంగిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

క్లుప్తంగా

అసిస్టెంటు కన్జర్వేటర్ పోస్టుల నియామక పరీక్ష

సాక్షి, అమరావతి: అటవీశాఖలోని అసిస్టెంటు కన్జర్వేటర్ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి రాత పరీక్షలు ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నామని ఏపీపీఎస్సీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను కమిషన్ వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు సూచించింది.

మెడిసిన్ ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి: 2022–23 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎంఎస్, వివిధ యూజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రాథమిక మెరిట్ జాబితాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం విడుదల చేసింది. 10,690 మంది విద్యార్థులకు మెరిట్ జాబితాలో స్థానం దక్కింది. దరఖాస్తుల పరిశీలన అనంతరం 152 మంది అనర్హులుగా మిగిలారు. వీరి జాబితాను ప్రకటించారు. విద్యార్థులు అభ్యంతరాలను నాలుగో తేదీ సాయంత్రం లోగా ysrugmedadm22@ gmail. com కు పంపాల్సి ఉంటుంది. గడువు ముగిసిన అనంతరం అందిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకోరు.

10 వరకు ఇగ్నో పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) డిసెంబర్–2022లో నిర్వహించే టర్మ్ ఎండ్ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించే పరీక్ష ఫీజు గడువును 10 వరకు పొడిగించింది. 11 నుంచి 15వ తేదీ వరకు రూ.1,100 ఆలస్య రుసుముతో ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని విజయవాడ ప్రాంతీయ కేంద్రం ఇన్‌చార్జ్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత తెలిపారు. డిసెంబర్ సెషన్‌కు సమర్పించే అసైన్‌మెంట్ తేదీని ఈ నెల 30 వరకు పొడిగించినట్లు తెలిపారు. వివరాలకు 0866–2565253లో సంప్రదించాలని సూచించారు.

14న ట్రిపుల్ ఐటీ మూడో విడత కౌన్సెలింగ్

నూజివీడు: ఏపీలోని ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 14న మూడో విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు చాన్స్‌లర్ ఆచార్య కేసీరెడ్డి బుధవారం తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాతో పాటు ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల జాబితాను 9న వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు. గత రెండు విడతల్లో ఎంపికై చేరకుండా ఉన్న అభ్యర్థులకు ఆసక్తి ఉంటే మూడో విడత కౌన్సెలింగ్‌లో హాజరవ్వచ్చని, దీనికి గాను వర్సిటీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎవరైనా ప్రస్తుతం చేరిన ట్రిపుల్ ఐటీ నుంచి మరో ట్రిపుల్ ఐటీకి మారాలనుకునే వారు వర్సిటీ వెబ్‌సైట్‌లో ఇచ్చిన లింకులో నమోదు చేసుకోవాలన్నారు. మరొక ట్రిపుల్‌ఐటీకి మార్చిన తరువాత తప్పనిసరిగా అక్కడకు వెళ్లాలని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్‌లను ఈ నెల 6న సాయంత్రం 5 గంటల్లోపు పూర్తి చేసుకోవాలని కోరారు.

గ్రూప్‌-1 దరఖాస్తు గడువు 5 వరకు పొడిగింపు

ఏపీపీఎస్సీ ప్రకటన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రూప్‌–1 కేడర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు గడువును నవంబర్ 5వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని గ్రూప్‌–1 కేడర్‌లోని 92 పోస్టులకు నియామక ప్రక్రియ కోసం ఏపీపీఎస్సీ సెప్టెంబర్ 30న నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. ఈ పోస్టులకు నిర్వహించే పరీక్షల కోసం అక్టోబర్ 13 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 2వ తేదీతో(బుధవారంతో) గడువు ముగిసింది. అయితే గడువు పొడిగించాలని నిరుద్యోగ అభ్యర్థుల నుంచి వందలాదిగా ఏపీపీఎస్సీకి అభ్యర్థనలు అందడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఏపీపీఎస్సీ చైర్మన్ డి.గౌతమ్ సవాంగ్ తెలిపారు. సంబంధిత ఫీజును 4వ తేదీ రాత్రి 11.59లోపు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

డిసెంబర్ 18న ప్రిలిమ్స్

గ్రూప్‌–1 పోస్టుల నియామకాలకు సంబంధించి ప్రిలిమినరీ(స్క్రీనింగ్ టెస్టు)ని డిసెంబర్ 18న నిర్వహిస్తున్నట్టు ఏపీపీఎస్సీ చైర్మన్ తెలిపారు. దరఖాస్తు గడువు పొడిగించినా పరీక్ష తేదీల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. మెయిన్స్ పరీక్షలను మార్చి రెండో వారం తర్వాత చేపడతామని వెల్లడించారు.

దిగ్గజాల దృష్టి

రాష్ట్రంలో అదానీ, సెంచూరియన్ ప్లై, ఆదిత్య బిర్లా, ఆర్సెలర్ మిట్టల్, అపాచీ తదితర సంస్థల పెట్టుబడులు

- కోవిడ్ సంక్షోభంలోనూ కేంద్ర సగటు కంటే అధికంగా పారిశ్రామికోత్పత్తి రేటు
- 2021–22లో కేంద్ర పారిశ్రామికోత్పత్తి 8 శాతం కాగా రాష్ట్రంలో 11 శాతం నమోదు
- గత మూడేళ్లలో రూ.46,002 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి ప్రారంభం
- రూ.400 కోట్లతో కియా విస్తరణ • రూ.14,634 కోట్లతో అదానీ డేటా సెంటర్
- మూడు పారిశ్రామిక కారిడార్లలో మూడు భారీ పారిశ్రామిక నగరాలకు శ్రీకారం



సాక్షి, అమరావతి: ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో టాటాలు, బిర్లాలు, అదానీ, ఆర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్ లాంటి పారిశ్రామిక దిగ్గజాలు పెట్టుబడులు పెడుతుంటే టీడీపీ, దాని అనుకూల మీడియా మాత్రం పారిశ్రామిక ప్రగతి క్షీణించిందంటూ దుష్ప్రచారం చేయటాన్ని పరిశ్రమల శాఖ ఖండించింది. ఈ ప్రచారంలో వీసమెత్తు నిజం లేకపోగా పారిశ్రామిక ప్రగతిలో కేంద్రం కంటే రాష్ట్రం మెరుగైన పనితీరు కనపరుస్తోందని స్పష్టం చేసింది. రాష్ట్రానికి ఒక్క పెట్టుబడి కూడా రాలేదన్న ఆరోపణలు అబద్ధమని, రూ.17 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయనడం నిరాధారమని పేర్కొంది. కోవిడ్ సంక్షోభాన్ని తట్టుకొని పెట్టుబడుల ప్రవాహంతో రాష్ట్రం పరుగులు తీస్తున్నట్లు పరిశ్రమల శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎంఎస్‌ఎంఈలు రెట్టింపు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన జూన్ 2019 నుంచి నేటి వరకూ రాష్ట్రానికి 107 మెగా పరిశ్రమలు వచ్చాయి. వీటి ద్వారా రూ. 46,002 కోట్ల పెట్టుబడులు రావడంతోపాటు ఎంఎస్‌ఎంఈలు రెట్టింపు స్థాయిలో ఏర్పాటయ్యాయి. గత మూడున్నరేళ్లలో 1,06,249 ఎంఎస్‌ఎంఈలు ఏపీకి రావడం ద్వారా రూ.14,656 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 7,22,092 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. ఇవి కాకుండా మరో 57 మెగా పరిశ్రమలు పురోగతిలో ఉన్నాయి. వీటి ద్వారా రూ.91,243.13 కోట్ల పెట్టుబడులు, 1,09,307 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలకు చెందిన నాలుగు ప్రాజెక్టుల ద్వారా రూ.1,06,800 కోట్ల పెట్టుబడులతో పాటు 79,200 మందికి ఉద్యోగాలు రానున్నాయి. సీఎం జగన్ అధ్యక్షతన సమావేశమైన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు రూ.1,73,021.55 కోట్ల పెట్టుబడులు, 1,38,403 మందికి ఉద్యోగాలందించే 45 భారీ పరిశ్రమలకు ఆమోదం తెలిపింది.

కియా అదనపు పెట్టుబడులు..

కియా అనుబంధ సంస్థలు చెన్నై, హైదరాబాద్ తరలనున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదు. శ్రీసత్యసాయి జిల్లాలోనే కియా అనుబంధ పరిశ్రమలన్నీ కొలువుదీరాయి. కియా అదనంగా రూ.400 కోట్లతో విస్తరణ పనులు చేపట్టింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా విశాఖ మధురవాడలో శంకుస్థాపన జరగనున్న అదానీ డేటా సెంటర్ (ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్ పార్క్ / బిజినెస్ పార్క్) ద్వారా రూ.14,634 కోట్ల పెట్టుబడులు, 24,990 మందికి ఉద్యోగాలు రానున్నాయి. విశాఖ రుషికొండ ఐటీ సెజ్ నుంచి ఏ కంపెనీ తరలిపోలేదు. లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థలు రూ.వేల కోట్ల విలువైన భూములను తీసుకుని గడువులోగా పనులు చేపట్టకపోవడంతో ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దు చేసి వెనక్కు తీసుకుంది. ప్రకాశం జిల్లాలో ఏషియన్ పల్ప్ పేపర్ పరిశ్రమ ఒప్పందం సాంకేతిక కారణాలతో రద్దయింది.

కొత్తగా మూడు పారిశ్రామిక నగరాలు

విశాఖ – చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రెండు గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ నోడ్‌లను తీర్చిదిద్దింది. నక్కపల్లి, రాంబిల్లి క్లస్టర్, ఏర్పేడు, శ్రీకాళహస్తి పారిశ్రామిక క్లస్టర్లలో మౌలిక సదుపాయాలను కల్పించింది. నాయుడుపేటలో 276 పరిశ్రమల ఏర్పాటుతో రూ.3,051 కోట్ల పెట్టుబడులు, 9,030 ఉద్యోగాలను కల్పించింది. అచ్యుతాపురంలో 2,272 పరిశ్రమల ఏర్పాటుతో రూ.12,381 కోట్ల పెట్టుబడులు, 60 వేల మందికి ఉద్యోగాలు లభించాయి. వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో 6,740 ఎకరాలను పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దేందుకు వేగంగా అడుగులు వేసింది. కొప్పర్తి కేంద్రంగా మోడల్ ఇండస్ట్రియల్ పార్కు, ఎంఎస్ఈ సీడీపీ, వైఎస్సార్ ఈఎంసీ, వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రణాళికతో ముందుకెళుతోంది. రూ. 2595.74 కోట్ల నిక్‌డిక్ట్ నిధులతో కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే అక్కడ 66 పరిశ్రమలు కొలువుదీరాయి. ప్లగ్ అండ్ ప్లే పరిశ్రమల కోసం నాలుగు షెడ్ల నిర్మాణం పూర్తయింది. తద్వారా రూ.1,875.16 కోట్ల పెట్టుబడులు, 13,776 మందికి ఉద్యోగాలిచ్చేందుకు కొప్పర్తి సిద్ధమైంది.

గత సర్కారు బకాయిలూ చెల్లింపు..

పారదర్శకంగా పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విధానం 2020 - 23 తెచ్చింది. 'వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం' ద్వారా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పాలసీ రూపొందించింది. గత సర్కారు పెండింగ్‌లో పెట్టిన రూ.3409 కోట్ల ప్రోత్సాహకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెల్లించింది. 11,059 ఎంఎస్ఎంఈ యూనిట్లకు సంబంధించి రూ.1324.53 కోట్ల బకాయిలతో పాటు రూ.962.05 కోట్ల బకాయిలు (7,039 ఎంఎస్‌ఎంఈలకు మంజూరు) కూడా అందచేసింది. 75 భారీ, మెగా యూనిట్లకు గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ.380.85 కోట్ల ప్రోత్సాహకాలను కూడా క్లియర్ చేసింది. వీటిలో ఆర్థిక సంక్షోభంలో ఉన్న 49 టెక్స్‌టైల్ యూనిట్లకు రూ.242.13 కోట్లు విడుదల చేసింది.

కేంద్ర సగటు కంటే అధికంగా..

గత సర్కారు హయాంలో 2018–19లో పరిశ్రమల రంగం జీవీఏ వృద్ధి రేటు (స్థిరమైన ధరల వద్ద) 3.17% మాత్రమే ఉంది. 2020–21లో లాక్‌డౌన్ వల్ల ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికోత్పత్తి ఆగిపోయింది. ఆ ఏడాది కేంద్రం జీవీఏ -3.33 శాతం నమోదు కాగా రాష్ట్రంలో వృద్ధి రేటు 0.33%గా నమోదైంది. 2021–22లో కేంద్ర పారిశ్రామికోత్పత్తిలో 8% శాతం వృద్ధి నమోదు చేస్తే రాష్ట్రం రెండంకెల వృద్ధి 11% సాధించింది. కోవిడ్ సంక్షోభం వచ్చినా రెండేళ్లు కేంద్ర సగటు కంటే రాష్ట్రం మెరుగైన పనితీరును కనపరచింది.

ఓర్వకల్లులో భారీ పారిశ్రామిక నగరం

చెన్నై – బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నం పారిశ్రామిక నోడ్‌ను తీర్చిదిద్దుతోంది. తిరుపతి జిల్లాలో 2,500 ఎకరాలలో క్రిస్ సిటీ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కోసం రూ.1,448 కోట్లను వెచ్చిస్తూ టెండర్లను పిలిచింది. దీని ద్వారా రూ.5 వేల కోట్ల పెట్టుబడులు, 14 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని అంచనా. హైదరాబాద్ – బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ను సాధించడమే కాకుండా ఓర్వకల్లు వద్ద భారీ పారిశ్రామిక నగరాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది.

దావోస్ పర్యటనతో రూ.1,26,000 కోట్ల పెట్టుబడులు

దావోస్ పర్యటనలో అదానీ, అరబిందో, గ్రీన్ కో గ్రూప్, ఏస్ అర్బన్ డెవలప్ మెంట్ సంస్థలతో పంప్డ్ హైడ్రో స్టోరేజ్, సోలార్ పవర్, విండ్ పవర్ ప్రాజెక్ట్స్ నెలకొల్పేలా రూ. 1,26,000 కోట్ల పెట్టుబడుల కోసం ప్రభుత్వం నాలుగు ఒప్పందాలను కుదుర్చుకుంది. వీటి అమలు ద్వారా రాష్ట్ర యువతకు 38 వేల ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పు ప్రక్రియ పరిపూర్ణం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులేకుండా డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ అధికారులు అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీగా వెబ్‌సైట్‌ను మార్చడంతో పాటు, అన్నింట్లో మార్పులు చేస్తున్నారు. ఇప్పటికే యూనివర్సిటీలోని అన్ని విభాగాల్లో పేర్లు మార్చారు. యూనివర్సిటీ భవనంపై ఉన్న పేర్లు సైతం మార్చేశారు. యూనివర్సిటీ నిధులకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్లు, ఇతరత్రా పేర్లు సైతం మార్పు చేసేలా బుధవారం చర్యలు తీసుకున్నారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ముందస్తు చర్యలను యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్‌తో పాటు ఇతర అధికారులు సమీక్షిస్తున్నారు. విదేశాలకు వెళ్లే వైద్య విద్యార్థులకు సైతం ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సమగ్ర చర్యలు తీసుకుంటున్నారు. ఇక మీదట అన్ని కార్యకలాపాలు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పేరుతోనే నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

జమ్ము ప్రాథమిక పాఠశాలకు జాతీయ పురస్కారం

సాక్షి, అమరావతి: విజయనగరం జిల్లాలోని జమ్ము మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి ఎంపికైనట్లు పాఠశాల విద్య కమిషనర్, సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సురేష్‌కుమార్ బుధవారం తెలిపారు. 2021–22 విద్యా సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఓవరాల్ కేటగిరీలో 34 పాఠశాలలు, సబ్ కేటగిరీలో 5 పాఠశాలలకు ఎంపికకాగా, తెలుగు రాష్ట్రాల్లో మన రాష్ట్రానికి ఓవరాల్ కేటగిరి పురస్కారం లభించిందని వివరించారు. 19న ఢిల్లీలో ఈ పురస్కారంగా రూ.60 వేల బహుమతి, జ్ఞాపిక అందుకోనున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు, సిబ్బందికి, విద్యార్థులకు సమగ్రశిక్ష రాష్ట్ర అదనపు ప్రాజెక్టు డైరెక్టర్లు బి.శ్రీనివాసరావు, డాక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి, కేజీబీవీ సెక్రటరీ జి.నాగమణి అభినందనలు తెలిపారు.

అప్పులు, ప్రగతిపై అడ్డగోలుగా అబద్ధాలు

- యనమలపై ఆర్థిక మంత్రి బుగ్గన మండిపాటు
- ఖజానా ఖాళీ చేసి భారీ అప్పులు, బకాయిలతో దిగిపోయిన టీడీపీ
- విద్యపై రూ.53 వేల కోట్లు వ్యయం చేశాం



సాక్షి, అమరావతి: రాష్ట్ర అప్పులు, పారిశ్రామిక ప్రగతితో పాటు వ్యవసాయం, విద్య, వైద్య రంగాలపై టీడీపీ నేత యనమల రామకృష్ణుడు ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ఖజానాను పూర్తిగా ఖాళీ చేయడమే కాకుండా భారీ అప్పులతో ఏకంగా రూ.40 వేల కోట్లు బకాయిలు పెట్టి దిగిపోయిన యనమల రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లుతూ బుకాయించటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. బుధవారం సచివాలయంలో బుగ్గన మాట్లాడారు.

- నీతి ఆయోగ్ 10 అంశాలతో నివేదిక ఇస్తే తనకు అనుకూలమైన ఒక అంశానికి చెందిన అంకెలను తీసుకుని యనమల తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారు. సున్నా వడ్డీని రైతులకు చెల్లించకుండా టీడీపీ సర్కారు రూ.784.71 కోట్ల బకాయిలు పెడితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ మొత్తాన్ని 39.06 లక్షల మంది రైతులకు చెల్లించింది. ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఇప్పటికే రూ.1795.45 కోట్లు చెల్లించాం. 8.76 లక్షల మంది కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రూ.5,915 కోట్ల పంట రుణాలు ఇప్పించాం.
- విద్య, వైద్య రంగాల్లో నాడు – నేడు కింద చేపట్టిన పనులను యనమల తుని నియోజకవర్గానికి వెళ్లి పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయి. నాడు–నేడుతోపాటు అమ్మఒడి, గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, సంపూర్ణ పోషణ తదితరాలకు మూడేళ్లలో రూ.53,337 కోట్లు వ్యయం చేశాం. జాతీయ ఆరోగ్య సూచికలో 2017–18లో ఏపీ నాలుగో స్థానంలో ఉండగా ఇవాళ 10వ స్థానంలో ఉందని యనమల పచ్చి అబద్ధాలాడుతున్నారు. 2019–20లో ఏపీ 4వ స్థానంలో ఉంది. వైద్య రంగంలో 2017–18లో 65.13 స్కోర్‌తో నాలుగో స్థానంలో ఉంటే 2019–20లో 69.95 స్కోర్‌తో మార్కులు పెరిగాయి. మా ప్రభుత్వం 104, 108 వాహనాలు 1,108 కొనుగోలు చేసింది.
- సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో 2018–19లో 68 మార్కులుంటే 2020–21లో 77 మార్కులకు పెరిగాయి. రాష్ట్ర స్థూల ఉత్పత్తి విషయంలో యనమల తనకు అనుకూలమైన లెక్కలు తీసుకుని వక్రీకరిస్తున్నారు. 2018–19లో తొలి అడ్వాన్స్ అంచనాల్లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.6,80,332 కోట్లుగా అంచనా వేయగా కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల శాఖ ప్రకటించిన మూడో రివైజ్డ్ అంచనాల మేరకు రూ.6,26,614 కోట్లకు తగ్గింది. అంటే 11 శాతం నుంచి వృద్ధి 5.66 శాతానికి తగ్గింది. మరి ఇది ఎవరి నిర్వాకం? ఎవరిని తప్పుబట్టాలి?
- టీడీపీ హయాంలో అప్పులు భారీగా పెరిగాయి. టీడీపీ పాలనలోవార్షిక సగటు అప్పుల వృద్ధి 19.44 శాతం కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అప్పుల్లో సగటు వార్షిక వృద్ధి 15.46 శాతం మాత్రమే. కోవిడ్ వల్ల రెండేళ్ల పాటు ఇబ్బందులు ఎదురైనా ఆర్థికంగా మెరుగ్గానే ఉన్నాం.
- నీటిపారుదల, వ్యవసాయం గురించి మాట్లాడే హక్కు టీడీపీకి లేదు. టీడీపీ హయాంలో పది లక్షల ఎకరాలకు అదనంగా నీరు ఇచ్చినట్లు అవాస్తవాలు చెబుతున్నారు. పోలవరాన్ని పక్కనపెట్టి కమీషన్ల కోసం పట్టిసీమ చేపట్టారు. పోలవరం జాప్యానికి టీడీపీ సర్కారు నిర్వాకమే కారణం. టీడీపీ హయాంలో రహదారుల నిర్మాణానికి ఏడాదికి రూ.2,110 కోట్లు వ్యయం చేస్తే ఇప్పుడు రూ.2,800 కోట్లు వెచ్చిస్తున్నాం.
- టీడీపీ హయాంలో సగటున ఏడాదికి రూ.11, 994 కోట్ల పెట్టుబడులు వస్తే ఇప్పుడు రూ.13, 201 కోట్లు వస్తున్నాయి. పెద్ద, మెగా పరిశ్రమలు 107 రాగా ఎంఎస్ఎంఈలు 1,06,249 యూనిట్లు వచ్చాయి. వాటి పెట్టుబడి రూ.14,656 కోట్లు. మరో 57 ప్రాజెక్టులు రూ.91,243 కోట్ల పెట్టుబడితో పురోగతిలో ఉన్నాయి. నాలుగు ప్రభుత్వ రంగ సంస్థలు రూ.1,06,800 కోట్లతో నిర్మాణ దశలో ఉన్నాయి. మరో 63,509 ప్రాజెక్టుల పనులు ప్రారంభ దశలో ఉన్నాయి.

అది రాజకీయ యాత్రే

▶ మొదటి పేజీ తరువాయి

ఎందుకు పాదయాత్ర చేస్తున్నారని ప్రశ్నించింది. రాజధాని వ్యవహారంపై సుప్రీంకోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉండగా ఇలాంటి యాత్రలు చేయడం ఏమిటంటూ నిలదీసింది. యాత్రల ద్వారా కోర్టులపై ఒత్తిడి తెస్తున్నారా? అంటూ అసహనం వ్యక్తం చేసింది. రాజధాని అమరావతి విషయంలో తమ తీర్పును ప్రభుత్వం అమలు చేయకపోతే కోర్టుధిక్కార పిటిషన్ వేసుకోవాలేగానీ ఇలా యాత్రలు చేయడం ఏమిటని ప్రశ్నించింది. ధిక్కార పిటిషన్ దాఖలు విషయంలో కూడా యాత్ర చేస్తారా? అంటూ వ్యంగ్యంగా అడిగింది. న్యాయస్థానం పరిధిలో ఉన్న వ్యవహారాల్లో యాత్రల వంటి చర్యలను తాము ఎంతమాత్రం అభినందించబోమంది. హైకోర్టు రైతుల పిటిషన్లతో నిండిపోతోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఏ కోర్టులో చూసినా రైతుల పిటిషన్లే కనిపిస్తున్నాయంది. ఇదే సమయంలో మూడు రాజధానుల కోసం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించడం, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలంటూ నిరసన కార్యక్రమాలు చేపట్టడం వంటి చర్యలు కూడా సరికాదంది. ప్రభుత్వం ఇలాంటి వాటికి ఎందుకు అనుమతినిస్తోందని ప్రశ్నించింది. రైతుల మహాపాదయాత్రలో 600 మందే ఉండాలంటూ సెప్టెంబర్ 9న ఇచ్చిన ఉత్తర్వులను, ఇతరులెవ్వరూ సంఘీభావం పేరుతో రైతుల యాత్రలో పాల్గొనరాదంటూ గత నెల 21న ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రాజధాని రైతుపరిరక్షణ సమితి, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య అప్పీళ్లు దాఖలు చేయడంపై హైకోర్టు అభ్యంతరం లేవనెత్తింది. అమరావతి పరిరక్షణ సమితి దాఖలు చేసిన వ్యాజ్యాల ఆధారంగా ఈ కోర్టు సెప్టెంబర్ 9న, అక్టోబర్ 21న ఉత్తర్వులిచ్చిందని, ఆ వ్యాజ్యాల్లో రాజధాని రైతుపరిరక్షణ సమితి, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య పార్టీలు కాదని, అలాంటప్పుడు ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ అప్పీళ్లు ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించింది. సింగిల్ జడ్జి ముందే రిట్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని తేల్చి చెప్పింది. 600 మంది కాదు, వేలమందితో పాదయాత్ర చేస్తామని సింగిల్ జడ్జి వద్దే పిటిషన్ దాఖలు చేసుకోవాలంది. అంతేతప్ప మీరు (రాజధాని రైతుపరిరక్షణ సమితి, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య) అప్పీళ్లు దాఖలు చేయడానికి వీల్లేదని పునరుద్ఘాటించింది. అసలు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు మీకున్న అర్హత ఏమిటో చెప్పాలని ఆ రెండు సంఘాలను ఆదేశించింది. సంబంధంలేని వ్యక్తులు దాఖలు చేసే అప్పీళ్లను అనుమతిస్తూపోతే ప్రతి ఒక్కరు అప్పీళ్లు దాఖలు చేస్తారని, ఇందుకు తాము ఎంత మాత్రం అనుమతించబోమని స్పష్టం చేసింది. ఈ అప్పీళ్ల విచారణార్హతపై ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలు చేసిన కౌంటర్ తమ ముందున్న రికార్డుల్లో చేరకపోవడంతో ఆ కౌంటర్‌ను తమ ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 7కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

సంబంధం లేని సంఘాల అప్పీళ్లు...

డీజీపీకి ఇచ్చిన జాబితాలో ఉన్న 600 మంది రైతులు మాత్రమే మహాపాదయాత్రలో పాల్గొనాలంటూ అమరావతి పరిరక్షణ సమితి దాఖలు చేసిన వ్యాజ్యంలో సెప్టెంబర్ 9న సింగిల్ జడ్జి ఆదేశాలిచ్చారు. 600 మందే యాత్రలో పాల్గొనాలని చెప్పిన నేపథ్యంలో సంఘీభావం పేరుతో యాత్రలో ఇతరులెవ్వరూ పాల్గొనడానికి వీల్లేదంటూ మరో సింగిల్ జడ్జి గత నెల 21న ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ పాదయాత్రతో ఏ మాత్రం సంబంధం లేని రాజధాని రైతుపరిరక్షణ సమితి, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య వేర్వేరుగా ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశాయి. అలాగే అప్పీళ్ల దాఖలుకు అనుమతి కోరుతూ అనుబంధ పిటిషన్లు వేశాయి. ఈ అప్పీళ్లపై బుధవారం సీజే ధర్మాసనం విచారించింది.

ఆ ఉత్తర్వులు మా హక్కులను హరించడమే..

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. యాత్రను 600 మందికే పరిమితం చేయడం ఎంతమాత్రం సరికాదన్నారు. అలా సంఖ్యను నిర్దేశించే అధికారం న్యాయస్థానాలకు లేదని చెప్పారు. అలాంటి ఉత్తర్వులు యాత్రలో పాల్గొనాలనుకునే వారి హక్కులను హరించడమేనని తెలిపారు. కోర్టు విధించిన షరతుల వల్ల సంఘీభావం తెలిపే హక్కులను కోల్పోతున్నామన్నారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. రైతుల పాదయాత్రపై ఘాటు వ్యాఖ్యలు చేసింది. అనంతరం ఆదినారాయణరావు తన వాదనలను కొనసాగిస్తూ ప్రభుత్వ చర్యలను తప్పుపడుతూ నిరసన తెలిపే హక్కు పౌరులకు ఉందన్నారు. అలాగే నిరసన తెలియజేస్తున్న వారికి సంఘీభావం తెలిపే హక్కు కూడా ఉందని చెప్పారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను అడ్డంపెట్టుకున్న పోలీసులు పాదయాత్ర చేస్తున్న రైతులను అడ్డుకుంటున్నారని తెలిపారు. భారత్ జోడో యాత్ర పేరుతో రాహుల్ గాంధీ చేస్తున్న యాత్రకు లేని ఆంక్షలు రైతుల మహాపాదయాత్రకు ఎందుకని ప్రశ్నించారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు


ప్రసంగిస్తున్న ఎం.వెంకయ్య నాయుడు

ఏయూక్యాంపస్: ప్రజల భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. బుధవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన జీఎంసీ బాలయోగి ధర్మనిధి ప్రసంగంలో ఆయన 'పార్లమెంటరీ డెమోక్రసీ' అనే అంశంపై ప్రసంగించారు. తాను బాలయోగి ఏయూ న్యాయ కళాశాల విద్యార్థులుగా ఏయూ నుంచి ఎదిగి రాజ్యసభ, లోక్‌సభ అధ్యక్షస్థానాలను అధిరోహించామన్నారు. బాలయోగి ఎంతో మృదుస్వభావం కలిగిన వ్యక్తి అని, ఆయన సభను నడిపించిన విధానాన్ని గుర్తుచేసుకున్నారు. చట్టసభల్లో అడుగిడిన వ్యక్తులు తమ ప్రవర్తన, మాటతీరు ఎంతో హుందాతనంగా నిలుపుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలు సైతం తమ సభ్యులకు ప్రత్యేక ప్రవర్తన నియమావళిని తయారు చేయాలని సూచించారు. విద్యాసంస్థలు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ తరఫున వెంకయ్యనాయుడుని సత్కరించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు మార్గం చూపేలా 'పాలీటెక్ ఫెస్ట్'

సాక్షి, అమరావతి: విద్యార్థుల భవిష్యత్తుకు మార్గం చూపేలా నవంబర్ 24 నుంచి 26 వరకు పాలీటెక్ ఫెస్ట్– 2022 నిర్వహిస్తున్నామని సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు చదలవాడ నాగరాణి తెలిపారు. విజయవాడ వేదికగా మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 800 పైగా సృజనాత్మక ప్రాజెక్టులు ప్రదర్శితమవుతాయని బుధవారం పేర్కొన్నారు. ఈ ఫెస్ట్ వల్ల విద్యార్థులు తమ సమాచారం నైపుణ్యత, సాంకేతికతలను పరస్పరం మార్పిడి చేసుకోగలుగుతారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఇందులో పాల్గొననున్నారని చెప్పారు. ఈ సంవత్సరం టెక్ ఫెస్ట్ లో 84 ప్రభుత్వ, 173 ప్రైవేట్ పాలిటెక్నిక్‌లు పాల్గొననుండగా, తొలుత జిల్లాస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి, ఆ తరువాత రాష్ట్ర స్థాయి పాలీ టెక్ ఫెస్ట్ కు విద్యార్థులను సన్నద్ధం చేస్తామన్నారు. విద్యార్థులను ప్రోత్సహించే క్రమంలో రాష్ట్ర స్థాయిలో తొలి మూడు స్థానాలు దక్కించుకున్నవారికి లక్ష , 50 వేలు, 25 వేల రూపాయల నగదు బహుమతులు, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన వారికి 25 వేలు, 15 వేల రూపాయల నగదు బహుమతులు అందిస్తామన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.